శ్రీమతే రామానుజాయ నమః

ఉభయవేదాంత మహావిద్వాన్, వాగమృతవర్షి, వేళుక్కుడి
ఉ.వే. శ్రీమాన్ వరదాచార్యస్వామివారు అనుగ్రహించిన

శ్రీభాష్యసారం

వాగమృతవర్షివరదాచార్యై ర్విరచిత మభిజ్ఞరమణీయమ్ ।
శ్రీభాష్యసార మాంధ్ర్యాం కురుతే శ్రీశంగరాచార్యః ॥

పాదుకే యతిరాజస్య కథయంతి యదాఖ్యయా ।
తస్య దాశరథేః పాదౌ శిరసా ధారయామ్యహమ్ ॥

శ్రీవేదవ్యాస భగవానుడు అనుగ్రహించిన (రచించిన) బ్రహ్మ సూత్రాలనే శారీరక మీమాంసాశాస్త్రానికి భగవద్రామానుజులు అనుగ్రహించిన విపుల వ్యాఖ్యానమైన శ్రీభాష్యంలోని సారార్థాలు సంగ్రహంగా నివేదింపబడుతున్నాయి.

ప్రపద్యే ప్రణవాకారం భాష్యం రంగ మివాపరమ్ ।
పరస్య బ్రహ్మణో యత్ర శేషిత్వం స్ఫుటమీక్ష్యతే ॥

ఇంకొక శ్రీరంగవిమానంవలె, ప్రణవాకారంగా ప్రకాశించే శ్రీభాష్యాన్ని శరణు పొందుతున్నాను. ఈ శ్రీభాష్యంలో, ప్రణవంలో, శ్రీరంగవిమానంలో పరబ్రహ్మ యొక్క శేషిత్వం స్ఫుటంగా దర్శనమిస్తున్నది.

ప్రణవమనే ఓంకారంలో, శ్రీభాష్యంలోను ప్రకాశించే పరమాత్మ యొక్క శేషిత్వం - ఇతరులచే పొందింపబడిన అతిశయాన్ని (గొప్పతనాన్ని) కల్గి ఉండడం. శ్రీరంగవిమానంలో ప్రకాశించే శేషిత్వం - శేషశాయిత్వమనే శేషిత్వ తారతమ్యం గమనించదగినది.

సకలవేదసంగ్రహమైన తిరుమంత్రంలోని మూడు పదాలద్వారా **(ఓమ్, నమః, నారాయణాయ)** అనే మూడు పదాలద్వారా జీవాత్మయొక్క అనన్యార్హ

శేషత్వం, అనన్యశరణత్వం, అనన్యభోగ్యత్వం - అనే జీవుని ఆకారత్రయం శాబ్దంగా ప్రతిపాదింపబడింది.

పరమాత్మయొక్క శేషిత్వ, శరణ్యత్వ, ప్రాప్యాలనే ఆకారత్రయం ఇందులో ఆర్థంగా (అర్థం ద్వారా) లభిస్తుంది. భగవానుని ఆవేశావతారమైన శ్రీవేదవ్యాస భగవానులు నాల్గు అధ్యాయాల రూపంలోని శారీరక మీమాంసా శాస్త్రంలో - మొదటి రెండు అధ్యాయాలలో పరమాత్మయొక్క జగదేక కారణత్వాన్ని, చేతనాచేతన విలక్షణత్వాన్ని, సర్వశేషిత్వాన్ని నిరూపించారు. ఇదే ప్రణవార్థనిరూపణం, మూడవ అధ్యాయంలో పరబ్రహ్మం ఉపాయమని నిరూపించారు. ఇదే నమశ్శబ్దార్థం. నాల్గవ అధ్యాయంలో పరబ్రహ్మం ప్రాప్యమని నిశ్చయించి తెలిపారు. ఇదే అష్టాక్షరిలోని తృతీయపదార్థం. ఈ అర్థాలను శ్రీరామానుజులు శ్రీభాష్యంలో తెలిపారు. ఈ విషయాన్ని క్రమంగా వివరిస్తాను.

వేదాంతాలలో జగత్కారణ వస్తువే ధ్యేయం (ధ్యానించదగినది- ఉపాసించ దగినది), శరణ్యం (ఆశ్రయించదగినది). అనే నియమం చూపబడింది. భక్తి అయినా, ప్రపత్తి అయినా- ఇవి జగత్కారణత్వ విషయంలోనే అనుష్ఠించదగినవి - అనేదే వేదాంతసిద్ధాంతం. బ్రహ్మకార్య భూతుడైన సంసారిజీవాత్మ, తనతో సమానుడైన ఇంకొక సంసారిని శరణంగా (ఉపాయంగా) ఆశ్రయించడం- అనేది **"ఓట్టై ఓడత్తోడు ఒ౬ుకలోడుమ్"** (చిన్నచిల్లును కల పడవ ఇంకొక, చిన్న ద్వారాన్ని కల పడవను ఆశ్రయించడం) వంటిదే కాగలదు; అంతే. **"తాపత్రయాతురైः అమృతత్వాయ స ఏవ జిజ్ఞాస్యः"** - (ఆధ్యాత్మిక, ఆధిదైవిక, ఆధిభౌతిక తాపాలవల్ల ఆర్తిని పొందినవారిచే అమృతత్వాన్ని - అంటే - మోక్షస్థితిని పొందడంకోసం ఆ పరబ్రహ్మమే తెలియదగినది) అనే రీతిలో జగత్కారణరూపబ్రహ్మమే సంసారిజనులకు జిజ్ఞాస్యం, ఉపాస్యం, శరణ్యం - అని సిద్ధాంతీకరింపబడింది. **"కారణం తు ధ్యేయः"** (జగత్కారణ వస్తువే ధ్యానించదగినది) అని, **"యో బ్రహ్మాణం విదధాతి పూర్వమ్.... ముముక్షుర్వై శరణ మహం ప్రపద్యే"** (చతుర్ముఖ బ్రహ్మను సృష్టించిన కారణవస్తువును ముముక్షువైన నేను శరణు పొందు తున్నాను) అని కదా వేదాంతఘోషం. ఈవేదాంత సిద్ధాంతాన్ని లోకంలో స్థాపించడం కోసమే శ్రీవ్యాస భగవానుల

అవతారం. ఈ సందర్భంలో- "నారా యణునివల్ల కల్గిన జ్ఞానం కృతయుగంలో స్థిరంగా నిలచి ఉన్నది. త్రేతాయుగంలో కొంచెం మార్పును పొందింది. ద్వాపరయుగంలో ఇంకా చెదఱిపోయింది. గౌతముని శాపంవల్ల జ్ఞానం అజ్ఞానభావాన్ని పొందగా తత్త్వనిశ్చయం కలుగనందున సంకీర్ణమైన బుద్ధిని కలవారైన బ్రహ్మ మొదలైన దేవతలు, రక్షణలో సమర్థుడు, దోషరహితుడైన నారాయణుని శరణు పొందారు. అపుడు ఆఱు గుణాలను కల్గినవాడు, మహాయోగి అయిన పురుషోత్తముడు శ్రీపరాశరమహర్షివల్ల సత్యవతీదేవి గర్భంలో అవతరించాడు. భగవానుడే స్వయంగా వ్యాసరూపియై అవతరించి, చెదఱిపోయిన వేదాలను ఉద్ధరించాడు. వాటిని నాల్గుగా విభాగించాడు. వాటి అర్థాలను తెలుపడం కోసం బ్రహ్మసూత్రాలను రచించాడు.'' అనే స్కాందోక్తచరిత్రం ఇక్కడ అనుసంధేయం. ఈ వ్యాసుడు అనుగ్రహించిన బ్రహ్మసూత్ర ప్రబంధం **"సాత్రీ సంఖ్యా శుభాశీः అధికృతిగణనా చిన్మయీ బ్రహ్మకాండే"** (అధికరణ సారావళి) అనే రీతిలో 545 సూత్రాలు, 156 అధికరణాలు, 16 పాదాలు, 4 అధ్యాయాలు కల్గినది. ఈ గ్రంథానికి అనేక వ్యాఖ్యానాలు అవతరించినా, భగవద్రామానుజులు అనుగ్రహించిన భాష్యమే శ్రీభాష్యమనే పేరుతో కీర్తింపబడుతున్నది. ఇటువంటి శ్రీభాష్యంలోని సారాన్ని అనుభవిద్దాం.

శ్రీవేదవ్యాసుల శిష్యులైన జైమిని 16 అధ్యాయాలను కల మీమాంసా శాస్త్రాన్ని అనుగ్రహించారు. అది పూర్వమీమాంస, (కర్మమీమాంస) అని అనబడుతున్నది. మొదటి పన్నెండు అధ్యాయాలలో జ్యోతిష్టోమాది కర్మలను గూర్చి విచారించి, తరువాత గల నాల్గు అధ్యాయాలలో కర్మారాధ్యులైన దేవతలను గూర్చి జైమిని విచారించారు. వారి ఆచార్యులైన వ్యాసులు, తరువాత గల 4 అధ్యాయాలలో బ్రహ్మవిచారాన్ని చేశారు. ఇదే ఉత్తరమీమాంస - బ్రహ్మమీమాంస - అని అనబడుతున్నది. జైమిని మొదటి పన్నెండు అధ్యాయాలలో ఏ కర్మలనుగూర్చి విచారించారో, ఆ కర్మలకు ఆరాధ్యమై, తరువాత నాల్గు అధ్యాయాలలో ఏ దేవతలనుగూర్చి విచారించారో, ఆ దేవతలకు అంతరాత్మభూతమై ఉండే బ్రహ్మాన్నిగూర్చి నాల్గు అధ్యాయాలలో

శ్రీవేదవ్యాస భగవానులు విచారించి నిష్కర్షించారు. ఈవిధంగా సర్వకర్మ సమారాధ్యమై, సర్వదేవతాంతరాత్మ భూతమైన పరబ్రహ్మమే వేదాంతవేద్య మనేదే శ్రీవేదవ్యాససిద్ధాంతం. కనుక, మీమాంసాశాస్త్రం 20 అధ్యాయాలను కల్గినదని తేలుతున్నది. ఈ పూర్వోత్తరమీమాంసలు రెండు కలిపి ఒకే శాస్త్రమనేది మన పూర్వాచార్యులు దర్శించిన క్రమం. **"అర్థైకత్వాత్ ఏకం వాక్యం, సాకాంక్షం చేత్"** అనే పూర్వమీమాంసా సూత్రానుసారం ఏకార్థప్రతిపాదకమైనందున ఒకే శాస్త్రంగా చెప్పబడుతున్నది. వేదంలోని పూర్వకాండలో విధింపబడిన కర్మలు ఆరాధనా రూపాలు. వాటికి ఆరాధ్య వస్తువేది?- అనే ఆకాంక్షకు సమాధానం ఉత్తరకాండమనే ఉపనిషత్తుల ద్వారా కల్గుతుంది. ఉపనిషత్ప్రతిపాద్యమైన బ్రహ్మం ఆరాధ్యం. దీని తిరువారాధన ప్రకారమేది? అనే ఆకాంక్షకు శమనాన్ని పూర్వకాండమనే వేదం చేస్తున్నది. అందువల్ల ఆరాధనావిశిష్టుడైన ఆరాధ్యుడు- పరబ్రహ్మ శబ్దవాచ్యుడైన నారాయణుడే - అనే ఒకే అర్థం. పూర్వోత్తర రూపాలుగా రెండుగా విభజింపబడిన వేదంలో ప్రతిపాదింపబడిన అర్థం. ఈ వేద - వేదాంతాలనే వ్యాఖ్యేయాలకు (మూలానికి) వ్యాఖ్యానరూపాలే - ఈ పూర్వోత్తర మీమాంసలు. వ్యాఖ్యేయాలకు గల పౌర్వాపర్యం (పూర్వం - అపరం - అనే క్రమం), ఐక్యం వ్యాఖ్యానాలకు కూడా అన్వయిస్తుంది - అనేదే శ్రీభాష్యసారం. ఆ విధంగానే కాకుండా, పూర్వకాండలో చెప్పబడిన కర్మలనే అంగాలకు అంగి ఏది? అనే ఆకాంక్షను ఉత్తరకాండ, ఉత్తర కాండలో చెప్పబడిన జ్ఞానమనే అంగికి అంగం ఏది? అనే ఆకాంక్షను పూర్వకాండ తీరుస్తున్నదందున, **"కర్మాంగకం జ్ఞానం ఉపాయమ్"** (కర్మను అంగంగా గల జ్ఞానం ఉపాయం) అనే ఒకే అర్థాన్ని తెల్పుతున్నందున, పూర్వోత్తర మీమాంసలు రెండు కలిపి ఒకే శాస్త్రం - అని కూడా చెప్పవచ్చు- అని ఐక్యశాస్త్రవాదులైన (పూర్వోత్తర మీమాంసలు రెండు ఒకే శాస్త్రమని వాదించే) మన పూర్వాచార్యులంటారు. కర్మ-జ్ఞానాలకు అంగాంగిభావం వల్ల సముచ్చయాన్ని భగవద్రామానుజులు అంగీకరించారు. ఇదే **"విద్యాం చ అవిద్యాం చ య స్తద్వేద ఉభయమ్ సహ, అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయా అమృత మశ్నుతే"** అనే ఉపనిషద్వాక్యంయొక్క అర్థమని భగవద్రామానుజుల అభిప్రాయం.

ఈ ఉపనిషద్వాక్యానికి అద్వైతవాదులు చెప్పే వివరణమేమంటే- కర్మజ్ఞానా లనేవి పరస్పరం విరుద్ధాలు. కర్మమనేది - భేదావలంబి, జ్ఞానమనేది - అభేదావలంబి (కర్మ భేదాన్ని అవలంబించినది, జ్ఞానం అభేదాన్ని తెలిపేది. అందువల్ల భేదాన్ని తెలిపే కర్మ, అభేదాన్ని తెలిపే జ్ఞానం పరస్పరం విరుద్ధాలు). కనుక వీటికి అనుష్ఠానంలో సహభావం పొసగదు. అయినా, జ్ఞాతవ్యత్వేన వాటి సాహిత్యం పొసగుతుంది. జ్ఞానం ఏవిధంగా జ్ఞాతవ్యం (తెలియదగినది?) అంటే, ఉపాయత్వేన (పొందదగినదిగా) తెలియదగినది. కర్మ- త్యాజ్యత్వేన జ్ఞాతవ్యం (విడువదగినదని తెలియదగినది) అని పైన పేర్కొన్న శ్రుతివాక్యం యొక్క సారార్థం - అనేది అద్వైతుల వివరణం. ఈ వ్యాఖ్యానం అయుక్తం - పొసగనిది - అని శ్రీభాష్యకారుల అభిప్రాయం. ఏవిధంగా? అంటే, కర్మలు రెండు కర్తవ్యాలుగా వేదాంతాలలో విధింపబడినందున, అవి త్యాజ్యాలనడం వేదాంతవిరుద్ధం. అంతేకాక, ఈ శ్రుతివాక్యంలోగల **"తీర్త్వా"** అనే పదానికి "దాటి" అనే అర్థాన్ని పల్కడం అప్రసిద్ధి దోషదుష్టమవుతుంది. కనుక, తగినది **"మృత్యుం తీర్త్వా"** అనేచోట **"స్థిత శ్చేత్"** అనే రెండు పదాలను చేర్చుకొని అన్వయించి అర్థం చెప్పినందున అధ్యాహారమనే దోషంకూడా ప్రసంగిస్తుంది. ఇందువల్ల అద్వైతులు చెప్పే వివరణం అసంగతం.

పూర్వం ప్రస్తావించిన వేదవాక్యానికి యాదవప్రకాశుడు చేసే వివరణం ఈ విధంగా ఉన్నది. జ్ఞానకర్మలు సమప్రధానోపాయాలుగా తెలియదగినవి. ఉపాయాలు రెండు - అవి, జ్ఞానం, కర్మ అనేవి. ఇది ఉదాహరించిన శ్రుతిలోని పూర్వకావ్యానికి అర్థం. ఉపేయం కూడా రెండు విధాలు. అనిష్టనివృత్తి, ఇష్టప్రాపణం - అనేవి ఆ రెండు. అనిష్టనివృత్తి రూపఫలానికి కర్మం ఉపాయం, ఇష్టప్రాప్తిరూపఫలానికి జ్ఞానం ఉపాయమనేది ఉత్తరవాక్యార్థం. ఈవిధంగా సాధనసాధ్యద్వ్యత్వాంగీకారంతో - అంటే - సాధనాలు రెండు - అని, సాధ్యాలు రెండు - అని ఒప్పుకోవడం ద్వారా - పూర్వం ప్రసక్తమైన శ్రుతిలోని పూర్వోత్తర వాక్యాలకు అర్థం తెలుపడం యుక్తం. ఇది యాదవప్రకాశవివరణం. ఈ వ్యాఖ్యానం కూడా అయుక్తమేనని శ్రీభాష్యకారుల అభిప్రాయం. ఏవిధంగా? అంటే, మోక్షోపాయం జ్ఞానమనేది ఒకటే, ఇంకొక ఉపాయం లేదు - అని

ఉపనిషత్తులో **"తమేవం విద్వాన్ అమృత ఇహ భవతి నాన్యః పంథా అయనాయ విద్యతే"** (ఆ పరమాత్మను ఈవిధంగా తెలిసినవాడు ముక్తుడవు తున్నాడు; మోక్షప్రాప్తికి వేఱొక ఉపాయం లేదు) అని చెప్పబడినందున ఉపాయం రెండు విధాలనే మాట వేదాంతవిరుద్ధం. **"తమేవం విదిత్వా అతిమృత్యు మేతి"** (పరమాత్మను ఈవిధంగా తెలిసి సంసారాన్ని దాటుతున్నాడు- అంటే- సంసారమనే అనిష్టం తీరినవాడవుతున్నాడు) అనే వాక్యంలో అనిష్టనివృత్తి ఫలమని, అది జ్ఞానసాధ్యమని చెప్పబడి నందున అనిష్టనివృత్తి కర్మఫలమనేది పొసగదు. అనిష్టరూపకర్మనివృత్తి ఏర్పడితే **"సేతుభంగప్రోతఃప్రసృతిన్యాయం"**లో (అడ్డుకట్ట తెగితే, చెఱువులోని నీరు దానికదే ప్రసరించే రీతిలో) ఇష్టప్రాప్తి దానికదే ఏర్పడుతుంది. అందువల్ల సాధ్యమనేది రెండు విధాలని అనడం కూడా వేదాంతవిరుద్ధం. కనుక యాదవప్రకాశుని వివరణం అయుక్తం. ఈ విధంగా జ్ఞాన,కర్మలకు జ్ఞాతవ్య మాత్రంతో (తెలియదగినవి- అనే రూపంతోనే) సాహిత్యం కుదురుతుంది- అనే అద్వైతమతం, జ్ఞానకర్మలకు సమప్రాధాన్యమనే యాదవప్రకాశపక్షం అనాదర ణీయాలు. అంగాంగిభావంతో సాహిత్యం (సహభావం)- అనే పక్షమే ఆదరణీయం - అని ఏర్పడుతున్నది. అంగాంగి భావాన్ని జ్ఞానకర్మలకు భాస్కరుడు అంగీకరించినా, అతడు కర్మను జ్ఞానోత్పాదక రూపంలో అంగమని అంగీకరించకుండా, ఉత్పన్న జ్ఞానానికి అనుగ్రాహకం- అని అన్నాడు. కర్మ అనేది జ్ఞానోత్పాదకం, ఉత్పన్నజ్ఞానానికి వర్ధకం- అనేదే శ్రీభాష్యకారుల అభిప్రాయం. ఈ విధంగా అంగం, అంగి - అనే రెండిటిని పూర్వోత్తర కాండలు ప్రతిపాదిస్తున్నందున ఒకటే శాస్త్రం- అనేది మన పూర్వాచార్యులు దర్శించిన క్రమం.

శారీరకమీమాంసాశాస్త్రంలో నాల్గు అధ్యాయాలున్నాయి. వీటిని విషయద్వికం, లేక, సిద్ధద్వికం- అని, విషయిద్వికం, లేక, సాధ్యద్వికం - అని మన పూర్వాచార్యులు విభాగించారు. భగవద్విషయమనే సిద్ధవస్తువును గూర్చిన, పూర్వద్వికమైన మొదటి రెండు అధ్యాయాలు-విషయద్వికం, సిద్ధద్వికమనబడతాయి. మూడవ అధ్యాయంలో ప్రతిపాదింపబడిన భక్తిరూపజ్ఞానం, నాల్గవ అధ్యాయంలో ప్రతిపాదింపబడిన పరబ్రహ్మానుభవరూపమైన జ్ఞానం

విషయిగాను, చేతనుడు తన ప్రయత్నంతో సాధింపదగినదిగా ఉన్నందున ఉత్తరద్వికం - విషయిద్వికం, సాధ్యద్వికం అనబడు తుంది. ఈ శాస్త్రంలోని ప్రతి అధ్యాయం నాల్గు పాదాలను కల్గినది. కనుక మొత్తం పదహాఱు పాదాలున్నాయి. శ్రీవేదవ్యాసులు ఈ పదహాఱు పాదాలలో పరమాత్మను పదహాఱు గుణాలను కల్గిన వానినిగా వర్ణించారు. ఆ గుణాలు ఏవి? అంటే - (1) **స్రష్ట,** (సృష్టికర్త) (2) **దేహీ** (దివ్యమంగళరూపాన్ని కలవాడు), (3) **స్వనిష్ఠః** (అనన్యాధారుడు తనకు తానే అధారం, వేఱొక ఆధారాన్ని తనకు కల్గినవాడు కాడు) (4) **నిరవధి మహిమా** (అంతు లేని మహిమను కలవాడు), (5) **అపాస్తబాధః** (బాధలు తొలగినవాడు), (6) **శ్రితాప్తః** (పంచకాల పరాయణులైన వారికి ఆప్తుడు, (7) **ఖాత్మాదేః ఉచితజననకృత్** (ఆకాశాదులకు, జీవులకు స్వరూపవికార, స్వభావవికార రూపజనన కర్త), (8) **ఇంద్రియాదేః ఉచితజనన కృత్** (ఇంద్రియాలను సృష్టించేవాడు), (9)**స్మృతౌ తంత్రవాహీ** (జాగ్రదవస్థ మొదలైన అవస్థలను నిర్వహించేవాడు, (10) **నిర్దోషత్వాది రమ్యః** (అఖిలహేయ ప్రత్యనీకుడు, కల్యాణైకతానుడు), (11) **బహుభజనపదమ్** (నానావిధవిద్యలచే ఉపాసించదగినవాడు), (12) **స్వార్హకర్మప్రసాద్యః** (**"వర్ణాశ్రమా చారవతా పురుషేణ పరః పుమాన్, విష్ణురారాధ్యతే, పంథా నాన్యః తత్తోషకారకః"** (వర్ణాశ్రమాలకు తగిన ఆచారాలను కలవానిచే పరమపురుషుడైన విష్ణువు ఆరాధింపబడుతున్నాడు. ఆ విష్ణువును సంతోషింపజేసే వేఱొక దారిలేదు.) అనే పరాశరమహర్షి వచనానుసారంగా వర్ణాశ్రమాచారాలతో ఆరాధింపబడి, ప్రసన్నుడయేవాడు), (13) **పాపచ్ఛిద్** (విద్యానిష్ఠులకు ఉత్తర-పూర్వపాపాల అశ్లేష - వినాశాలను కల్గించేవాడు) (14) **బ్రహ్మనాడీగతికృత్** (హార్దపురుషుడైన భగవానుని కృపవలె జీవునకు బ్రహ్మనాడీ ప్రవేశం కల్గించే వాడు), (15) **అతివహన్** (అర్చిస్సు మొదలైన ఆతివాహికుల ద్వారా జీవునకు ఉపచారం చేసేవాడు, (16) **సామ్యదః** (**"నిరంజనః పరమం సామ్యముపైతి"** అనే రీతిలోఆనందంలో పరమసామ్యాపత్తి- అనే మోక్షాన్ని కల్గించేవాడు) ఇక్కడ సామ్యాపత్తియే మోక్షం - అని చెప్పబడినా, **"త్రయ్యంత నిష్ణాతా స్తు నిఖిలజగదేక కారణస్య, అఖిలహేయప్రత్యనీక - అనంత జ్ఞానానందైకస్వరూపస్య, స్వాభావికా**

నవధికాతిశయాసంఖ్యేయ కల్యాణగుణాకరస్య, సకలేతరవిలక్షణస్య, సర్వాత్మ భూతస్య, పరస్య బ్రహ్మణః శరీతయా ప్రకారభూతస్య అనుకూలాపరిచ్ఛిన్న జ్ఞానస్వరూపస్య, పరమాత్మానుభవైకరసస్య, జీవస్య అనాదికర్మ రూపావిద్యాతి రోహిత స్వరూపస్య, అవిద్యోచ్ఛేదపూర్వక స్వాభావిక పరమాత్మాను భవమేవ మోక్ష మాచక్షతే" అనే అత్రధికరణ శ్రీభాష్యసూక్తిరీతిలో, **"ముక్తిం తతో హి పరమం తవ సామ్య మాహుః త్వద్దాస్యమేవ విదుషాం పరమం పదం తత్"** అనే కూరేశుల (వైకుంఠస్తవ) శ్రీసూక్తి రీతిలోను, పరిపూర్ణ బ్రహ్మానుభవం, అనుభవంవల్ల కల్గిన ప్రీతి, ప్రీతికారితమైన సర్వదేశ సర్వకాల సర్వావస్థోచితమైన, అశేషమైన కైంకర్యం మోక్షమని భావించాలి. ఈ విధంగా పదహాఱు పాదాల అర్థాలను సంగ్రహంగా తెలిసికొన్నాము. ఇక్కడ **"ప్రష్టా దేహీ"** ఇత్యాది దేశికుల అధికరణ సారవళీశ్లోకం అనుసంధేయం.

పదహాఱు పాదాలలో క్రమంగా - 11, 6, 10, 8 - 10, 8, 7, 8 - 6, 8, 26, 15-11, 11, 5, 6 - సంఖ్యలోని అధికరణాలుగా మొత్తం 156 అధికరణా లున్నాయి. ఇక్కడ **"అక్షోర్మి"** ఇత్యాది అధికరణసారావళీశ్లోకం అనుసంధేయం. మొదటి పాదంలో గల పదకొండు అధికరణాలలో - మొదటి నాల్గు అధికరణాలు శాస్త్రానికి ఉపోద్ఘాతమని, **"ఈక్షతే ర్నాశబ్దమ్"** అనే సూత్రం మొదలుకొని **"అనావృత్తిః శబ్దాత్"** అనే చివరి సూత్రం వరకు గల భాగం శాస్త్రమని పలువురు మహాచార్యులు భావించారు. **"శాస్త్రారంభార్థ మేకం త్రితయ మిహ పరం శాస్త్ర మిత్యాహు రేతే"** అనే సూక్తిరీతిలో ఈ నిర్వాహం ప్రాచీనమైనది. శ్రీమేఘనా దారిసూరి అనే పెద్దలొకరు నయప్రకాశికా - అనే శ్రీభాష్యవ్యాఖ్యానంలో "పూర్వాకాండలో **"అథాతో ధర్మజిజ్ఞాసా"** అనే మొదటి సూత్రంమాత్రం ఉపోద్ఘాతం. **"జన్మాద్యస్య యతః"** అనే సూత్రం మొదలు శాస్త్రం - అని అభిప్రాయపడ్డారు. సర్వత్ర ప్రసిద్ధ్యధికరణ శ్రీభాష్యంలోని **"శారీరక మీమాంసా శ్రవణమ్ ఆరభేత ఇత్యుక్తం శాస్త్రారంభసిద్ధయే"** అనే సూక్తిని నిశితంగా గమనించి చూస్తే అది నయప్రకాశికావ్యాఖ్యాన సూక్తికి అనుకూలమని తోస్తుంది. అయినా, ఆ సందర్భంలో శ్రుతప్రకాశికాభట్టర్ మూడు నిర్వాహాలను చూపి, సూత్రచతుష్టయం శారీరకమీమాంసాశాస్త్రానికి ఉపోద్ఘాతమనే పక్షాన్ని స్థాపించారు.

మొదటి అధ్యాయంలో 35 అధికరణాలున్నాయి. మొదటి అధికరణమైన జిజ్ఞాసాధికరణం బ్రహ్మవిచారకర్తవ్యతాస్థాపనమాత్ర పరం (బ్రహ్మను గూర్చిన విచారం చేయదగినదనే విషయాన్ని స్థాపించడంలో మాత్రమే ప్రాధాన్యాన్ని కల్గినది). 35వ అధికరణమైన సర్వవ్యాఖ్యానాధికరణం పూర్వోక్తన్యాయాతి దేశపరం. ఈ రెండిటి మధ్యలో గల 28వ అధికరణమైన అపశూద్రాధికరణం బ్రహ్మవిద్యాధికారపరం (బ్రహ్మవిద్యను తెలియడానికి తగిన అధికారాన్ని అంటే- యోగ్యతను విచారించడంలో ప్రాధాన్యాన్ని కల్గినది) ఈవిధంగా ఈ మూడు అధికరణాలు కాక, మిగిలిన 32 అధికరణాలలో శ్రీవేదవ్యాసులు పరమాత్మను చేతనాచేతనవిలక్షణునిగా, సర్వజ్ఞునిగా, సర్వశక్తిగా, జగత్తు అనే కార్యానికి అభిన్ననిమిత్తోపాదాన కారణరూపునిగా నిశ్చయించారు. (నిరూపించారు)

సర్వవ్యాఖ్యానాధికరణ వ్యాఖ్యాన సందర్భంలో శ్రుతప్రకాశికాభట్టర్ మొదటి అధ్యాయంలోని నాల్గు పాదాలలో గల అర్థాలను సంగ్రహించి పలికారు. అది ఏవిధంగా? అంటే, శ్రీవేదవ్యాసులు మొదటి పాదంలో బ్రహ్మం చేతనాచేతన విలక్షణం, జగదేకకారణం, విలక్షణపురుష విశేషమని నిరూపించారు. ఈక్షత్యధి కరణంలో అచేతనవైలక్షణ్యం, ఆనందమయాధికరణంలో చేతనవైలక్షణ్యం స్పష్టం.

రెండవ పాదంలో - పరమాత్మ జగచ్ఛరీరుడని నిరూపించారు. దీని వివరణాన్ని ఆఱు అధికరణాలలో గమనించవచ్చు. మూడవ పాదంలో - భగవానుడు సర్వాత్మ - అని నిరూపించారు. ఈ పాదంలో పరమాత్మయొక్క సర్వాత్మత్వం శంకితదోషనిరాస ముఖేన (దోషాన్ని శంకించి, దానిని తీర్చడం ద్వారా) చక్కగా వ్యవస్థాపింపబడింది. సర్వం బ్రహ్మకార్యం, బ్రహ్మశరీరం, బ్రహ్మాత్మకం - (బ్రహ్మం యొక్క కార్యరూపం, బ్రహ్మకు శరీరం, బ్రహ్మకును ఆత్మగా కల్గినది) అని మూడు పాదాలద్వారా వ్యక్తమయిన అర్థం. ఈ విధంగా అన్వయక్రమంలో తెలుపబడిన అర్థాన్ని వ్యతిరేక క్రమంలో నాల్గవ పాదంద్వారా వేదవ్యాసులు తెలియజేశారు. అది ఏమంటే - అతత్కార్యమై, అతచ్ఛరీరమై, అతదంతరాత్మయై (బ్రహ్మంయొక్క కార్యం కానిదై, బ్రహ్మకు శరీరం కానిదై, పరబ్రహ్మను ఆత్మగా లేనిదై) ఉండే ఏవస్తువు లేదు - అనే అర్థమే నాల్గవ

పాదంలోని అర్థం. మొదటి మూడు పాదాలలో జ్ఞానానుగుణంగా నిరూపించిన అర్థాన్ని, నాల్గవ పాదంలో వైరాగ్యానుగుణంగా స్థాపించారని భావం. **"నఙ్కణ్ణన్ కణ్"** (మన శ్రీకృష్ణుడే సర్వవస్తు నిర్వాహకుడు) అని, **"అల్లదు ఇల్లై యోర్ కణ్ణే"** (ఆవిధంగా కాని వస్తువు ఏదీ లోదు) అని నమ్మాళ్వార్లు (అన్వయ - వ్యతిరేకక్రమాలలో) ఈ అర్థాన్ని తెలిపారుకదా! **"నమ్ కణ్ణన్ కణ్"** అని అన్వయ క్రమంలో పరత్వాన్ని పలికారు. **"అల్లదు ఇల్లై"** అని వ్యతిరేక క్రమంలో పరత్వాన్ని పలికారు. ఇందువల్ల జ్ఞానం కంటే వైరాగ్యానికి గల ప్రాధాన్యం తెలుపబడింది- అనే ఈడు దివ్యసూక్తులు ఇక్కడ అనుసంధేయాలు.

మొదటి అధ్యాయంలోని నాల్గు పాదాల పేటికా విభాగం ఏవిధంగా? అంటే-మొదటి పాదం అయోగవ్యవచ్ఛేదం. ఆ తరువాత గల మూడు పాదాలు (త్రిపాది) అన్యయోగవ్యవచ్ఛేదం. అయోగ వ్యవచ్ఛేదం అంటే - **"శంఖః పాండర ఏవ"** (శంఖం తెల్లనిదే) అనే రీతిలో బ్రహ్మం జగత్కారణమే - అని నిరూపించడం. ఇది మొదటి పాదంలో నిరూపింపబడింది. అయోగం - అంటే - అసంబంధం - జగత్కారణత్వా సంబంధం, దానిని తీర్చడం వ్యవచ్ఛేదమన బడుతుంది. పరబ్రహ్మకు కారణత్వా సంబంధం లేదు, కారణత్వ సంబంధమే ఉన్నది - అని నిరూపించడం మొదటి పాదంలో చేయబడింది. అందువల్ల ఈ మొదటి పాదం అయోగవ్యవచ్ఛేదం. అన్యయోగ వ్యవవచ్ఛేదమంటే - **"పార్థ ఏవ ధనుర్ధరః"** (పార్థుడే విలుకాడు) అనే రీతిలో బ్రహ్మమే జగత్కారణం - అని నిరూపించడం. ఇది, పాదత్రయంలో (రెండవ, మూడవ, నాల్గవ పాదాలలో) చేయబడింది. జగత్కారణత్వానికి వేఱొక చోట సంబంధం లేదని నిరూపించడం అన్యయోగవ్యవచ్ఛేదం. బ్రహ్మభిన్నం అయిన జగత్కారణం లేదు - అనే నిరూపణం - అని భావం. బ్రహ్మలక్షణమైన జగత్కారణత్వానికి అసంభవశంకా పరిహారపరం, మొదటి పాదం. అతివ్యాప్తి శంకాపరిహారపరం, పాదత్రయం- అని భావం. బ్రహ్మ అనే లక్ష్యమే లేదు. అందువల్ల లక్షణం ఏవిధంగా కుదురుతుంది? అనే లక్ష్యాసంభవ ప్రయుక్తలక్షణాసంభవ శంక- అని సారం. దానికి పరిహారంగా- చేతనాచేతన విలక్షణంగా బ్రహ్మమనే లక్ష్యాన్ని మొదటి పాదంలో స్థాపించి, కారణత్వమనే లక్షణానికి బ్రహ్మలో సద్భావాన్ని శ్రీవేదవ్యాసులు

నిరూపించారు. బ్రహ్మం జగత్కారణం కానివ్వండి; వేఱొకటి కూడా జగత్కారణం కానివ్వండి - అనే కారణత్వరూపలక్షణానికి అన్యత్ర - వేఱొక చోట - లక్ష్యమైన బ్రహ్మం కంటే వేఱొక చోట వ్యాప్తి - అనే అతివ్యాప్తి శంక ఏర్పడగా, శ్రీవేదవ్యాస మహర్షి తరువాత గల పాదత్రయంలో (త్రిపాదిలో) "బ్రహ్మభిన్నం కారణం కాదు" అని శంకాపరిహారాన్ని చేశారు. అందువల్ల మొదటి పాదం అసంభవశంకా పరిహారపరం, అయోగవ్యవచ్ఛేదపరం - అని, తరువాత గల పాదత్రయం అతివ్యాప్తి శంకాపరిహార పరం, అన్యయోగ వ్యవచ్ఛేదపరమని మన పూర్వాచార్యులు పేటికా విభాగం చేశారు. మొదటి పాదంలో ఉండే సూత్రాలలోని **"నాశబ్దం"**, **"అన్య"** ఇత్యాది శబ్దాలు, తరువాత గల పాదత్రయిలోని **"ప్రాజ్ఞః"** ఇత్యాది శబ్దాలు ఈ నిర్వాహానికి అనుకూలాలు. అయినా, ఈ విభాగం ప్రాయికం. నాల్గవ అధ్యాయారంభంలో **"అపి"** శబ్దప్రయోగం చేత పాదారంభం అన్యయోగవ్యవచ్ఛేదపరం, తరువాత అయోగవ్యవచ్ఛేదపరం- అని తెలియాలి. అంటే - కారణత్వాధికరణం ఆరంభంనుండి తిరిగి. ఈక్షత్యధి కరణ, ఆనందమయాధికరణాలలోవలె, పూర్వపక్షసిద్ధాంతాలున్నందున తరువాత అయోగవ్యవచ్ఛేదపరమని గ్రహించాలి. అందువల్ల, అయోగవ్యవచ్ఛేదపరం మొదటి పాదం. తరువాత గల పాదత్రయి అన్యయోగవ్యవచ్ఛేదపరమనే విభాగం ప్రాయికం.

"అస్పష్టతర మస్పష్టం స్పష్టం ఛాయానుకారి చ, జీవప్రధానయో రాదౌ వాక్యజాతం విచారితమ్" (న్యాయకలాపసంగ్రహమ్) అనే రీతిలో అస్పష్టతరజీవాది లింగకవాక్యవిచారం మొదటి పాదంలో, అస్పష్టజీవాది లింగక వాక్య విచారం రెండవ పాదంలో, స్పష్టజీవాదిలింగక వాక్యవిచారం మూడవ పాదంలోను శ్రీవేదవ్యాసులు చేశారు - అని అనడం స్వరసం - అని భావం. జీవాదులను జగత్కారణంగా చెప్పదగినట్లుగా లింగాన్ని (చిహ్నం) ఉండే ఉపనిషత్ వాక్యాలను శ్రీవ్యాసభగవానులు మొదటి పాదంలో విచారించారు. కొన్ని వాక్యాలలో ఆ లింగం - అస్పష్టతరం. కొన్ని వాక్యాలలో అది అస్పష్టం. కొన్నిటిలో స్పష్టం. ఇంకా కొన్ని వాక్యాలలో స్పష్టతరం. ఇటువంటి కారణ వాక్యాలను న్యాయమార్గంలో పరిశీలించి, "చేతనాచేతనవిలక్షణం, జగత్కారణం-

పరం బ్రహ్మం" అని శ్రీవేదవ్యాసులు నిరూపించారు. కారణవస్తువును తెలిపే వాక్యాలైన కారణవాక్యాలకు చేతనాచేతన విలక్షణమైన పరబ్రహ్మంపట్ల చక్కని అన్వయాన్ని నిరూపించినందున మొదటి అధ్యాయం సమన్వయాధ్యాయం అనబడుతుంది. ఈ రీతిలో ప్రథమాధ్యాయార్థాన్ని సంగ్రహంగా గ్రహించిన తరువాత, ద్వితీయాధ్యాయాన్ని అనుభవిద్దాం (తెలిసికొందాం).

ద్వితీయాధ్యాయం

ద్వితీయాధ్యాయం అవిరోధాధ్యాయ మనబడుతుంది. పరబ్రహ్మయొక్క జగత్కారణత్వంలోను, జగత్తుయొక్క కార్యంలోను శంకింపబడిన విరోధాలను పరిహరించి, జగత్తు - బ్రహ్మల మధ్య ఉండే కార్య-కారణ భావాన్ని స్థిరీకరించే అధ్యాయమని దీని అర్థం.

ద్వితీయాధ్యాయంలోని మొదటి పాదం స్మృతిపాద మనబడుతుంది. ఈ పాదంలో శ్రీవేదవ్యాసభగవానులు మొదటి రెండు అధికరణాలద్వారా యుక్తి విచారాన్ని చేశారు. అయినా, స్మృతివిచారప్రధానమైన ఈ మొదటి పాదం స్మృతిపాదమని, యుక్తివిచారప్రధానమైన రెండవ పాదం తర్కపాదమని వ్యవహరింప బడుతున్నది. స్మృతిపాదంలో, భగవదవతారరూపుడైన కపిల మహర్షియే సాంఖ్య తంత్రప్రవర్తకుడైనా, మనుస్మృతికి విరుద్ధమైన కపిలస్మృతి అనాదరణీయమని అన్నారు. న్యాయవిరుద్ధమైన స్మృతిచే అనుగృహీతమైన శ్రుతికంటే, న్యాయావిరుద్ధ స్మృతిచే అనుగృహీతమైన శ్రుతిప్రబలమని, ఋషిమాత్ర ప్రణీతస్మృత్యనుగృహీత శ్రుతికంటే ఆప్తతమ మనుప్రణీత స్మృత్యనుగృహీతశ్రుతి ప్రబలమని, ఏక స్మృత్యను గృహీత శ్రుతికంటే అనేకస్మృత్యనుగృహీతస్మృతి ప్రబలమని భావం. ఈ విధంగా కాపిలతంత్ర సిద్ధమైన ప్రకృతితత్త్వం జగత్కారణం కాదు; మన్వాదిస్మృతులలో చెప్పబడినట్లుగా చేతనా చేతనవిలక్షణమైన పరబ్రహ్మయే జగత్కారణం- అనేది వేదాంత సారార్థమని రెండవ అధ్యాయంలోని మొదటి పాదమైన స్మృతిపాదంలో శ్రీవేదవ్యాసులు తెలిపారు.

రెండవ అధ్యాయంలోని రెండవ పాదం తర్కపాదం అనబడుతుంది. ఈ పాదంలోని మొదటి అధికరణంలో ప్రధానకారణవాదాన్ని, తరువాత గల అధికరణా లలో పరమాణుకారణవాదాన్ని నిరసించి, బ్రహ్మకారణవాదాన్ని శ్రీవ్యాసభగవానులు స్థాపించారు.

రెండవ అధ్యాయంలోని మొదటి పాదం స్వపక్షస్థాపనపరం. రెండవ పాదం ప్రతిపక్షప్రతిక్షేపనపరం. స్వపక్షంలో ఇతరులు ఆరోపించే దోషాలను పరిహరించి, స్వపక్షస్థాపనాన్ని శ్రీవ్యాసులు స్మృతిపాదంలో చేశారు. ఇతర మతాలలోని దోషాలను చూపి తర్కపాదంలో వాటిని ఖండించారు - అని భావం.

సాంఖ్యవైశేషిక బౌద్ధజైనశైవమతాలను తర్కపాదంలోని ఏడు అధికరణాలలో శ్రీవ్యాసభగవానులు ఖండించారు. చివరి అధికరణమైన 8వ అధికరణంలో పాంచరాత్ర ప్రమాణస్థాపనాన్ని శ్రీమన్మహాభారత కర్త అయిన శ్రీవేదవ్యాసులు చేశారు. ఈక్షత్యధికరణాదులలో సాంఖ్యమతప్రస్తావం ఉన్నప్పటికీ, సాక్షాత్తుగా ఆ మతఖండనం తర్కపాదంలోనే ఉన్నదని శ్రీభాష్యకారుల సూక్తి. ప్రధానమని, మూలప్రకృతి అని, అశబ్దమని చెప్పబడే అచిత్తత్త్వం ఆనుమానికం, అబ్రహ్మాత్మకం, గుణత్రయాత్మకం, జగత్కారణం - అనేది సాంఖ్యమతం. ప్రధానకారణత్వసాధకంగా సాంఖ్యుడు పలికే అనుమానాన్ని నిరసించి, తన్మూలంగా సాంఖ్యమతనిరాసాన్ని శ్రీవేదవ్యాసులు మొదటి అధికరణంలో చేశారు. ఈ సందర్భంలో సాంఖ్యోక్తపక్షాన్ని దూషించేటపుడు అతడు పల్కిన ప్రమాణత్రయాన్ని దూషించడం కూడా కర్తవ్యం. ప్రత్యక్షసిద్ధ పదార్థాల విషయంలో సాంఖ్యునితో వివాదం అధికంగా లేదు. ధర్మ ధర్ములకు (ధర్మానికి, ధర్మికి) అభేదమే ఉన్నది. కార్యాలకు అభివ్యక్తి మాత్రమే ఉన్నది; అవస్థాంతరాపత్తి లేదు - ఇత్యాది విషయాలలో వివాదమున్నది. అయినా, ప్రత్యక్షసిద్ధపదార్థాలలో ఎక్కువ వివాదం లేదు - అనేది శ్రీభాష్యకారుల అభిప్రాయం. అందువల్ల ప్రత్యక్షనిరాసాన్ని శ్రీవ్యాసులు ఉపేక్షించారు. సాంఖ్యాగమం పూర్వకాండ లోని మొదటి అధ్యాయమైన ప్రమాణాధ్యాయంలో చాలా వరకు నిరస్తమైనది. అందువల్ల ఆగమనిరాసం ఉపేక్షింపబడింది.

పరిశేషన్యాయంలో సాంఖ్యోక్తమైన అనుమానాన్ని ఇక్కడ నిరసించారు. అబ్రహ్మాత్మకమైన ప్రధానం జగత్కారణం - అని అతడు పల్కిన అనుమానాన్ని నిరసించి, ఆ అనుమానంతో ప్రాజ్ఞాధిష్ఠితమే ప్రధానమని వ్యాసులు నిరూపించారు. ఈ సందర్భంలో ఒక సందేహం కలుగవచ్చు. అది ఏమి? అంటే - ఈ అధికరణంలో అనుమానంతో ఈశ్వరాధిష్ఠానాన్ని స్థాపించే వ్యాసులు ఇంతకు ముందుగా శాస్త్రయోనిత్వాధికరణంలో అనుమానం ద్వారా ఈశ్వరుని స్థాపించడం కుదరదని అనడం ఎందుకు? - అనేది ఆ సందేహం. ఈ శంకకు పరిహారం ఏమంటే - సర్వప్రష్ట అయిన పరమాత్మను అనుమానంతో సాధించడం కుదరదు - అనేది శాస్త్రయోనిత్వాధికరణంలోని సిద్ధాంతం. పరమాత్మను అనుమానంతో బాధించడం కూడా సాధ్యం కాదు- అనేది ఈ అధికరణంలోని సిద్ధాంతం. ఏది ఏప్రమాణం ద్వారా సాధింప బడుతుందో, అది ఆ ప్రమాణంద్వారానే బాధింపబడుతుంది. అనుమానా విషయమైన (అనుమానంద్వారా సాధింపబడని) పరబ్రహ్మను అనుమానంతో సాధించడం గాని, బాధించడం గాని సాధ్యం కాదనేది ప్రకృత సారార్థం. తర్కపాదంలో కపిలప్రోక్తమైన సాంఖ్యసిద్ధాంతాన్ని, హిరణ్యగర్భ ప్రణీతమైన యోగసిద్ధాంతాన్ని, శివప్రోక్తమైన శైవసిద్ధాంతాన్ని వ్యాసులు దూషించినందున, తేలిన అర్థమేమంటే - త్రిమూర్తులైనా వేదవిరుద్ధంగా వారు పల్కితే అది త్యాజ్యమే, వేదానుగుణమే ఉద్దేశ్యం- అని. సాంఖ్యాదిదూషణపరమైన తర్కపాదం చివరలో పాంచరాత్రదూషణం చేయడం ఆ పాదానికి సంగత మవు తుందా? అంటే, సంగతమే. సంగతి ఏవిధంగా ఉన్నదంటే, దూషణమో, భూషణమో పాదార్థం కాదు. సాంఖ్యాదులు వేదానికి (విరోధులు) ప్రతిపక్షులు కారు- అనే నిరూపణమే పాదార్థం. సాంఖ్యాది మతాలు కుత్సితయుక్తిమూలాలు కనుక దుర్భరాలు. అందువల్ల అవి వేదాలకు ఎదురు నిలువలేవు. పాంచరాత్రం వేదాను గుణమైనందున వేదవిరుద్ధం కాదు. సాంఖ్యాదులకు వేదప్రత్యర్థిత్వ నిరాసమే తర్కపాదార్థం. అందువల్ల పాంచరాత్ర ప్రమాణస్థాపనం పాదసంగతమే కాగలదు - **"పంచేతరాణి శాస్త్రాణి రాత్రీయంతే మహాంత్యపి, తత్సన్నిధౌ సమాఖ్యా సా తేన లోకే ప్రవర్తతే"** అనే పాద్మతంత్ర ప్రమాణ

వచనం దీనిని బలపరుస్తుంది. పాంచరాత్ర సన్నిధిలో సాంఖ్యాదిపంచమతాలు రాత్రులవుతున్నాయి. అంటే, ప్రకాశాన్ని కోల్పోతున్నాయి - అనే పాంచరాత్రశబ్దవ్యుత్పత్తిని, తర్కపాదంలో వ్యాసులు చేసిన సాంఖ్య, వైశేషిక, బౌద్ధ, జైన, శైవదూషణాన్ని, పాంచరాత్ర భూషణాన్ని చేర్చి గమనించిన వారికి ఈ విషయం స్ఫుటపడుతుంది. మహాభారతంలోని మోక్షపర్వంలో- **"ఏవ మేకం సాంఖ్యయోగం వేదారణ్యకమేవచ, పరస్పరాంగాన్యేతాని పంచరాత్రం తు కథ్యతే"** అని వేదవ్యాసులు పలికారు. సాంఖ్యమతంలో చెప్పబడిన ఇరవై అయిదు తత్త్వాలను, యోగమతోక్తమైన యోగాన్ని, వేదోక్తమైన కర్మలను అంగీకరించి, తత్త్వాలు బ్రహ్మాత్మకాలని, యోగం బ్రహ్మోపాసనమని, కర్మలు బ్రహ్మారాధనాలని, ఆరణ్యకం తెల్పుతున్నది. ఈ విషయాన్నే **"పాంచరాత్రస్య కృత్స్నస్య వక్తా నారాయణః స్వయమ్"** అని నారాయణుడు పాంచరాత్రంలో విశదీకరించాడని భావమనేది శ్రీభాష్యసారం. మహాభారతకర్త అయిన వ్యాసులు భారతంలో పాంచప్రామాణ్యాన్ని బహుముఖంగా నిరూపించినవారై, బ్రహ్మసూత్రాలలో కూడా దానిని స్థాపించారు - అని అనడం మిక్కిలి పొసగుతుంది. **"న బాధః ప్రతిరోధో వా వేదసాత్త్వతయో ర్మిథః, కుదృశాం తద్భ్రమో వార్యః శ్రుత్యో రివ పరీక్షకైః"** అని చెప్పబడుతున్నది కదా. వేదవాక్యాలలో పరస్పర విరోధశంకా పరిహారాన్ని చేయబోయేవారై, ముందుగానే వేదసాత్త్వతాలకు విరోధశంకా పరిహారాన్ని చేస్తున్నారని దీని భావం. ఆకాశాదుల ఉత్పత్తివిషయంలోను, జీవానుత్పత్తి విషయంలోను శ్రుతివాక్యాలలో ఆపాతతః గోచరించే పరస్పరవిరోధశంకకు పరిహారాన్ని వియదధికరణంనుండి వేదవ్యాసులు చేశారు. దానికి ముందుగానే జీవానుత్పత్తివిషయంలో పాంచరాత్రవిరోధశంక ఏర్పడగా, దానికి పరిహారాన్ని పల్కి, **"పాంచరాత్రం పరమతమ్"** అనే భ్రమను ఇక్కడ తీర్చారు. అందువల్లనే కదా ఈ అధికరణం పాదం చివరలో కూర్పబడింది. ఈ పాదంలో నరకానుపపత్త్యధికరణంనుండి ఆరంభించి సాంఖ్యాద్యాగమవిచారం చేయబడింది. ఆగమసామ్యాన్నిబట్టి పాంచరాత్రంకూడా అప్రమాణం - అనే శంక కలుగగా, దానిని నిరసించి, పాంచరాత్ర ప్రామాణ్యాన్ని శ్రీవేదవ్యాసులు స్థాపించారు.

ఈ అధికరణం శాక్తమత నిరాసపరమని మాధ్వభాష్యం తెల్పింది. అది భిన్నవిషయం. పాంచరాత్రోక్తమైన నారాయణపరత్వం, నారాయణారాధన వైభవం శంకరభాష్యసమ్మతమే. తదుక్తజీవోత్పత్తి విషయం ఒక్కటిలో మాత్రమే భాష్యభామతీ కారులైన శంకర - వాచస్పతి మిశ్రులు విసంవాదాన్ని చూపారు. పాంచరాత్రానికి జీవోత్పత్తి విషయంలో తాత్పర్యం లేదని కల్పతరుకారులైన అమలానందులు ఆ సంవాదాన్ని ఖండించారు, పాంచరాత్రోక్తమైన జీవోత్పత్తి వచనానికి గౌణార్థత్వాన్ని గ్రహించి, పాంచరాత్ర ప్రమాణాన్ని కల్పతరుకారులే స్థాపించారు. శ్రీరామానుజ సమ్మతమైన పాంచరాత్రప్రామాణ్యం మతాంతరనిష్ఠులకు కూడా సమ్మతమేనని దీనివల్ల తెలుస్తున్నది. ఈ విధంగా ఆఱు పాదాలలో బ్రహ్మనిష్ఠమైన కారణత్వాన్ని వ్యాసులు సాధించారు.

ఇక, తరువాత రెండు పాదాలలో జగన్నిష్ఠమైన కార్యత్వాన్ని శ్రీవ్యాసులు శోధించారు.

రెండవ అధ్యాయంలోని మూడవ పాదమైన వియత్పాదంలోను, నాల్గవ పాదమైన ప్రాణపాదంలోను ఆకాశ, ఆత్మ, ఇంద్రియాదులకు తత్తద్వస్తు స్వరూపాను గుణమైన, స్వరూపవికార, స్వభావవికారాలను నిరూపించి, వాటికి బ్రహ్మకార్యత్వమే ఉన్నది- అని స్థాపించారు.

వియదధికరణంలో ఆకాశనిత్యత్వాన్ని శంకించి, ఆకాశంయొక్క కార్యత్వం సిద్ధాంతీకరింపబడింది. ఆత్మాధికరణంలో ఆత్మకార్యత్వాన్ని శంకించి, ఆత్మస్వరూప నిత్యత్వం సిద్ధాంతీకరింపబడింది. అందువల్ల చేతనాచేతనాలలో తుల్యకార్యతా నిరూపణం ఈ పాదానికి ప్రమేయం - అని అనరాదు. అందువల్లనే కదా శ్రీభాష్యకారులు కార్యతాప్రకారవిశోధనం ఈ పాదార్థమని పలికారు.

రెండవ అధ్యాయం మొదటి పాదంలో **"బ్రహ్మం జగత్కారణమ్"** అనే విషయంలో ఇతరమతాలవారిచే ఉద్భావింపబడిన దోషాలను పరిహరించి, బ్రహ్మకారణత్వాన్ని వ్యాసులు స్థాపించారు. మూడవ పాదంలో **"జగత్తు కార్యమ్"** అనే విషయంలో పరోక్తదోషాలను శ్రీవ్యాసులు పరిహరించారు.

అందువల్ల ఈరెండు పాదాలు స్వపక్షస్థాపకపరాలు కనుక, మొదటి పాదం, మూడవ పాదం పరస్పరం సంగతమవుతాయి. అయితే, మూడవ పాదాన్ని వ్యాసులు మధ్యలో కూర్చడానికి ఏమి కారణం? అంటే, కారణవిషయంలో పరోక్తదోషపరిహారమైన మొదటి పాదం, కారణవిషయంలో పరపక్షప్రతిక్షేప పరమైన రెండవ పాదం - ఈ రెండు కారణవిచార పరాలై నందున, ఈ రెండిటిని పూర్వాపరాలుగా నిర్దేశించి, కార్యవిచారపరమైన వియత్పాద, ప్రాణపాదాలను (మూడవ, నాల్గవ పాదాలను) తరువాత కూర్చారని తెలియాలి.

ఆకాశాదులకు స్వరూపవికార రూపమైన కార్యత్వం, జీవాత్మలకు స్వభావవికార రూపకార్యత్వం - అని నియమించేవారెవరు? అని అంటే, ఇక్కడ ఉపనిషత్తే నియామకవుతున్నది. ఏవిధంగా? అంటే- జీవాత్మలను భోక్తలుగా, ప్రాకృతాలను భోగ్యాలుగా, ఈశ్వరుని నియంతగా **"భోక్తా భోగ్యం ప్రేరితారం చ మత్వా"** (భోక్త అయిన జీవుని, భోగ్యశబ్దవాచ్యమైన ప్రకృతిని, ప్రేరేపించేవాడైన ఈశ్వరుని భావించి) అని ఉపనిషత్తు తత్త్వత్రయ స్వరూపకథనం చేసింది. భోగ్యభూతమైన ప్రకృతితత్త్వం- మహత్తు, అహంకారం, భూతపంచకం, ఇంద్రియాదుల రూపంగా స్వరూపపరిణామం పొందితే తప్ప జీవాత్మలకు భోగ్యం కాలేదు. జీవాత్మ - స్వరూపంలో వికారం లేనివాడై, తన స్వభావమైన ధర్మభూత జ్ఞానంయొక్క వికాసంతో ప్రాకృతపదార్థాలను అనుభవించే భోక్త కనుక, ఇతనికి జ్ఞానవికాసమే ఆవశ్యకమవుతున్నది. అందువల్ల భగవంతుడు ఆత్మలకు స్వభావవికారాన్ని కల్గించి, ప్రకృతి ప్రాకృతంగా స్వరూపంతో పరిణమింపజేస్తున్నాడు.

అందువల్ల సర్వం బ్రహ్మకార్యమని తేలింది.

వియదధికరణంనుండి అచిదుత్పత్తి ప్రకారం చింతింపబడుతున్నది. ఆత్మాధికరణం నుండి చిదుత్పత్తి ప్రకారం చింతింపబడుతున్నదని గమనించాలి. పూర్వోక్తవియదధికరణన్యాయంతో జీవోత్పత్తిశంక స్వతః ప్రాప్తమవుతున్నది. అందువల్ల జీవోత్పత్తివాదమనే పూర్వపక్షాన్ని సూత్రకారులు సూత్రంతో నిర్దేశించ కుండా జీవానుత్పత్తిపరమైన సిద్ధాంత సూత్రాన్నిమాత్రం అనుహ్రించారు.

ప్రాణోత్పత్త్యధికరణంలో వియదధికరణన్యాయంతో స్వతఃప్రాప్తమైన ప్రాణోత్పత్తి విషయమైన సిద్ధాంతాన్ని సూత్రకారులు సూత్రంతో నిర్దేశించకుండా ప్రాణానుత్పత్తి శంకాపరమైన పూర్వపక్షసూత్రాన్ని మాత్రం అనుగ్రహించారు. ఈ అధికరణంలో సూత్రకారులు అభిప్రాయపడిన సిద్ధాంతం ఇది - అనేదానిని శ్రీభాష్యకారులు అపశూద్రాధికరణంలోవలె నిర్దేశించారని తెలియాలి.

ఆత్మాధికరణంలో జీవాత్మనిత్యత్వాన్ని వ్యాసభగవానులు స్థాపించడం గమనించిన మనకు ఒక సందేహం కలుగవచ్చు. అది ఏమంటే- శాస్త్రయోనిత్వాధి కరణంలో బ్రహ్మయొక్క జగత్కారణత్వం వేదాంతాన్ని ప్రమాణంగా కల్గినది (వేదాంతంచే ప్రమాణీకరింపబడుతున్నది) అని పల్కి, ఆత్మాధికరణంలో అదే వేదాంతవాక్యాలతో ఆత్మనిత్యుడని నిశ్చయిస్తే పరస్పరవిరోధం ఏర్పడుతుందే! - అనేది ఆ సందేహం. దీనికి పరిహారం ఏమంటే - బ్రహ్మం శాస్త్రప్రమాణకం - అనే విషయమే శాస్త్రయోనిత్వాధికరణవిషయం. జగత్కారణత్వం శాస్త్రప్రమాణకం - అనే విషయం ఈ అధికరణవిషయం కాదు. అంతేకాక, ఆత్మాధికరణంలో శ్రీభాష్యకారులచే జీవనిత్యత్వపరంగా ఉదాహరింపబడిన శ్రుతులకు "అచిద్వస్తువులో ప్రసిద్ధమైన స్వరూపాన్యథా భావరూపమైన వికారం ఆత్మకు లేదు'' అనే విషయంలో దృష్టి -అని, పరమాత్మనిత్యత్వపరంగా ఉదాహరింపబడిన వచనాలకు "జీవాత్మల విషయంలో ప్రసిద్ధమైన స్వభావాన్యథాభావ (జ్ఞానసంకోచవికాస) రూపవికారాలు పరమాత్మకు లేవు'' అనే విషయంలో దృష్టి అని గ్రహించాలి. అచిత్తు కాని, చిత్తు కాని- ఈరెండిటిలో ఉండే స్వరూపస్వభావ వికారాలే అనిష్టాలు. ఇవి పరమాత్మకు లేకపోయినా, ఇవి పరబ్రహ్మకు కల కారణత్వాన్ని నిర్వహించడానికి మూడవ విధమైన వికారం ఒకటి ఆ పరమాత్మకే తగును. ఉభయవికారవిశిష్టాలైన చేతనాచేతన విశిష్టత్వమే కదా, ఈ వికారం. అందువల్ల పరబ్రహ్మం జగత్కారణమనేది అక్షతం.

ఈవిధంగా మొదటి రెండు అధ్యాయాలతో ప్రమేయత్వవ్యాపక కార్యతా నిరూపిత కారణత్వం (ప్రమేయత్వంలో - అంటే, చిదచిత్తులలో - వ్యాపకమైన కార్యత్వంచేత నిరూపింపబడిన కారణత్వం)పరబ్రహ్మ లక్షణమని తెలుప

బడింది. (చిదచిదీశ్వర రూపమైన ప్రమేయతత్త్వాలలో నియతంగా గోచరించే కార్యత్వం చేత నిరూపింప బడిన కారణత్వమే పరబ్రహ్మ లక్షణం.)

పూర్వద్వికంలో సూత్రకారులు - ప్రకృత్యాత్మభేదాన్ని, ఆత్మ-పరమాత్మ భేదాన్ని, బ్రహ్మనిష్ఠాలైన జ్ఞానానందాది కల్యాణగుణాలను, ధర్మిజ్ఞాన - ధర్మభూత - జ్ఞానాల మధ్య భేదాన్ని శాబ్దంగా తెలియజేశారు. ఈక్షత్యధికరణంలో- పరమాత్మ ప్రకృతిరూప అచిత్తుకంటే విలక్షణుడని, ఆనందమయాధికరణంలో పరమాత్మ జీవవిలక్షణుడని, అంతరధికరణంలో - పరమాత్మ జీవవిశేష విలక్షణుడని వ్యాసులు స్థాపించారు. ఈక్షత్యధికరణంలోని పూర్వపక్షియొక్క అనుయాయిని కారణత్వాధి కరణంలోను, ఆనందమయాధికరణంలోని పూర్వపక్షియొక్క అనుయాయిని జగద్వాచిత్వాధికరణంలోను నిరసించి, పరమాత్మ చేతనాచేతన విలక్షణుడు - అని నిరూపించారు.**"నేతరః అనుపపత్తేః" (1-1-17)** (అర్థానికి పొసగనందున జీవుడు ఆనందమయుడు కాడు), **"భేదవ్యపదేశాచ్చ" (1-1-18)** (జీవునికంటే ఆనంద మయునకు బేధం పల్కినందున జీవుని కంటే ఆనందమయుడు భిన్నుడు), **"భేదవ్యపదేశాచ్చాన్యః" (1-1-22)** (ఆదిత్యుడు మొదలైన జీవులంకంటే బేధం పల్కినందున అక్షి, ఆదిత్యుడు మొదలైనవానిలో అంతర్వర్తిగా ఉండేవాడు పరమాత్మయే), **"కర్మకర్తృవ్యపదేశాచ్చ" (1-2-4)** (పరమాత్మ పొందబడే వాడుగా, జీవుడు పొందేవాడుగా చెప్పబడినందున 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అనే స్మృతిలో సామానాధికరణ్యంతో చెప్పబడినవాడు పరమాత్మయే), **"ఉభయేఽపి హి భేదేన ఏకమధీయతే" (1-2-21)** (కాణ్వం, మాధ్యందినం అనే రెండు శాఖలు ఈ అంతర్యామిని జీవునికంటే భిన్ననిగా తెల్పుతున్నాయి.) , **"భేదవ్యపదేశాత్" (1-3-4)** (జీవుని కంటే పరమాత్మ భిన్నుడుగా తెలుపబడినందున), **"స్థిత్యదనాభ్యాం చ' (1-3-6)** (పరమపురుషునకు జీవుని శరీరంలో స్థితి మాత్రమే, జీవునకు అయితే కర్మఫలభోగం చెప్పబడిన ద్యుభ్వాద్యాయతనం పరమాత్మయే), **"సుషుప్త్యు త్క్రాంత్యో ర్భేదేన" (1-3-48)** (సుషుప్తి దశలో, మరణావస్థలో, ఉత్క్రాంతి దశలో, జీవపరమాత్మలు వేరువేరని చెప్పబడి నందున ఆకాశం జీవుడు కాదు), **"పత్యాదిశబ్దేభ్యః" (1-3-44)** (పతి మొదలైన

శబ్దాలతో వ్యవహరింపబడు తున్నందున పరమాత్మ జీవుని కంటే భిన్నుడు), **"అధికం తు భేదనిర్దేశాత్" (2-1-22)** (జీవుని కంటే పరమాత్మ వేరని వేదాలు పల్కుతున్నందున జీవునికంటే పరమాత్మ విలక్షణుడు) ఇత్యాది సూత్రాలతో జీవ- పరమాత్మలకు గల పారమార్థిక స్వరూపభేదాన్ని వ్యాసభగవాన్ తెలిపారు. ఈక్షత్యధికరణంనుండి జ్ఞానానందాది గుణయోగాన్ని హేతువుగా చూపి, చేతనాచేతనవిలక్షణం బ్రహ్మం - అనే వ్యాససూత్రాలు **"బ్రహ్మం స విశేషం"** అనే పక్షానికి పొసగుతాయి తప్ప, **"బ్రహ్మం నిర్విశేషం, అద్వితీయం, గుణతోఽపి సద్వితీయతాం న సహతే"** అనే అద్వైతిపక్షానికి పొసగవు. **"సూత్రై రేతైః స్ఫుటార్థైః సవిషయవచనైః నిర్విశేషాఖ్య పక్షే ముఖ్యేక్షాద్యైః స్వధర్మైః ప్రకృతి పురుషతః భేదవాదః కథం స్యాత్?"** అని నిగమాంతదేశికులు పలికారు. జీవపరభేదమే సిద్ధాంతమని భావించిన శ్రీవేదవ్యాసులు జీవపరుల అభేదం అప్రసిద్ధం, విచారసహం కానిది అయినందున, దానిని విచార విషయంగా గ్రహించకుండా, ఉపనిషద్వాక్యాలలో ఎక్కడైనా జీవపరాభేదం అంకురిస్తే ఆ సందర్భంలో మాత్రం జీవపరభేదాన్ని గుణసూత్రాలతో స్థాపించారు - అని గమనించాలి. ధర్మి- ధర్మం (జ్ఞానం) - అనేవి జీవుని విషయంలో, బ్రహ్మం విషయంలో అంగీకృతం. అంటే - జీవపరులిద్దరు జ్ఞానస్వరూపులు, జ్ఞానగుణకులని భావం. **"జ్ఞాతృత్వం జ్ఞానతా చ శ్రుతిభి రభిదధే నాత్ర పక్షే వదామః"** అని దేశికులు కూడా పలికారు. **"యావదాత్మభావిత్వాచ్చ న దోషః ; తద్దర్శనాత్" (2-3-30)** (ఆత్మ ఉన్నంతవరకు నిత్యంగా జ్ఞానం ఉన్నందున, ఆత్మను జ్ఞాన శబ్దంతో నిర్దేశించడం తగినదే. నిత్య ధర్మాలైన గోత్వాదులతో గవాదులు - గోవు మొదలైన శబ్దాలతో - వ్యవహరింపబడడం లోకంలో కన్పిస్తున్నది) అని నిత్యుడైన ఆత్మ, నిత్యమైన ధర్మభూతజ్ఞానాన్ని కలవాడని శ్రీవ్యాసులు పలికారు. ధర్మభూత జ్ఞానాన్ని, దాని నిత్యత్వాన్ని వ్యాసులు స్థాపించే సూత్రం ఇది. ధర్మభూతజ్ఞానం అద్రవ్యం, అనిత్యం, ఆగంతుకం - అని నైయాయికులంటారు. అది ద్రవ్యం, నిత్యం - అని శ్రీరామానుజ మతం. జీవుని ధర్మభూతజ్ఞానానికి సంకోచ వికాసాదులున్నాయి. అయినా, నిత్యుడైన జీవాత్మను ఆశ్రయించి ఉండే ధర్మభూతజ్ఞానం నిత్యమే - అని అభిజ్ఞులంటారు.

అందువల్ల సంకోచవికాస ప్రయుక్తజ్ఞాన వినాశశంకకు అవకాశం లేదు. **"జ్ఞానం చ అస్య నిత్యస్య స్వాభావిక ధర్మత్వేన నిత్యమ్"** (జ్ఞానం నిత్యంగా ఉండడ మనేది దాని స్వాభావిక ధర్మం కనుక అది నిత్యం) అని జిజ్ఞాసాధికరణ శ్రీభాష్యవాక్యం ఇక్కడ అనుసంధేయం. ధర్మం స్వాభావికమైనా, ధర్మి అనిత్యమైతే, తద్గతధర్మంకూడా అనిత్యమవుతుంది. ధర్మి నిత్యమైనా, ధర్మం సోపాధికం అయితే, ఉపాధి తొలగి నపుడు ఔపాధికంకూడా నివృత్తమవుతుంది కనుక, ధర్మం అనిత్యమవుతుంది. ఇక్కడ ధర్మి అయిన ఆత్మ నిత్యం, ధర్మమైన జ్ఞానం కూడా సోపాధికం కాదు. అందువల్ల ధర్మభూతజ్ఞానం నిత్యమే- అని అభిప్రాయపడి శ్రీరామానుజులు, **"నిత్యస్య స్వాభావికధర్మత్వేన"** అని పల్కిన సూక్తి గమనించ దగినది. అందువల్ల శారీరకమీమాంస విశిష్టాద్వైత సిద్ధాంతాన్నే నిరూపిస్తున్నది - అని శ్రీభాష్యంద్వారా మనం గ్రహించే సారార్థం.

ఈ విధంగా ఇంతవరకు ప్రణవార్థం అనుసంధింపబడింది.

పూర్వం అశేషచిదచిద్వస్తుశేషిత్వమనే ప్రణవార్థం మొదటి రెండు అధ్యాయాల అర్థమని నిరూపింపబడినది. ప్రణవాకారంకదా శ్రీభాష్యం. శ్రీభాష్యం **"అఖిలభువన జన్మ"** అని అకారార్థాన్ని ప్రారంభంలోను, **"ఉక్తమ్"** (ఆనుమానికాధికరణారంభం) అని మధ్యలో ఉకారాన్ని, **"సర్వం సమంజసమ్"** అని చివరలో మకారాన్ని కల్గి, ప్రణవాకారంలోనే భాసించడం ప్రసిద్ధం.

మొదటి రెండు అధ్యాయాలలో ప్రణవార్థనిరూపణం చేసిన శ్రీవేదవ్యాసులు, తరువాత గల రెండధ్యాయాలలో **"నమో నారాయణాయ"** అనే మంత్రశేషంలోని అర్థాలను నిరూపించారు. మూడవ అధ్యాయం నమశ్శబ్దార్థ నిరూపణపరం. అది సాధనాధ్యాయమనబడుతుంది. నాల్గవ అధ్యాయం తృతీయపదార్థనిరూపణపరం. ఇది ఫలాధ్యాయమనబడుతుంది.

నమశ్శబ్దార్థం ఉపాయం కదా! **"పంథా నకార ఉద్దిష్టః మః ప్రధాన ఉదీర్యతే, విసర్గః పరమేశస్తు తత్రార్థోఽయం నిరూప్యతే"** (నకారం ద్వారా మార్గం తెలుప బడుతున్నది. మకారం ప్రధానమనే అర్థాన్ని తెల్పుతున్నది. విసర్గ ద్వారా పరమాత్మ తెలుపబడుతున్నాడు. కనుక నమ: శబ్దం ద్వారా నారాయణుడే

పరమోపాయమని తెలుస్తున్నది) అనే అహిర్బుధ్న్య సంహితావచనం ఇక్కడ అనుసంధేయం. సర్వశేషి అయిన నారాయణుడే పరమోపాయం - అని కదా సంప్రదాయనిష్కర్షం.

తృతీయాధ్యాయం

ఇక, ఉపాయపరమైన తృతీయాధ్యాయంలోని అర్థాలను సంగ్రహంగా అనుభవిద్దాం.

ఈ అధ్యాయంలోని నాల్గు పాదాలకు క్రమంగా వైరాగ్యపాదం, ఉభయలింగ పాదం, గుణోపసంహారపాదం, అంగపాదమని పేర్లు. సిద్ధోపాయం- భగవంతుడే అని, సాధ్యోపాయం - భక్తి అని పెద్దల సూక్తి. భక్త్యాదులను వ్యాజమని కూడా అంటారు.

పరమాత్మపట్ల భక్తిని ఒకడు అనుష్ఠించదలిస్తే, అతనికి మిక్కిలి ఆవశ్యకమైనది ప్రాప్యాంతరవైరాగ్యం, ప్రాప్యతృష్ణ అనేది కలగాలి. ఆ రెండు సిద్ధించడంకోసం శ్రీవ్యాసులు మొదటి రెండు పాదాలను అనుగ్రహించారు. తృతీయాధ్యాయంలోని మొదటి పాదాన్ని అనుభవిస్తే ఇతరవిషయవైరాగ్యం, రెండవ పాదాన్ని తెలిస్తే భగవద్విషయంలో తృష్ణ పొందవచ్చు - అని అర్థం. ఇతర విషయంలోని దోషాలను మొదటి పాదంలోను, పరమాత్మ కల్యాణగుణాలను రెండవ పాదంలోను నిరూపిస్తున్నారు.

పరబ్రహ్మానుభవరూపమైన ముక్తి జ్ఞానసంకోచనివృత్తి రూపమైనది. జ్ఞానసంకోచ ధ్వంసమని దీని భావం. ధ్వంసరూపాభావం సాది అయినా, అనంతమైనందున నాశం లేనిది. ఈ విధంగా అనడం పరపక్షానుసారంగానే. వాస్తవానికి శ్రీరామానుజ సిద్ధాంతంలో భావాంతరమే అభావమని అంగీకరింప బడినందున జ్ఞానసంకోచ నివృత్తి - అనే అభావం జ్ఞానవికాసరూప భావమే కాగలదు. అది నిత్యమనేది **"న చ పునరావర్తతే"** ఇత్యాది శ్రుతిసిద్ధం జ్ఞానానికి వికాసం స్వాభావికమనేది వేదాంత సిద్ధాంతం. అది కర్మమూలంగా సంకోచాన్ని పొందుతుంది. జ్ఞానసంకోచమే సంసారం. భగవదనుగ్రహవిశేషంచేత కర్మమనే

ఉపాధికి నివృత్తి ఏర్పడగా, స్వాభావికమైన వికాసం కల్గుతుందని భావం. ఈ విషయం **"స చానంత్యాయ కల్పతే"** అనే శ్రుతిద్వారా స్పష్టంగా తెలుపబడింది.

ఇటువంటి బ్రహ్మానుభవరూపఫలాన్ని నాల్గవ అధ్యాయంలో నిరూపించ బోయే వారై, తదుపాయాన్ని మూడవ అధ్యాయంలో నిరూపించగోరి, విషయాంతరవైరాగ్యం కల్గి, భగవద్విషయతృష్ణ కల్గడంకోసం విషయాంతర దోషాలను, భగవద్విషయ గుణాలను మొదటి రెండు పాదాలలో శ్రీవ్యాసులు నిరూపించారు.

విషయాంతర వైరాగ్యం, భగవద్విషయరాగమే కదా బ్రహ్మవిద్యాధికారం అంటే.

వైరాగ్యపాదం : ఇక్కడ ఒక సందేహం కల్గుతుంది. అది ఏమంటే- విరక్తుడేకదా వేదాంతశ్రవణానికి అధికారి. అందువల్ల వేదాంతశ్రవణకాలంలోనే వైరాగ్యం ఏర్పడినందున, మళ్ళీ తిరిగి మూడవ అధ్యాయంలోని ప్రథమ పాదంలో వైరాగ్యం కల్గుతుందని అనడం ఏమి? అనేది ఆ సందేహం. దీనికి సమాధానం ఏమంటే - వైరాగ్యమనేది రెండు విధాలు. శాస్త్రశ్రవణం చేయడానికి ఉపయోగించే వైరాగ్యం ఒకటి. ఉపాసనానుష్ఠానికి ఉపయుక్తమైన వైరాగ్యం ఇంకొకటి. మొదటి వైరాగ్యం ఈ అధికారికి ఇంతకు ముందే కల్గినా, రెండవ వైరాగ్యం కలుగడంకోసం ఈ వైరాగ్యపాదాన్ని శ్రీవ్యాసభగవానులు అనుగ్రహించారని తెలియాలి.

సంసారంలోని దోషాలను తెలియజేయడంవల్ల అందులో అలవాటు పడిన సంసారయాత్రలో జుగుప్స కల్గుతుంది. భగవద్విషయం మధురమైనది, కల్యాణ గుణాకరం, నిర్మలం - అని అనడంవల్ల దానియొక్క భోగ్యతాప్రకర్షత తెలుపబడింది.

గర్భంలో ఉండగా మరణించడం, పుట్టేటపుడే మరణించడం, జన్మించిన వెంటనే మరణించడం, ఒకనాడు మాత్రం జీవించి మరణించడం, బాల్యంలో మరణించడం, గర్వించి తిరిగే యౌవనదశలో చనిపోవడం, వార్ధక్యంలో మరణించడం - అని ఈవిధంగా జీవుని మరణం ఎపుడు కల్గుతుందో

నిర్ణయించడం సాధ్యం కాకుండా ఉన్నది. తన హితాహితాలన్నీ తల్లి బుద్ధికి అధీనంగా ఉండే అత్యంత శైశవమైన వయస్సు, చిలిపి పనులను చేసినా శిక్షించడానికి మనస్సు రాని బాల్యం, శైశవమే మేలు - అనే రీతిలో ఉండే యౌవన దశలోని జ్ఞానహైన్యం, ఏదైనా జ్ఞానం ఉంటే, అది అకృత్యకరణానికి, కృత్యాకరణానికి ఉపయోగపడే ఆ యౌవనం, మాఱడానికి ముందే వ్యాధి వచ్చి ఆక్రమిస్తుంది. దానిని ఏదో ఒక రీతిలో పరిహరించ గల్గితే, ఆకలి మీదపడుతుంది. ఇక్కడ ఆకలి అంటే - సర్వేంద్రియాలు సర్వవిషయా లలో ప్రావణ్యాన్ని పొందడం. ఇది అంతా జరుగుతూ ఉండగానే వార్ధక్యం వచ్చి చేరుతుంది. జర (ముసలితనం) అనేది చాలా భయంకరమైనది కదా! ఆ దశలో భోగయోగ్యత లేకపోయినా, చాపల్యం వెంటాడుతుంది. **"పణ్డు కామరాన వాఱుమ్"** (పెరియతిరు-1-3-5) అనే రీతిలో జరిగిన దానిని మళ్ళీ ఒకసారి స్మరించి పల్కి, ప్రాణాలను నిలుపుకొంటాము - అని ప్రయత్నించినా, ఇంతలో పిడుగుపడినట్లుగా మరణం వచ్చి ఉపస్థితమవుతుంది. ఇన్ని అనర్థపరంపరలను కల సంసారం త్యాజ్యం.

లోకాంతరంలో సంచరించే జీవుని దోషాలను వైరాగ్యపాదంలో వ్యాసులు నిరూపించారు. దీనివల్ల జాగ్రదవస్థ (మేలుకొన్న దశ) మొదలైన అవస్థలలో దోషాలు ఫలితాలని భావం. ఛాందోగ్యోపనిషత్తులోని పంచాగ్ని విద్యాప్రకరణంలో ఇది స్పష్టంగా తెలుపబడింది. పంచాగ్నివిద్యోపన్యాసం వైరాగ్యం కల్గడంకోసమే. తల్లి గర్భం మలమూత్రాది పూర్ణం. శిశువు అందులో ఉంటాడు కదా. తల్లి భుజించిన ఆహారానికి తగినట్లుగా ఇతడు వృద్ధిని పొందుతాడు. ఇతని వీర్యబలశక్తితేజఃప్రజ్ఞలు ఈ దశలో నిరుద్ధాలై ఉంటాయి కదా! అక్కడ చాలాకాలం పడి ఉండి, యోనిమార్గం ద్వారా వెలువడడంలోనే ఎంతో శ్రమ ఉన్నది. కర్మానుగుణంగా కొనాళ్ళు జీవించి ఉండడం, మళ్ళీ ఏతామువలె ఆరోహణావరోహణాలు, (సంసార) పరిభ్రమణమే కదా జీవున కున్నది. **"పునరపి జననం పునరపి మరణం పునరపి జననీశఠరే శయనమ్"** కదా జరుగుతుంది. **"ఆదలాల్ పిఱవి వేణ్డేన్ అరఙ్గమానకరుళానే!"** (తిరుమాలై-3) అనే వైరాగ్యం కల్గడం కోసం కదా ఈ ఉపన్యాసం చేయబడింది.

ద్యౌః, పర్జన్యుడు, పృథ్వి, పురుషుడు, యోషిత్ - అనే ఈ అయిదు అగ్నులు. **శ్రద్ధ, సోమం, వర్షం, అన్నం, రేతస్సు** - అనే ఈ అయిదు హోతవ్యాలు. పితృదేహధారక మృత్తులు హోతలు. పంచమాహుత్యపేక్షావచనం ప్రాయికం. అతిశయించిన పుణ్యాలను కల ద్రౌపది, ధృష్టద్యుమ్నుడు మొదలైనవారు పంచమాహుత్యపేక్ష లేకుండానే జన్మించారు. అతిశయించిన పాపాలను కల కొన్ని విషయాలలో (వ్యక్తు లలో) కూడా దీనికి అపవాదమున్నది. అందువల్ల ఇటువంటి అపవాదం లేని చోట్ల పంచమాహుత్యపేక్షావచనం సావకాశమని భావం. శ్రద్ధ మొదలైన అయిదింటిలో మొదట చెప్పబడిన శ్రద్ధ అనే సజీవభూతసూక్ష్మం స్వర్గరూపమైన అగ్నిలో హుతమై, సోమమనే అమృతదేహమై పరిణమించి, పర్జన్యరూపమైన అగ్నిలో హుతమవుతున్నది. ఆ సోమం వర్షంగా పరిణమించి పృథివీరూపాగ్నిలో హుతమవుతున్నది. ఆ వర్షం అన్నంగా పరిణమించి పురుషాగ్నిలో హుతమవుతున్నది. అన్నం రేతస్సుగా పరిణమించి యోషిత్ - అనే అగ్నిలో హుతమవుతున్నది. ఈ రీతిలో క్రమంగా రేతఃపర్యంతంగా పరిణమించిన జీవసహితహోతవ్యవస్తువులను హోతలైన దేహధారక మృత్తులు హోమం చేస్తున్నారు. యోషిదగ్నిలో హుతమైనదే పురుషశబ్దంతో వ్యవహరింపదగినది అవుతున్నది. **"తస్మిన్ యావత్సంపాత ముషిత్వా అథైత మేవాధ్వానం పునః నివర్తంతే, అథైత మాకాశ మాకాశాద్వాయుం... వ్రీహి యద్వా జయంతే"** (ఛాందో-5-10-5) అని అవతరించే జీవులకు వ్రీహ్యాది భావం అధ్యయనం చేయబడుతున్నది. ((శ్రుతిలో చెప్పబడుతున్నది.) ఆ ధాన్యాన్ని శరీరమని అభిమానించే జీవాత్మ అన్యుడు. ధూమాదిమార్గంద్వారా అవరోహణం చేసే ఈ జీవునకు ఆ వ్రీహిలో సంశ్లేషమాత్రమే గ్రహించాలి. పైరును కోసే సమయంలో ధాన్యాన్ని కోసే టపుడే దానిని శరీరంగా అభిమానించిన జీవునకు వియోగం. ఇతడు మాత్రం ఛేదించే కాలంలో, రోటిలో దంచేటపుడు, చెఱిగి, కడిగి, వంటిచేసే సమయంలో తేడా లేకుండా సదా ధాన్యంతో చేరి పురుషగర్భాన్ని చేరుతాడు. అందువల్ల వ్రీహ్యాదిభావంతో జననం ఔపచారికమని భావం. ఈ విధంగా సంసారిజీవగత దోషాలను వ్యాసులు వైరాగ్యపాదంలో నిరూపించారు.

ఈ వైరాగ్యపాదం సాంఖ్యులకు, మాయావాదులకు అసంగతమని మన పూర్వా చార్యులంటారు. సాంఖ్యాదులు - ఆకాశం రోకటి పోటుతో ఏ విధంగా బాధింప బడదో, ఆ విధంగానే దేహాదులతో ఆత్మ బాధింపబడడు, ఇతనికి ఫలభోక్తృత్వం లేనట్లే, కర్తృత్వం కూడా లేదు. అందువల్ల ఫలం జీవోపాధియైన అహంకారానికే; మోక్షంకూడా ప్రకృతికే - అని సాంఖ్యాదులు అంటారు.

వ్యాసులు, జీవునకు సంసారసంబంధాన్ని, దోషసాహిత్యాన్ని పల్కి, వారి పక్షాన్ని నిరసించారు. సాంఖ్యుడు - **"ప్రకృతి - సత్యపదార్థమ్, తత్ప్రయుక్త సుఖ దుఃఖాది దోషాలు - అసత్యం"** అని అంటాడు. మాయావాది అయితే, మాయకూడా అసత్యమే అంటాడు. వ్యాసులు, జీవునకు పారమార్థిక సంసార సంబంధాన్ని పల్కి ఆ రెండు పక్షాలను (సాంఖ్య - మాయావాది పక్షాలను) నిరసించారు.

ఉభయలింగపాదం :- శ్రీవేదవ్యాసులు, వైరాగ్యపాదంలో ఐశ్వర్యాది ప్రాప్యాంత రాలలో ముముక్షువునకు అరుచి కల్గడం కోసం, చేతనాచేతనగత దోషాలను నిరూపించారు. ఇక, ముముక్షువునకు ఉభయలింగపాదంలో భగవద్విషయ మనే పరమ ప్రాప్యంలో తృష్ణ కల్గడంకోసం పరమాత్మయొక్క కల్యాణగుణాలను, అతడు ఉభయలింగవిశిష్టుడని ఈ పాదంలో నిరూపిస్తున్నారు. అఖిలహేయ ప్రత్యనీకత్వం, కల్యాణగుణైకతానత్వమే కదా, ఉభయలింగాలంటే. ఈ రెండు చిహ్నాలు పరమాత్మకు అసాధారణాలు. వీటివల్ల పరమాత్మ స్వేతరసమస్త విలక్షణుడని మన పూర్వాచార్యుల సూక్తి. బృహత్వ - బృంహణత్వాలనే బహ్మ శబ్దార్థాలు ఈ ఉభయలింగాలని కూడా చెప్పవచ్చు. ఉపాయత్వానికి అనుగుణమైన హేయప్రత్య నీకత్వం, ఉపేయత్వానికి అనుగుణమైన సమస్తకల్యాణగుణైకతానత్వం, ఉపాయో పేయత్వస్వభావమైన పరబ్రహ్మకు అసాధారణాలు కదా!

ఈ సందర్భంలో ఒక సందేహం కల్గుతుంది. అది ఏమి? అంటే - మొదటి రెండు అధ్యాయాలలో పరమాత్మత్వం చేతనాచేతనవిలక్షణంగా, సర్వజ్ఞంగా, సర్వశక్తంగా (సర్వశక్తిని కల్గినదిగా), జగదేకకారణంగా, అద్భుత

కారణంగా, యుక్త్యా భాసాలతో అవిచాల్యంగాను నిరూపితంకదా! ఆ పరమాత్మను తిరిగి ఈ సాధనా ధ్యాయంలో నిరూపించడం ఎందుకు? సాధనాన్ని కదా ఈ అధ్యాయంలో నిరూపిస్తున్నారు?- అనేది ఆసందేహం. దీనికి పరిహారమేమి? అంటే, ఈ అధ్యాయం సాధనాధ్యాయమైనందున ఇందులో సాధనాన్నిగూర్చి మాత్రం నిరూపించడమనేది యుక్తమే. అయినా, బ్రహ్మను ఈ అధ్యాయంలో నిరూపించడంలో అనుపపత్తి కొంచెంకూడా లేదు. సాక్షాత్ సాధనం పరబ్రహ్మయేకదా! శేషియై, ప్రాప్యమై ఉండే బ్రహ్మమే కదా, ఉపాయం. శేషిగా ప్రణవం ద్వారా నిరూపింపబడినది, ప్రాప్యంగా తృతీయపదంతో (**"నారాయణాయ"** అనే పదం ద్వారా) నిరూపింపబడినది అయిన పరబ్రహ్మమే ఉపాయం - అని నమశ్శబ్దార్థమైన హృదయంతో (నమశ్శబ్దంతో) ఘోషింప బడుతున్నది - అనికదా సత్సంప్రదాయహృదయం. అందువల్ల, ఈ పాదంలో పరమాత్మను ఉపాయంగా, ఉపేయంగా, సకలఫలప్రదునిగా వ్యాసమహర్షి నిరూపించారు. ఈ విషయాలను పరాధికరణంలోను, ఫలాధికరణంలోను గమనించవచ్చు.

ఈ పాదంలో, పరబ్రహ్మం సగుణమని, నిర్దోషమని వ్యాసులు నిరూపిస్తున్నారు. అందువల్ల ఈ పాదం శ్రీరామానుజదర్శనానికి అత్యంతం అనుకూలమని చెప్పదగినది. **"అశేషవిశేషప్రత్యనీకచిన్మాత్రం బ్రహ్మం, దానికి పారమార్థికమైన గుణా లేమీ లేవు; బ్రహ్మం వాస్తవానికి నిర్గుణమే"** అనేవారికి ఈ పాదం, తర్వాత గల గుణోపసంహార పాదం, అన్ని విధాలుగాను అసంగతమే కాగలవు. సగుణత్వాన్ని స్థాపించే ఉభయలింగపాదం, ఉపాస్యగుణభేదంతో విద్యాభేదాన్ని స్థాపించే గుణోప సంహారపాదం కూడా ఏ రీతిలో నిర్గుణవాదానికి పొసగుతుంది? అని ఆలోచించాలి. కల్యాణగుణాలు పరమార్థాలని భావిస్తే, సగుణవాదం ప్రసక్తమవుతుంది. గుణాలు అసత్యాలు - అని చెప్పాలని చూస్తే, తామే అంగీకరించిన స్వయంప్రకాశత్వం, ఆనందత్వం - అనేవి కూడా లేకుండా పోతాయి. ఇవికూడా లేవు - అని అంటే, బౌద్ధాదిమతప్రవేశప్రసంగం ఏర్పడుతుంది. బౌద్ధాదివైలక్షణ్యంకూడా సిద్ధించదు. అంతేకాక, వేదంలోని సగుణనిర్గుణవాక్యాలు భిన్నవిషయాలైనందున విరోధం లేశంకూడా లేనివి -

అని గ్రహించాలి. పరమాత్మ కల్యాణగుణవిశిష్టుడు అనేది సగుణవాక్యాలకు, అతడు అపగుణరహితుడు - అనేది నిర్గుణవాక్యాలకు విషయం కనుక, విరోధలేశం కూడాలేదు - అని భావం. **"దూరే గుణా స్తవ తు సత్త్వరజస్తమాంసి తేన త్రయీ ప్రథయతి త్వయి నిర్గుణత్వమ్"** (సత్యం, రజస్సు, తమస్సు- అనే గుణత్రయం నీకు చాలా దూరం. అందువల్లనే వేదం నీకు నిర్గుణత్వాన్ని కీర్తించింది) అని కూరేశులు పలికారు. **"కల్యాణైః అస్య యోగః, తదితర విరహోఽపి ఏకవాక్య శ్రుతౌ చ"** అనే రీతిలో ఈ విషయ విభాగం శ్రుతిసిద్ధం. **"అపహతపాప్మా... సత్యకామః సత్యసంకల్పః"** అని కదా ఉపనిషద్వాక్యం. **"నిర్గుణమ్"** అనే గుణనిషేధం **"యః సర్వజ్ఞః సర్వవిత్"** ఇత్యాదులచే విధింప బడిన కల్యాణగుణాలు కంటే వేరయిన (హేయ) గుణాలలో అన్వయించాలి - అనే అర్థసంకోచాన్ని చేయాలి. ఇది ఉత్సర్గాప వాదన్యాయ సిద్ధం. లేక, **"నిర్గుణమ్"** అనే గుణ సామాన్య నిషేధం - **"అపహతపాప్మా విజరః"** ఇత్యాది వాక్యాలనుబట్టి గుణవిశేష నిషేధంలో దృష్టి కల్గినదని కూడా చెప్పవచ్చు. ఇది సామాన్యవిశేష న్యాయసిద్ధం. **"నిర్గుణమ్"** అనే గుణసామాన్య నిషేధవచనంవలె గుణసామాన్య విధాయకవాక్యం ఏదయినా ఉపనిషత్తులో కన్పించి నట్లయితే, విరోధశంకకు అవకాశం ఉన్నది. ఆ విధంగా గుణసామాన్య విధాయక వాక్యం వేదంలో లేదు - అని చెప్పవచ్చు. **"యః కాలకాల్యాః గుణీ సర్వవిత్ యః"** ఇత్యాది సందర్భాలలోని **"గుణీ"** అనే పదం కూడా గుణవిశేషపరమనికదా గ్రహించాలి. **"వశీ వదాన్యో గుణవాన్ ఋజుః"** ఇత్యాది ఆళవందార్ దివ్యసూక్తిలోను, **"కః గుణవాన్ కశ్చ వీర్యవాన్"** అనే శ్రీవాల్మీకి వాక్యంలోను ఉండే **"గుణవాన్"** అనే పదానికి కల్యాణగుణసామాన్యపరత్వాన్ని గ్రహించకుండా, గుణవిశేషపరత్వాన్ని గ్రహించడం సమభివ్యాహారసిద్ధం. ఆ విధంగా ఈ ఉపనిషత్తులో కూడా **"గుణా"** అనే పదాన్ని గుణవిశేషపరంగా మన పెద్దలు గ్రహించారు. ఈ విధంగా ఉత్సర్గాపవాద - సామాన్య విశేషన్యాయాలతో సగుణనిర్గుణ వాక్యాలకు విరోధమనేది లేనే లేదనే మన పెద్దలు, ఈ రెండు వాక్యాలకు మధ్యవిరోధ మున్నదని గ్రహించినా, విరోధాధికరణ న్యాయంతో గాని, లేక ఉపక్రమాధి కరణన్యాయంతో గాని సగుణవాక్యం ప్రబలమని చెప్పడం తగునని అంటారు.

ఇక్కడ అపచ్ఛేదన్యాయాన్ని గ్రహించి, నిర్గుణవాక్యం ఉత్తరశాస్త్రం కనుక ప్రబలం- అనడం సర్వాత్మనా అయుక్తం. అపచ్ఛేదన్యాయం అనేది అనియత పౌర్వాపర్య విషయం. **"పౌర్వాపర్యం విరోధశ్చ పూర్వప్రామాణ్యమేవ చ, నియమాన్నాస్తి యత్రాసౌ అపచ్ఛేదనయో భవేత్"** అని చెప్పబడుతున్నది కదా! సగుణనిర్గుణ వాక్యాలకు విరోధం స్వరూపప్రయుక్తం. విధినిషేధరూపంగా ఉన్నందున పౌర్వాపర్యంకూడా నియతం. అందువల్ల నియతవిరోధ పౌర్వాపర్యమైన సగుణనిర్గుణవాక్యసందర్భాలలో అపచ్ఛేద న్యాయం ప్రవర్తించే అవకాశమే లేదు. కనుక, దీనినిబట్టి సగుణవాక్యం దుర్బలం, నిర్గుణవాక్యం ప్రబలమనేది పొసగదు. అంతేకాక, విరోధాధికరణ, ఉపక్రమాధికరణ న్యాయాలతో సగుణవాక్యప్రాబల్యమే సిద్ధిస్తుంది. దీనికి మించి, ఉత్తరం ప్రబలమని గ్రహించి, నిర్గుణవాక్యం ప్రబలమని అనాలని చూస్తే, **"బ్రహ్మ సత్"** అనే వాక్యానికి తరువాత **"బ్రహ్మ అసత్"** అనే బౌద్ధవాక్యం ఉన్నందున బౌద్ధపక్షమే చిరంజీవియై, వైదికపక్షం ప్రతిహతం కాగలదు. అందువల్ల, బ్రహ్మం కల్యాణవిశిష్టమైనందున సగుణమని గ్రహించడమే తగును.

కల్యాణగుణప్రకరణాలలో - ఉపనిషత్తులలో బ్రహ్మానికి చెప్పబడే గుణాలకు ఏవిధమైన ఉపాధి (హేతువు) చెప్పబడలేదు. అందువల్ల కల్యాణగుణయోగం అనేది నిరుపాధికం, స్వాభావికం- అని సుస్పష్టం. ఇంతేకాక, **"స్వాభావికీ జ్ఞానబలక్రియా చ"** అని వేదంలో గుణాలు స్వాభావికాలు- అని ఘంటారవంగా చెప్పబడింది. ఇంతేకాక, **"నాన్యో హేతుర్విద్యతే ఈశనాయ"** అని గుణాలకు సోపాధికత్వఖండనం కూడా చేయబడింది. **"ఈశనమ్"** అనే ఒక గుణానికి చేయబడిన సోపాధికత్వనిషేధం ఉపలక్షణ ప్రక్రియలో సమస్త కల్యాణగుణాలకు పొసగుతుంది. ఇంతేకాదు, ఉపాధి అయిన కర్మను పోగొట్టి, సత్యకామత్వాదులను **"అపహతపాప్మా విజరో... సత్యకామః సత్యసంకల్పః"** అని అంటూ శ్రుతి పల్కింది కదా! ఇంతేకాక, **"త ఇమే సత్యాః కామాః"** అని బ్రహ్మస్వరూపంవలె కల్యాణగుణాలు కూడా సత్యాలని చెప్పబడింది.

ఇంతేకాక, ఆనందగుణమీమాంసలో **"తే యే శతమ్"** అని గుణోత్కర్ష మున్నదే తప్ప, గుణాపకర్షం లేదు - అని పల్కిన విషయం కూడా నిశితంగా

గమనించదగినది. ఇంతేకాదు, సగుణనిర్గుణవాక్యాలకు విషయభేదంవల్ల విరోధం లేదు - అని, విరోధాన్ని చెప్పినా, సగుణవాక్యాలకు ప్రాబల్యం సిద్ధిస్తుందనే విషయం పూర్వమే నిరూపింపబడింది. సూత్రకారులు కూడా - **"అతోఽనంతేన, తథాహి లింగమ్" (3-2-25)** (పూర్వం పల్కిన హేతువులు వల్ల, ముందు పల్కిన అంతులేని కల్యాణ గుణాలను కల్గినదిగానే పరబ్రహ్మం ఉన్నది. ఈ విధంగా ఉన్నందున పరబ్రహ్మం ఉభయలింగ విశిష్టం), **"ఆదరాత్ అలోపః" (3-3-39)** (కల్యాణ గుణాలను ఉపనిషత్తు ఆదరంతో పఠిస్తున్నందున అవి విడువదగినవి కావు) ఇత్యాదులతో బ్రహ్మయొక్క సగుణత్వాన్ని ఆదరించారు. శ్రుతి స్వయంగా **"ఆనందం బ్రహ్మణో విద్వాన్"** అని బ్రహ్మ స్వరూపంలోకంటే బ్రహ్మగుణంలో అత్యాదరాన్ని చూపించింది - అని మన పెద్దల సూక్తి. ఈ విషయంలో **"ఆనందం బ్రహ్మణో విద్వాన్ - ఇతి "బ్రహ్మణః కల్యాణగుణాన్ అత్యాదరేణ వదతీయం శ్రుతిః"** అనే జిజ్ఞాసాధికరణవాక్యం, **"అత్యాదరేణేతి - బ్రహ్మస్వరూపాదపి తద్గుణేషు ఆదరాతిశయ ఉక్తిః. ఆనందం బ్రహ్మణో విద్వాన్ - ఇతి భావః"** అనే శ్రుతప్రకాశికా వాక్యం కూడా అనుసంధేయం. **"న హి బ్రహ్మణో విశేషణతయా ప్రమాణాన్యతరా ప్రజ్ఞాతం సర్వం తద్విశేషణత్వేన ఉపదిశ్య, పునః తదేవ అనున్మత్తః ప్రతిషేధతి"** అనే ఉభయలింగాధికరణ శ్రీభాష్య వచనం, **"న చ మాతాపితృసహస్రేభ్యోఽపి వత్సలతరం శాస్త్రం ప్రతారకవత్ అపారమార్థికాన్ నిరసనీయాన్ గుణాన్ ప్రమాణాంతరాప్రతిపన్నాన్ ఆదరేణోపదిశ్య, సంసారచక్ర పరివర్తనేన పూర్వమేవ బంభ్రమ్యమాణాన్ ముముక్షూన్ భూయోఽపి భ్రమయితు మలమ్"** అనే కామాద్యధికరణశ్రీభాష్యసూక్తి విశేషించి అనుసంధేయాలు. ఇంతేకాక, ఉపాసనవిధిరహితాలైన **"యః సర్వజ్ఞః"** ఇత్యాది వచనాలలో బ్రహ్మస్వరూపం వలె గుణాలుకూడా ప్రతిపన్నాలు. అందువల్ల ఉపాసంకోసంగా గుణాలు కల్పితాలు అనడం పొసగదు. ఉపాస్యం కనుక గుణాలు అపారమార్థికాలు - అని అంటే, బ్రహ్మస్వరూపం కూడా ఉపాస్యమే కనుక, అసత్యమవుతుంది. కాబట్టి, శ్రుతి పోయిన దారిలో మనం బ్రహ్మం సమస్త కల్యాణగుణ విశిష్టమని గ్రహించడమే ఉచితం.

అంతేకాక, **"యావదాత్మభావిత్వాత్" (2-3-30)** అని గుణ-గుణులకు మధ్య భేదాన్ని శ్రీవ్యాసభగవానులు స్పష్టంగా పల్కుతున్నారు - అని పూర్వం తెలుపబడి నందున, గుణ - గుణులకు అభేదవాదం కూడా అయుక్తమే కాగలదు. **"ఆనందో బ్రహ్మ"** అని ఏతావన్మాత్రాన్ని గ్రహించి గుణ-గుణుల మధ్య అభేదం - అని చెప్పదలిస్తే, **"ఆనందం బ్రహ్మణో విద్వాన్"** ఇత్యాది వ్యతిరేకనిర్దేశ స్వారస్యభంగ ప్రసంగం ఏర్పడుతుంది. "ఈ రెండు నిర్దేశాలు - బ్రహ్మం ఆనందస్వరూపం కనుక ఆనందగుణకం కనుక, పొసగుతాయి'' అనేది మన పెద్దలు దర్శించిన క్రమం. గుణ - గుణులకు అభేదాన్ని గ్రహిస్తే, అరుణాధికరణ విరోధం ప్రసంగిస్తుంది. ఆ అధికరణంలో- ఆరుణ్యగుణానికి ద్రవ్యత్వాకార క్రయసాధనత్వం సిద్ధాంతం చేయబడింది కదా! అంతేకాక, సామానాధికరణ్యనిర్వాహంకూడా సంభవించదు. అవిరుద్ధానేకప్రకారావ గాహియై, ధర్మైక్యావగాహియై కదా (పరస్పరం విరోధంలేని, అనేక భిన్న భిన్న ధర్మాలను కల ఒకే ధర్మిగా) ప్రతీతి - అనేది ఉంటుంది. అది వ్యాహతమవు తుంది. గుణ-గుణులకు అభేదాన్ని పల్కితే, అద్వైతమతంకంటే స్వమతానికి విశేషం ఏమీ లేకుండా పోతుంది. ఇంతేకాదు, గుణభేదప్రయుక్తమైన విద్యాభేదాన్ని నిరూపించే గుణోపసంహారపాదం అసంగతమవుతుంది. సూత్రకారు నిచే చెప్పబడిన విద్యాభేదవికల్పంకూడా అయుక్తం. అందువల్ల, బ్రహ్మ సత్యం, ఆవిధంగానే, తద్గుణాలకు భేదంకూడా పారమార్థికమే - అని మన పెద్దలంటారు. ఇటువంటి బ్రహ్మ కల్యాణగుణాలను ఉభయలింగపాదంలో శ్రీవ్యాసులవారు నిరూపించారు. **"తస్మాత్ బ్రహ్మ ద్విలింగం ద్వివిధవిభవ మిత్యేవ వేదాంతపక్షః"** అని కదా నిగమాంతగురువులనే సింహం చేసిన గర్జన.

ఈ పాదంలో అధికరణాలు ఎనిమిది ఉన్నాయి. మొదటి నాల్గు అధికరణాలతో జీవదోషాలను తిరిగి పలికారు. దీనికి, ఈ పాదంలో సంబంధం ఏమి? అంటే, **"స్వప్నార్థప్రష్టుభావప్రభృతి బహువిధబ్రహ్మమాహాత్మ్యసిద్ధ్యై"** అనే రీతిలో స్వాప్న పదార్థాలను సృష్టించడం మొదలైన పరమాత్మ యొక్క మాహాత్మ్య ప్రతిపాదనమే దీనివల్ల ఫలిస్తుంది కనుక, ఈపాదంలో జీవస్వప్నాది దోష నిరూపణం సంగతమే - అని అంటారు. ఈ మొదటి నాల్గు అధికరణా

లను వైరాగ్యపాదశేషంగా సేనాపతి మిశ్రులు న్యాసకలాప సంగ్రహంలో తెలిపారు. అయినా, **"పరమాత్మనః స్వాప్న విచిత్రార్థప్రష్టృత్వం, సుషుప్తిస్థానత్వం చ ఆకారద్వయం ప్రతిపాదితం భవతీతి పరమాత్మగుణసిద్ధేః అస్మిన్ పాదే తన్నిరూపణమ్"** (స్వప్నంలోని విచిత్రమైన వస్తువులను సృష్టించే పరమాత్మ యొక్క స్వభావం, అతడు సుషుప్తి స్థానమై వేంచేసి ఉండడం-అనే ఈ రెండు తెలుపబడుతున్నందున, దీనివల్ల పరమాత్మ గుణాలు సిద్ధిస్తున్నాయి. కనుక, ఇవి ఈ పాదంలో నిరూపింపబడుతున్నాయి) అనే శ్రుత ప్రకాశికా దివ్యసూక్తి రీతిలో ఎనిమిది అధికరణాలే ఈ పాదంలో సాక్షాత్తు సంగతాలు అని చెప్పాలి.

ఇక, అధికరణార్థాలను సంగ్రహంగా అనుభవిద్దాం (తెలిసికొందాం). ఈ పాదంలో మొదటి నాల్గు అధికరణాలలో జీవదోషాలను గూర్చి శ్రీవేదవ్యాసులు నిరూపించారు.

భగవద్గుణనిరూపణపరమైన ఈ పాదంలో జీవదోషాలను నిరూపించడం ఎందుకు? అంటే - స్వప్నావస్థలోవలెనే సర్వావస్థలలోను జీవుడు భగవదత్యంత పరతంత్రుడే, - స్వతంత్రుడు కాడు; పరమశేషి అయిన పరమాత్మతో ఏకీభావాన్ని పొందినవాడుకూడా కాడు - అని తెలుపడంకోసం ఇక్కడ జీవ స్వప్నాద్యవస్థా నిరూపణం చేయబడింది. ముందు తెల్పినట్లుగా, భగవంతుడు విచిత్రస్వప్న పదార్థాలను సృష్టిస్తున్నాడు, అతడు సర్వజ్ఞుడు, సర్వశక్తి - అనే ఈశ్వరమహిమను తెలుపడంకోసం ఈ నిరూపణం - అని గ్రహించాలి. ఇందువల్ల, విచిత్ర పదార్థాలను సృష్టించే స్వభావం, సుషుప్తి స్థానమై ఉండే స్వభావం - అనే రెండు ఆకారాలు భగవంతునకు మహిమగా ఈ పాదంలో ప్రతిపాదింపబడుతున్నాయి.

ఈ పాదంలోని మొదటి అధికరణమైన సంధ్యాధికరణంలో - "సంధ్యే" అని ఆరంభించి, రెండు సూత్రాలతో **"జీవుడే స్వాప్నపదార్థప్రష్ట"** అనే పూర్వపక్షాన్ని తెల్పి, **"మాయామాత్రమ్"** అని ఆరంభించి, నాల్గు సూత్రాలతో **"పరమాత్మయే స్వాప్నపదార్థప్రష్ట"** శ్రీవేదవ్యాసులు సిద్ధాంతీకరించారు -అనేది శ్రీభాష్యసారం. ఈ అధికరణంలో- **"స్వాప్నపదార్థం సత్యం, పారమార్థికం"**

అనే పూర్వపక్షాన్ని, **"స్వాప్నం అసత్యం, అపారమార్థికం"** - అనే సిద్ధాంతాన్ని ఇతరమతస్థులు నిరూపించారు. **"మాయామాత్రోక్తి లాభాత్ శ్రుతిముఖసుగతాః విశ్వమిథ్యాత్వ మాహుః"** అనే రీతిలో వీరి వాదానికి మాయాశబ్దమే ముఖ్యావష్టంభకం. ఇది అయుక్తం. మాయాశబ్దం మిథ్యావాచకం కాదు; ఆవిధంగా మాయావాచకంగా అది నిఘంటువులలో చూపబడలేదు.- అనేది మాత్రమేకాక, దీనికి విరుద్ధంగా, **"మాయా వయునం జ్ఞానమ్"** అనే మాయాశబ్దం జ్ఞానపరమని నిఘంటువుకూడా ఉన్నది. శ్రీపరాశరభగవానుడు పురాణరత్నమైన విష్ణుపురాణంలో **"తేన మాయాసహస్రం తత్.. సూదితమ్"** అని మాయాతత్త్వాన్ని శ్రీసుదర్శనవినాశితంగా కదా అన్నారు. అపారమార్థికమే అయితే, అది జ్ఞానవినాశ్యమవుతుంది. ఇది సత్యమైనందువల్లనే కదా ఆయుధవినాశ్యంగా పలికారు - అని గ్రహించాలి. ఇంతేకాక, **"సూదితమ్"** అని ప్రధ్వంసరూపనాశం చెప్పబడింది. పరమార్థవస్తువునకే ప్రధ్వంసరూపనాశం కూడుతుంది. (అందువల్లనే **"మాయామృగో హతః"** అని మారీచుడనే మాయామృగానికి ధ్వంసం చెప్పబడింది) అది అపరమార్థమే అయితే **"బాధితమ్"** అని కదా చెప్పబడాలి. మాయాశబ్దాన్ని **"మాయాం తు ప్రకృతిం విద్యాత్"** అని ప్రకృతి రూపసత్యపదార్థపరంగా ఉపనిషత్తు పల్కింది. ఇంద్రజిత్తుచే ప్రయోగింపబడిన మాయలలో మంత్రవిశేషాలతో సృష్టింప బడిన పారమార్థిక సర్పాలకే **"మాయా"** అనే వ్యవహారం కన్పిస్తున్నది. ఆ మాయ అసత్యమే అయితే, గరుడునిచే నశింపబడినట్లుగా పల్కిన మాట పొసగదు. నీతిశాస్త్రాలలో ఇంద్రజాలభిన్నంగా మాయ చెప్పబడింది. మంత్రాది శక్తివిశేషాలతో సృష్టింపబడిన పారమార్థికసర్పం మాయ అని, మంత్రవిశేషాలచే సృష్టింపబడిన అపారమార్థిక సర్పాలు ఇంద్రజాలమనే భేదం గ్రహించాలి. ఈ విధంగా **"మాయ"** అనేది సత్యమే. ఆశ్చర్యత్వమే మాయాశబ్ద ప్రవృత్తి నిమిత్తంగా గ్రహించాలి. ఇదే సర్వప్రయోగానుమతం.

రెండవది అయిన తదభావాదికరణంలో, సుషుప్తి స్థానం భగవంతుడు- అని నిరూపించారు. నిద్రించే సంసారిజీవునకు, నాడులు మాళిగల స్థానంలోను **"పురీతత్"**, అనే నాడి మంచం (శయ్యా) స్థానంలోను, పరమాత్మ పడుక

(పరుపు) స్థానంలోను అవుతున్నవి - అని వేదవ్యాసులన్నారు. ఇదే ప్రాసాద-ఖట్వా - పర్యంకన్యాయం. ఈ మూడు కలిపియే **"సుషుప్తిస్థాన"** మవుతుంది. **"తూమణిమాడత్తు.. కోట్టుక్కాల్ కట్టిల్ మేల్ మెత్తెన్న పఞ్ఞశయనమ్"** అనే తిరుప్పావైసూక్తి రీతిలో ఇక్కడ కూడా గ్రహించాలి.

మూడవ అధికరణంలో, ఆత్మనిత్యత్వం చెప్పబడింది. ఇక్కడ ఒక సందేహం కల్గుతుంది. అది ఏమంటే - జీవనిత్యత్వం **"నాత్మా శ్రుతేః నిత్యత్వాచ్చ తాభ్యః"** అని ముందుగానే చెప్పబడింది. మోక్షకాలంలో జీవుడు పాషాణతుల్యుడవుతున్నాడు- అనే పక్షాన్ని **"బ్రాహ్మేణ జైమినిః"** అని వ్యాసులు నిరసించబోతున్నారు. ఆత్మనిత్యత్వం అనేది, కాలాంతర-లోకాంతరాలలో దేహాంతర పరిగ్రహపూర్వకంగా అనుభవింపబడే స్వర్గాన్ని, తత్ సాధనమైన జ్యోతిష్టోమాదులను విచారించే పూర్వమీమాంసలో కూడా చెప్పబడింది. ఉత్తరమీమాంసలోను **"అనుస్మృతేః" (2-2-24)** (పూర్వం అనుభవింపబడిన వస్తువు తిరిగి స్మరింపబడుతున్నందున పదార్థాలు క్షణికాలు కావు) అని క్షణిక విజ్ఞాన వాదభంగ ప్రకరణంలో కూడా ఆత్మనిత్యత్వం చెప్పబడింది. కల్పాంతంలో **"ఏకమేవ"** అని అధ్యయనం చేయబడే (వేదంలో చెప్పబడే) ఐక్యం స్వరూపైక్యం కాదు. నామరూపప్రహాణమే - అనేది సిద్ధాంతం. అందువల్ల ఆత్మ నిత్యత్వం అనేక సందర్భాలలో సాధింపబడినపుడు, మళ్ళీ ఇక్కడ ఆత్మనిత్యత్వ కథనం వ్యర్థం కదా! - అనేది ఆ సందేహం.

దీనికి సమాధానం ఏమంటే - ప్రళయసమానమైన ఈ సుషుప్తి పరమ హేయం - అని దీనికి గల దోషాన్ని చూపడంకోసమే ఈ ప్రసంగం చేయబడింది. వేఱు ప్రయోజనంకోసం కాదు, ప్రతిదినం ప్రళయంతో సమానంగా ధర్మభూత జ్ఞానం యొక్క అతిసంకోచరూపమైన సుషుప్తి దశ ఏర్పడుతున్నది కదా. పూర్వమే చెప్పబడిన స్వప్నదశలోను, పైన చెప్పబోయే మూర్ఛాదశలోను వలె, ఈ సుషుప్తి దశలోకూడా పలు దోషాలున్నాయి. ఇది పరమహేయం, త్యాజ్యం- అనే భావాన్ని (బుద్ధిని) కల్గించడంకోసం ఈ ప్రసంగం - అనేది సమాధానం. సర్వప్రవృత్తి శూన్యత్వం, ధర్మభూతజ్ఞానం యొక్క అత్యంతసంకోచం సుషుప్తిలో ఏర్పడుతుంది. మోక్షదశలో భగవత్కైంకర్యరూప ప్రవృత్తి, ధర్మభూతజ్ఞానం

యొక్క అత్యంతవికాసం కల్గుతుంది. ఇది సుషుప్తి - మోక్షాలమధ్య ఉండే భేదమని ఈ అధికరణ భాష్యంలో భగవద్రామా నుజులు తెలిపారు.

నాల్గవ అధికరణం సంసారియొక్క మూర్ఛావస్థావిచారపరం. పూర్వ పాదంలో- జీవుని జాగ్రదవస్థ, మరణావస్థ విచారింపబడ్డాయి. ఈ పాదంలో, స్వప్నావస్థ - సుషుప్త్యవస్థలు విచారింపబడ్డాయి. "మూర్ఛ అనేది -సుషుప్తి మొదలైన దశలలో ఒకటి; వేఱు కాదు" అనే పూర్వపక్షాన్ని "అది సుషుప్తి కంటే వేఱయినది"- అనే సిద్ధాంతాన్ని ఈ నాల్గవ అధికరణం తెల్పుతున్నది. ఈ అధికరణం భగవత్ కల్యాణ గుణాతిశయ స్థాపకం కాదు. అయినా, జీవుని జాగ్రదాద్యవస్థావిశేషాలను శోధించిన తరువాత, సుషుప్తి తుల్యమైన మూర్ఛావస్థకు సంబంధించిన విచారం ఇక్కడ అవసరప్రాప్తమైనది. అంతే- అని గ్రహించాలి. మూర్ఛ అనేది సుషుప్తిలో చేరదు. మరణంలోను చేరదు. నిమిత్తవైరూప్యాన్ని, ఆకారవైరూప్యాన్ని దీనికి కారణంగా శ్రీరామానుజులు తెలిపారు. నిమిత్తవైరూప్యంవల్ల, ఆకారవైరూప్యంవల్ల మూర్ఛాదశ సుషుప్తికంటే విలక్షణమని, మరణంకంటే విలక్షణమని తెలుస్తున్నదని దీనివల్ల చెప్పబడినట్లయినది. సుషుప్తికి నిమిత్తం- ఇంద్రియశ్రమం. మూర్ఛకు నిమిత్తం- రోకలి మొదలైనవాటిచే కొట్టబడడం. సుషుప్తిలో వేడిమి, ఊపిరి పీల్చడం, విడువడం స్పష్టంగా తెలుస్తుంది. ముఖం తేటగా కూడా ఉంటుంది. కళ్ళు మూసికొని ఉంటాయి. మూర్ఛదశలో వేడిమి పరీక్షించి చూడవలసిన దశలో ఉంటుంది. ఉచ్ఛ్వాస నిఃశ్వాసాలుకూడా అస్పష్టాలుగా ఉంటాయి. తెఱచుకొన్న కళ్ళతో చూడడానికి భయంకరంగా ఉంటుంది. ఇది ఆకారవైషమ్యం. అందువల్ల సుషుప్తి మూర్ఛ కాబోదు. అభిఘాతంవల్ల మూర్ఛ, శిరచ్ఛేదంవల్ల మరణం కల్గుతాయి- అనేది నిమిత్తభేదం. మరణదశలో ఉచ్ఛ్వాస నిఃశ్వాసాలే లేకపోవడం ఆకారవైషమ్యం. ఇంతేకాక, మూర్ఛలో ఉన్నవాడు ప్రబలకారణవిశేషంవల్ల లేవవచ్చును. మరణం పొందినవాడు ఆ రీతిలో తిరిగి లేవలేడు. అందువల్ల మరణభిన్నమే మూర్ఛ. మరణకల్పం (మరణంతో సమానం) అని చెప్పదగినదని భావం. ఈ విధంగా నాల్గు అధికరణాలతో జీవదోషా లను పల్కి, తద్ద్వారా

పరమాత్మ గుణాలను కూడా శ్రీవేదవ్యాసులు వివరించారు. ఇకపై పరమాత్మ కల్యాణగుణాలను నేరుగా తెల్పుతున్నారు.

ఈ పాదంలో పూర్వపేటిక అయిన మొదటి నాల్గు అధికరణాలతో జీవదోషా లను నిరూపించిన వ్యాసమహర్షి, ఉత్తరపేటిక అయిన పై నాల్గు అధికరణాలతో పరమాత్మయొక్క నిర్దోషత్వాన్ని, కల్యాణగుణాకరత్వాన్ని నిరూపిస్తున్నారు. ఉభయలింగాలంటే - అఖిలహేయప్రత్యనీకత్వం, కల్యాణ గుణాకరత్వమే కదా! **"అమలన్, ఆది"** అని కదా, ఈరెండిటిని పాణ్పెరుమాళ్ అనుగ్రహించారు. ఉత్తర పేటిక కూడా రెండు భాగాలను కల్గినది. దోషాన్ని కల వస్తువుయొక్క సంసర్గంచేత శంకింపబడే దోషాలను, శ్రుతిలో అధ్యయనం చేయబడే పరుని స్వభావాలను పల్కి, నిరసిస్తున్నారు. వ్యాసులు, మొదటి అధికరణంలో. శ్రుతిలో చెప్పబడే జగద్బ్రహ్మైక్య మూలంగా తెలుపబడే దోషాలను, పరబ్రహ్మ స్వభావాలను తెలుపడం ద్వారా రెండవ అధికరణంలో వ్యాసులు నిరసించారు. నిర్దోషత్వశ్రుతివలె కల్యాణ గుణాకరత్వ శ్రుతికూడా దోషశంకను నిరసిస్తుంది. కల్యాణగుణాలు కూడా దోషవిరోధులే- అని భావం. ఇది మొదటి పేటిక.

''ఈ విధంగా రెండు అధికరణాలతో ఉభయలింగ విశిష్టంగా నిరూపింపబడిన బ్రహ్మం ఉపాస్యం కాదు, అది పరత్వాన్ని కల్గినది కాదు కనుక, ఔదార్యం లేనందువల్ల'' అనే సందేహం ఏర్పడగా, పరాధికరణంద్వారా పరమాత్మ యొక్క పరత్వపూర్తిని, ఫలాధికరణం ద్వారా నిరతిశయౌదార్యాన్ని ఉపపాదించి, పూర్వోక్త శంకను నిరసించి, **"పరబ్రహ్మం ఉపాస్యమే"** అని పై రెండు అధికరణాలతో నిరూపించారు. ఇది రెండవ పేటిక. ఈ విధంగా ఈ అధికరణచతుష్టయం రెండుభాగా లతో కూడుకొన్నది.

"స్థానిత్వాదచిదైక్యాచ్చ అపరత్వాత్ అఫలత్వాచ్చ,
అనుపాస్య మితి తు శంకాం శకలయతి స్మోత్తరైః చతుర్భి రిహ"

(హేయమైన స్థానంలో ఉన్నందున, అచిత్తుతో ఐక్యం చెప్పబడినందున, అధమమైనది అయినందున మంచి ఫలాన్ని ఇవ్వగల్గినది కానందున,

పరబ్రహ్మం ఉపాసించదగినది కాదు - అనే సందేహాన్ని ఇక్కడ తర్వాత గల నాల్గు అధికరణాలతో వ్యాసులు నిరసించారు) అనే శ్లోకం ఇక్కడ అనుసంధేయం.

ఇతరమతస్థులు జీవేశ్వరభావాలను నిరసించాలని చూచారు. ఏవిధంగా? అంటే - సంసారభయతప్తత్వం, జ్ఞాతృత్వం, శేషత్వం, పరార్థత్వం, భగవత్ ప్రసాద పాత్రత్వం - ఇత్యాదులు జీవస్వభావాలు. జగదేకకారణత్వం, సర్వజ్ఞత్వం, సర్వశక్తిత్వం, అనంతకల్యాణగుణవత్త్వం, అప్రాకృత విగ్రహవత్త్వం - ఇత్యాదులు పరమాత్మ స్వభావాలు. వీటిని అన్నిటిని నిరసనం చేయాలని ఇతరమతస్థులు చూచారు. వీరి పక్షాన్ని నిరసించాలని, **"న స్థానతోఽపి"** అని శ్రీవేదవ్యాసులు అధికరణారంభాన్ని చేస్తున్నారని మన పెద్దలంటారు. **"తస్మాత్ బ్రహ్మం ద్విలింగం ద్వివిధవిభవ మిత్యేవ వేదాంతపక్షః"** (అందువల్ల బ్రహ్మం, ఉభయ లింగం, ఉభయవిభూతలను కల్గినది - అనేదే వేదాంతసిద్ధాంతం) అని కదా వేదాంతగురు సింహగర్జనం. ఉభయలింగత్వం **"న స్థానతోఽపి"** అనే సూత్రంతోను, ఉభయ విభూతిత్వం **"ప్రకృతైతావత్త్వమ్"** అనే సూత్రంతోను నిరూపింపబడింది - అని గ్రహించాలి. ఇదే వేదాంతపక్షమని అన్నందున మృషావాదిమతం బౌద్ధమతతుల్యమని తెలిపినట్లయినది.

ఉభయలింగత్వం జీవునకుకూడా వేదంలో చెప్పబడింది. అయినా, జీవునకు స్వరూపతిరోధానం శ్రుతిసిద్ధం కనుక, జీవవిషయక ఉభయలింగత్వ శ్రుతికి సంకోచమే అంగీకరింపబడుతున్నది. పరమాత్మకు తిరోధాన శ్రుతిలేనందున, పరవిషయకమైన ఉభయలింగశ్రుతికి సంకోచం ఏర్పడలేదు. **"యః పృథివ్యాం తిష్ఠన్"**, **"యః ఆత్మని తిష్ఠన్"** అని ప్రారంభమయే శ్రుతిలో ప్రతిపర్యాయం **"స త ఆత్మా అంతర్యామ్య మృతః"** అని అమృతత్వం అధ్యయనం చేయబడినందున, ఈ **"అమృత"**శబ్దం నిత్యత్వపరం కాదు. ఒకవేళ, నిత్యత్వపరమే అయితే, దానిని ఒక్కసారి ప్రయోగిస్తే చాలు. అందువల్ల, తత్తద్వస్తుగతదోషవిశేషసంబంధం లేకపోవడాన్ని ఇది సూచిస్తుంది. అందువల్ల, పరబ్రహ్మం సర్వదా ఉభయలింగవిశిష్టం - అనేదే సర్వశ్రుతిస్మృతి సిద్ధం - అని చెప్పినట్లయినది. ఈవిధంగా **"న స్థానతః"** ఇత్యాదిగా పరబ్రహ్మం

ఉభయలింగ మని నిరూపించిన వ్యాసులు, **"ప్రకృతైతావత్త్వమ్"** ఇత్యాదిగా పరబ్రహ్మం ఉభయ విభూతులను కల్గినది - అని నిరూపిస్తున్నారు. **"అథాత ఆదేశో నేతి నేతి"** (బృహదారణ్య-4-3-6) అనే వాక్యం విభూతి నిషేధపరం కాదు. ఆ వేదవాక్యంలో **"నేతి నేతి"** అని నిషేధం తెలుపబడింది. బ్రహ్మకు, తద్రూపాలకు నిషేధమనేది మొదటి పూర్వపక్షం. పరబ్రహ్మకే నిషేధం, తద్రూపాలకు నిషేధం లేదు - అని పూర్వపక్షాంతరం. రూపమాత్రనిషేధమే వాక్యార్థం, బ్రహ్మనిషేధం కాదు - అనేది సిద్ధాంతం - అని ఇతరమతాలవారి వాదం. ఈ వాక్యం రూపనిషేధపరమనేది పూర్వపక్షం. రూపనిషేధపరం కాదు. రూప ఇయత్తానిషేధపరం - అనేది సిద్ధాంతం -అని మన పెద్దలంటారు. పరమాత్మకు విశేషణంగా ప్రమాణాంతరాలద్వారా తెలియ లేని పదార్థాలను పరబ్రహ్మ విశేషణాలుగా శ్రుతియే పల్కి, ఆ శ్రుతియే మళ్ళీ పరమాత్మకు విశేషణనిషేధాన్ని చేస్తున్నదంటే, అది పిచ్చివాని ప్రలాపమే కాగలదు. కొన్ని వస్తువులు ప్రమాణాంతరసిద్ధాలు. అయినా, అవి బ్రహ్మప్రకారాలు - అనే విషయం వేదాంతైక వేద్యం. కొన్ని వస్తువులు ప్రమాణాంతరాసిద్ధాలు. వాటి స్వరూపం, వాటి బ్రహ్మప్రకారత్వం వేదాంతవేద్యం. అందువల్ల వేదాంతం తానే స్వయంగా విభూతులను పరబ్రహ్మవిశేషణాలుగా పల్కి, మళ్ళీ వాటిని తానే నిషేధించదు కదా! అందువల్ల **"నేతి నేతి"** అనే శ్రుతిలోని తాత్పర్యం ఇయత్తానిషేధమని భావం. **"నిర్దిష్టవ్యత్వశంకాం ప్రశమయతి పరం నేతి నేతీతి చోక్తిః" ("నేతి నేతి"** అనే వాక్యం ముందు తెలుపబడిన పరిమితిలో మాత్రమే బ్రహ్మ ఉన్నదా? అనే శంకను తీరుస్తున్నది) అని కదా? వేదాంతదేశికులు పలికారు. అందువల్ల ప్రపంచనిషేధంగా తాము పలికే **"నేతి నేతి"** అనే వాక్యాన్ని ఇతరమతస్థులు అభిమానించారు. అయినా, అది వారికి స్వప్నలబ్ధసువర్ణమే (దుర్లభమే) అయినది. దీనివల్ల, బ్రహ్మం ఉభయవిభూతి యుక్తమని ఏర్పడింది.

ఇక, ఇపుడు పరాధికరణంయొక్క ప్రమేయాన్ని అనుభవిద్దాం. అవైదిక విప్రతిపత్తి మూడు విధాలుగా కన్పడుతున్నది. (1) ప్రకృతితత్త్వం లోకానికి ఉపాదాన కారణం. రుద్రుడు నిమిత్తకారణం- అనేది మొదటి విప్రతిపత్తి. నారాయణుడు జగత్కారణభూతుడని శ్రుతులచే తెలుపబడిందని గ్రహిస్తే

ఈ విప్రతిపత్తి తొలగిపోతుంది. (2) నారాయణుడు ఉపాదానకారణభూతుడు; రుద్రుడు నిమిత్తకారణభూతుడు- అనేది రెండవ విప్రతిపత్తి. నిమిత్త-ఉపాదానకారణాలకు ఐక్యమే; భేదం లేదు- అని శ్రుతులచే నిశ్చయింపబడిన విషయాన్ని తెలియగానే ఈ శంక కూడా నిరస్తమవుతుంది. (3) నిమిత్తోపాదాన కారణంగా, ముక్తిని ఇచ్చేదిగా ఉండే పరబ్రహ్మం నారాయణుడే అయినా, ముక్తులకు ప్రాప్యభూతుడు వేఱొకడు - అని మూడవ విప్రతిపత్తి. ఈ విప్రతిపత్తిని నిరసించి, పరమకారణమైన పరబ్రహ్మమే పరమప్రాప్యం - అని పరాధికరణంలో వేదవ్యాసులు నిరూపించారు. ఈ అధికరణం లోని మొదటి సూత్రం పూర్వపక్షమైన శంకను ప్రతిపాదిస్తున్నది. మిగిలిన సూత్రాలు సిద్ధాంతపరాలు. నాల్గు హేతువులను చూపి, పూర్వపక్షి- బ్రహ్మభిన్నం ప్రాప్యం, పరంతత్త్వం - అనే తన పక్షాన్ని తెల్పుతున్నట్లుగా మొదటి సూత్రం ఉన్నది. పూర్వపక్షి పల్కిన హేత్వాభాసలు నాల్గింటిని తరువాత నాల్గు సూత్రాలతో వ్యాసులు నిరసించి, బ్రహ్మమే ప్రాప్యం, పరంతత్త్వం - అనే వేదాంత సిద్ధాంతాన్ని స్థాపించారు. **"స్థాన విశేషాత్" (3-2-33)** (ఈ పరబ్రహ్మం చేత అన్నిలోకాలు వ్యాపింపబడ్డాయి. సర్వవ్యాప్తి, అన్నీ దానై ఉండడం మొదలైన వానిని పరబ్రహ్మకు తెలిపే వేదవాక్యాల ద్వారా ఇది తెలుస్తున్నది) ఇత్యాది సూత్రం పూర్వసూత్రానికి శేషం. పూర్వసూత్రాలతో అధిక వస్తువాదంలో దూషణాన్ని పల్కిన వ్యాసమహర్షి **"అనేన సర్వగత్త్వమ్"** అనే చివరి సూత్రంతో తన పక్షంలో ప్రమాణప్రదర్శనాన్ని చేశారు. ఈ రీతిలో ఏడు సూత్రాలలో, మొదటి సూత్రంతో పూర్వపక్షాన్ని అనువదించి, తర్వాత నాల్గు సూత్రాలతో ఆ పూర్వపక్షాన్ని దూషించి, చివరి సూత్రంతో తన పక్షాన్ని స్థాపించే ప్రమాణాన్ని వ్యాసులు ఉపన్యసించారు. మధ్యలో గల **"స్థానవిశేషాత్"** అనే సూత్రం పూర్వసూత్రశేషమని గ్రహించాలి. పూర్వపక్షి పల్కిన హేత్వాభాసలు నాల్గింటిలో మూడవది **"సంబంధ వ్యపదేశమ్"** అనేది. "బ్రహ్మం హేతువై - ప్రాపకమై, వేఱొకటి ఈ ప్రాపకం ద్వారా పొందబడే ప్రాప్యం"- అని దీనివల్ల తెలుస్తున్నది. **"అమృత స్యైష సేతుః"** అని కదా శ్రుతివాక్యం - అనే పూర్వపక్షాన్ని **"ఉపపత్తేశ్చ"**

అనే సూత్రం ద్వారా వ్యాసులు నిరసించారు. ఈ సూత్రం ఉపాయానికే ఉపేయత్వసాధనపరం.

"ప్రాప్యస్య పరమపురుషస్య స్వప్రాప్తౌ స్వస్యైవోపాయత్వోపపత్తేః నాయమాత్మా ప్రవచనేన లభ్యో న మేధయా న బహునా శ్రుతేన, యమేవైష వృణుతే తేన లభ్యః, తస్యైవాత్మా వివృణుతే తనూం స్వామ్" ఇత్యనన్యోపాయత్వ శ్రవణాత్" (ప్రాప్యుడైన పరమపురుషుడు తన ప్రాప్తికి తానే ఉపాయమై ఉండడం పొసగు తున్నందున, "ఈ పరమాత్మ కేవలశ్రవణ మనన ధ్యానాదులతో పొందడానికి సాధ్యమయినవాడు కాడు. ఎవనిని ఇతడు వరిస్తాడో, అతనికే ఇతడు తన స్వరూపాన్ని దర్శింపజేస్తున్నాడు'' అనే శ్రుతిలో ప్రాప్యమైన పరబ్రహ్మమే ఉపాయంగా అధ్యయనం చేయబడుతున్నది కదా) అని కదా శ్రీభాష్యదివ్యసూక్తి ఉన్నది. **"అనన్యోపాయత్వ శ్రవణాత్"** అంటే - ప్రాప్యానికే ఉపాయత్వం చెప్పబడినందున - అని అర్థం. **"వివృణుతే తనూం స్వామ్" ఇత్యనేన ప్రాపకత్వం, ప్రాప్యత్వం చ గమ్యతే"** (తన స్వరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు- అనే ఈ మాటచేత పరబ్రహ్మయొక్క ప్రాప్యత్వం, ప్రాపకత్వం తెలుపబడ్డాయి.) అని కదా ఇక్కడ శ్రుతప్రకాశికావాక్యం.

"భగవతః నిరంకుశస్వాంతత్ర్యప్రయుక్తపారతంత్ర్యలక్షణం, కృపాప్రయుక్త పారతంత్ర్యలక్షణం చేతి వరణద్వయమస్తి, తత్ర ప్రాథమికం వరణం క్వాచిత్కమేవ, న సార్వత్రికమ్. కృపాప్రయుక్తపారతంత్ర్య లక్షణవరణం తు ప్రాయశో నిష్కృష్ట సత్త్వనిష్ఠ సర్వముముక్షు సాధారణమ్. తాదృశం వరణద్వయమపి అస్యాం శ్రుతౌ యోజనాభేదేన ఆచార్యైః ప్రతిపాదితమ్. శ్రీభాష్యే పరాధికరణే నిరంకుశ స్వాతంత్ర్య ప్రయుక్త పారతంత్ర్యపరత్వేన "ఉపపత్తేశ్చ" ఇతి సూత్రే సేయం శ్రుతిరుదాహృతా. కృపాప్రయుక్తపారతంత్ర్య పరతయా యోజన మభిప్రేత్య అపవర్గోపాయవేదన విశేషనిర్ధారకతయా ఇయం శ్రుతి లఘుసిద్ధాంతే ఉదాహహృతా. యోజనాద్వయ స్యాపి ఫలభేదోఽస్తి. కృపాప్రయుక్తపారతంత్ర్యాపేక్షయా స్వాతంత్ర్యప్రయుక్త పారతంత్ర్యం ప్రబలమ్; తస్య వేదపురుషాభిప్రాయ విషయత్వాత్. తాదృఫలవిశేషే భగవద్వ్యతిరిక్తస్య కస్యాపి ఉపాయత్వం నాస్త్యేవ".

భగవానుడు చేతనుని వరించడమనేది (1) తన నిరంకుశ స్వాతంత్ర్యంతో ఏర్పడిన పారతంత్ర్యంతో చేయబడే వరణం - అని, (2) కృపవల్ల కలిగే పారతంత్ర్యంతో చేయబడే వరణం - అని వరణం రెండు విధాలు. ఈ రెండిటిలో మొదటి రీతిలోని వరణానికి ముముక్షువులందఱు విషయభూతులు కారు. ఎవరో కొందఱి విషయంలో మాత్రమే భగవానునిచే ఈ వరణం చేయబడుతున్నది. ఇక, రెండవ విధమైన వరణమైతే, పరమసత్త్వనిష్ఠులైన ముముక్షువులందఱి విషయంలో ఇంచుమించుగా ఈ వరణం కన్పిస్తున్నది. ఈ రెండు విధాలైన వరణాలు ఈ శ్రుతిలో రెండు విధాలైన యోజనలుగా పూర్వాచార్యులచే చూపబడింది. శ్రీభాష్యంలోని పరాధికరణంలోగల **"ఉపపత్తేశ్చ"** అనే సూత్రంతో నిరంకుశ స్వాతంత్ర్యంవల్ల కల్గిన పారతంత్ర్యంతో చేయబడే వరణాన్ని తెల్పుతున్నట్లుగా ఈ శ్రుతి ఉదాహరింపబడింది. (శ్రీభాష్యం జిజ్ఞాసాధికరణంలోని) లఘుసిద్ధాంత భాష్యంలో రెండవ విధమైన యోజనను గ్రహించి, మోక్షోపాయంగా వేదన, ధ్యాన, ఉపాసనాది శబ్దాలతో చెప్పబడే భక్తిని నిర్ధారణం చేసేదిగా ఈ శ్రుతి ఉదాహరింపబడింది. ఈ రెండు యోజనలకు రెండు విధాలైన ప్రయోజనాలున్నాయి కృపవల్ల కలిగే పారతంత్ర్యంకంటే, స్వాతంత్ర్యంవల్ల కలిగే పారతంత్ర్యం ప్రబలం. దానిని వేదపురుషుడు చాలా అభిలషించాడు కనుక, మొదటి యోజనలోని ప్రయోజనంలో భగవానుని కంటే వేఱయిన దేనిలోను ఉపాయత్వం ఏమాత్రం లేదు) అనే చరమశ్లోకటిప్పణి వాక్యాలు అనుసంధేయాలు. ఈ విధంగా, "పశువుకు పచ్చగడ్డిని చూపి దగ్గరకు పిలచి, ఆ పచ్చగడ్డినే పెట్టేవారివలె, ఫలసాధనాలకు మధ్య భేదం లేదు - అని తెలిపినట్లయినది. నిమిత్తోపాదాన కారణాల ఐక్యంవంటిదే ఫలసాధనాల ఐక్యంకూడా. చేతనాచేతనవిశిష్టం బ్రహ్మ ఉపాదానం. సంకల్పవిశిష్టం బ్రహ్మనిమిత్తం - అని నిమిత్తతావచ్ఛేదక - ఉపాదానతావచ్ఛేదకాలకు భేదం ఉన్నట్లే, ఇక్కడకూడా ప్రసాదవిశిష్ట బ్రహ్మం ఉపాయం, భోగ్యతావిశిష్టబ్రహ్మం ఉపేయం - అని ఉపేయతావచ్ఛేదక- ఉపాయతావచ్ఛేదకాలకు మధ్య భేదం ఉన్నది. దీనినే **"ఇరక్కమ్ ఉపాయమ్, ఇనిమై ఉపేయమ్"** అని పూర్వాచార్యులు సంగ్రహంగా పలికారు. ఈ రీతిలో భగవదుపాయత్వ- ఉపేయత్వాలు పరాధికరణ సిద్ధాంతితాలయ్యాయి.

ఇక, ఫలాధికరణ ప్రమేయాన్ని అనుభవిద్దాం. కర్మకాండలో చెప్పబడిన అన్ని కర్మలకు ఆరాధ్యమైన బ్రహ్మం, దేవతాకాండంలో చెప్పడిన సమస్తదేవత లకు ఆత్మభూతమైన బ్రహ్మమే, బ్రహ్మకాండలో ఇంతవరకు పది పాదాలతో కారణత్వ, ప్రాప్యత్వ, ప్రాపకత్వ విశిష్టంగా నిరూపింపబడింది. ఇక, ఈ పాదం లోని చివరి అధికరణమైన ఫలాధికరణంద్వారా ఆ బ్రహ్మమే ఐహికా-ముష్మిక భోగమోక్షరూప సకలఫలప్రదం - అని శ్రీవ్యాసులవారు నిరూపిస్తున్నారు. ఇందువల్ల పరమాత్మ పరమోదారుడు - అని నిరూపింపబడుతున్నది. ఇంతకు ముందు **"బ్రహ్మం హేయ గుణరహిత"**మని అన్నారు. ఇక్కడ **"బ్రహ్మం హేయనివర్తక"**మని అంటున్నారు. ముందు అధికరణంలో ఫలత్వం చెప్పబడింది. ఇక్కడ ఫలప్రదత్వం చెప్పబడు తున్నది. తత్త్వజ్ఞానం మిథ్యా నివర్తకమైనందున, మోక్షం బ్రహ్మాధీనం కాదు - అనే మాయావాదిమతాన్ని, పరమాత్మానుగ్రహాన్ని పురస్కరించుకోకుండా, కేవలతత్త్వ జ్ఞానంతో మోక్షం - అనే తార్కికమతాన్ని ఈ అధికరణంలో వ్యాసులు నిరసిస్తున్నారు. వస్తుతః, జైమిని మహర్షి వ్యాసపక్షావలంబియైన తచ్ఛిష్యులు కనుక, జైమినిమత ఖండనం ప్రకృతవిషయం కాదు. లేక, ఇది జైమిని మహర్షి మతానుయాయిఖండనం కావచ్చు. ఈ న్యాయం, పైన రాబోయే పురుషార్థాధికరణంలో కూడా (3-4-1) పొసగుతుంది. "పూర్వ మీమాంసలోని అపూర్వాధికరణంలో అపూర్వం ద్వారమని చెప్పబడింది. అది దేవతాను గ్రహం అనేది ఇక్కడ నిశ్చయింపబడుతున్నది - అని కూడా చెప్పవచ్చు. కర్మమే కాలాంతరభావిఫలాన్ని ఇస్తుంది - అనేది ఒక పక్షం. అది అయుక్తం; కర్మం ప్రత్యక్షంగా నశించడం కన్పిస్తున్నందున అది కాలాంతరభావి ఫలప్రదం కాలేదు; కర్మాతిరిక్తమై, అపూర్వమనేదొకటి ఫలప్రదం - అని ఇంకొక పక్షం. శ్రుతహాన- అశ్రుతకల్పనా ప్రసంగం (వేదంలో చెప్పబడిన దానిని విడువడం, చెప్పనిదానిని చేయడం) అనేది ఏర్పడుతుంది కనుక, అది కూడా అయుక్తం. **"స ఏనం ప్రీతః ప్రీణాతి"** (ప్రీతిని పొందిన దేవతయే ఇతనిని ఆనందింపజేస్తున్నది) అని దేవతకేకదా ఫలప్రదత్వం వేదంలో అధ్యయనం చేయబడుతున్నది. కర్మరూపమైన ఆరాధనతో ప్రీతమైన దేవతావిశేషమే ఫలప్రదం - అనేది మఱొక పక్షం. "ఇదే యుక్తమైనది" అని ఈ అధికరణంలో వ్యాసభగవానులు తెల్పుతున్నారు. **"అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభురేవ చ"** (అన్ని యజ్ఞాలచే ఆరాధింపబడే వాడను, వాటికి ఫలాన్ని ఇచ్చేవాడను నేనే కదా) అని కదా **"మాయిన్ అన్టోదియ వాక్కు"** (ఆశ్చర్య భూతుడైన స్వమి ఆనాడు పల్కిన సూక్తి.) ఔదార్యం లేనివానికి ప్రభుత్వం - ఆకాశపద్మం వలె, కూర్మకేశాలవలె, మానవునకు కొమ్ములవలె - అసత్తు. అందువల్ల ప్రభుత్వం అంటే - ఫలప్రదత్వరూపమైన ఔదార్యమే. **భోక్తా** - ఆరాధ్యుడు. **ప్రభుః** - ఫలప్రదుడని అర్థం. ఇంద్రాదుల ఆరాధనలో ఏవిధంగా శ్రీమన్నారాయణుడు ఫలప్రదుడో, ఆవిధంగా శ్రీమన్నారాయణుని ఆరాధనలో వేఱొకడు ఫలప్రదుడు లేడు - అని గీతాశ్లోకంలోని ఏవకారార్థాన్ని గమనించాలి.

శ్రీపరాశరభట్టర్ శ్రీరంగరాజస్తవ ఉత్తరశతకంలో **"క్రియా తచ్ఛక్తిర్వా కిమపి తదపూర్వం పితృసురప్రసాదో వా కర్తుః ఫలద ఇతి రంగేశ! కుదృశః, త్వదర్చేష్టాపూర్తేః ఫలమపి భవత్ప్రీతిజ మితి, త్రయీ వృద్ధాః తత్తద్విధి రపి భవత్ప్రేరణ మితి"** (శ్రీరంగనాథా! యాగం, దానం, తపస్సు మొదలైన కర్మలు గాని, ఆ కర్మల శక్తి గాని, లేక, వానివల్ల ఏర్పడే ఏదో ఒక అపూర్వం కాని, లేక, పితృదేవతల, దేవతల కృప కాని, ఆయా కర్మలను అనుష్ఠించేవానికి ఫలాన్ని ఇస్తున్నవి - అని జ్ఞానం లేనివారు పల్కుతున్నారు. వేదంలో పరిపూర్ణానుభవాన్ని కల పెద్దలు అయితే, యాగాలు మొదలైన ఇష్టాలు, చెఱువులను తవ్వడం మొదలైన పూర్తాలు, నీకు చేసే తిరువారాధన, వీటివల్ల కలిగే ఫలం - ఇవన్నీ దేవరవారి ప్రీతివల్ల కలిగేవి - అని, ఆయా కర్మలను చేయమని పలికే శాస్త్రవిధులు దేవరవారి ఆజ్ఞ - అని పల్కుతున్నారు) అని పల్కిన సూక్తి అనుసంధేయం. **"వ్యక్త మేష మహాయోగీ పరమాత్మా"** (రామా-యుద్ధ-114-5) (మహాయోగియైన ఈ శ్రీరాముడు పరమాత్మ - అనే విషయం స్పష్టం) అని, సకలఫలప్రదత్వాన్ని బట్టి శ్రీరాముడు పరమాత్మ - అని రావణుని ధర్మపత్ని మండోదరి కూడా నిశ్చయించింది. **"వీడు ముదల్ ముఴుదుమాయ్"** (2-2-1) **"వీడు ముదలామ్"** (2-8-1) అని పారాశర్యులవలె పరాంకుశులు కూడా పలికారు.

ఈ రీతిలో, వేదవ్యాసమహర్షి బ్రహ్మకాండలో ఇంతవరకు (పతిపాదాలలో) పరబ్రహ్మం - చేతనాచేతన విలక్షణం, నిఖిలజగదేకకారణం, ప్రాప్యం,

ప్రాపకం, అఖిలప్రదప్రదం - అని నిశ్చయించారు. అందువల్ల, సిద్ధోపాయో పేయాత్మకమైన పరత్వం నిరూపింపబడింది. ఈ విధంగా నమశ్శబ్దార్థం నిరూపితం,

సాధ్యనిరూపణం :

ఇకపై గల ఆఱు పాదాలలో వ్యాసులు సాధ్యమైన పరమాత్మోపాసనాన్ని, సాధ్యమైన పరిపూర్ణ బ్రహ్మానుభవాన్ని వివరిస్తున్నారు.

గుణోపసంహారపాదం :

మూడవ అధ్యాయంలోని మూడవ పాదం గుణోపసంహారాపాద మనబడు తుంది. వేదంలోని అనేకశాఖలలో వైశ్వానరవిద్య అధ్యయనం చేయబడుతున్నది. వీటికి భేదమా? అభేదమా? అనే విచారం ఈ పాదంలో చేయబడుతున్నది. అనేకశాఖలలో ఉండే విద్యలకు అభేదం అయితే, గుణోపసంహారం అని, భేదమయితే, వికల్పం అని నిర్ణయింపబడుతుంది. శాఖాంతరగతాలను ఉపయోగంకోసం స్వీకరించడం ఉపసంహార మనబడుతుంది. అక్కడక్కడ చెప్పినదానికి అక్కడక్కడే ఉపయోగం వికల్పమనబడుతుంది. విద్యాభేదాభేదాలలో అభేదమే పాదార్థం. భేదం అపవాదంగా (విధికి అడ్డుగా) నిరూపింపబడుతుంది - అని గ్రహించాలి. అందువల్ల గుణోపసంహారపాదం - అని ఈ పాదం వ్యవహరింపబడుతున్నది. అనేక శాఖలలో ఉండే వైశ్వానర విద్యలకు అభేదం, తైత్తిరీయఛాందోగ్యగతాలైన పురుషవిద్యలకు భేదం నిరూపింపబడుతున్నది. వేద్యం భిన్నమైతే, విద్య భిన్నమవుతుంది. వేద్యం అభిన్నమైతే విద్య అభిన్నమవుతుంది. ఈ రీతిలో వేద్యానురూపంగా విద్యానియమం - అని తేలింది. వేద్యభేదంకూడా గుణభేదంవల్ల తప్ప, బ్రహ్మభేదంవల్ల కాదు. అందువల్ల గుణోపసంహార పాదమని ఈ పాదం పిలువబడుతున్నది.

ఈ పాదం, బ్రహ్మజ్ఞానపక్షంలో చాలా అసంగతం. ఏ విధంగా? అంటే, శాస్త్రానికి నిర్విశేషవస్తువును తెలుపడంలో తాత్పర్యం - అని పలికేవారికి గుణోప సంహారపాదం అసంగతం మాత్రమే కాదు; విరుద్ధంకూడా. గుణాలు

అతాత్త్వికాలు. అతాత్త్విక గుణప్రతిపాదకమైన ఈ పాదం సంగతమే కదా!- అని అంటే, అందువల్లనే అసంగతం. తత్త్వప్రతిపాదకమైన శాస్త్రానికి అతాత్త్విక గుణప్రతిపాదనపరత్వం చెప్పడం అయుక్తమే కాగలదు. కర్మముక్తి ఉపాయమైనందున, సంగతమేనని అంటే, కర్మముక్తి అంటే ఏది? సగుణ బ్రహ్మప్రాప్తిపూర్వకంగా నిర్గుణబ్రహ్మప్రాప్తియే కర్మముక్తి - అని అనరాదు, ఈవిధంగా చెప్పే ప్రమాణమే లేదు. గుణవిశిష్ట బ్రహ్మోపాసనమైన దహరవిద్యవల్ల పరంజ్యోతిప్రాప్తి, పరంజ్యోతిస్సు అయిన పరబ్రహ్మను పొందినవానికి నిరంకుశైశ్వర్య ప్రాప్తికదా శ్రుతి తెల్పింది. పరంజ్యోతి ప్రాప్తికి మించిన ఇంకొక మోక్షం లేదు. అందువల్ల కర్మముక్తి నిరూపణం అయుక్తం. సగుణోపాసనవల్ల నిర్గుణవిద్యాప్రాప్తి, నిర్గుణవిద్యాప్రాప్తివల్ల మోక్షప్రాప్తి, ఇదే కర్మముక్తి- అని అనరాదు. **"ఆనందాద్యుః ప్రధానస్య"** (ముఖ్యంగా ఉపాసింపబడే గుణి అయిన పరబ్రహ్మ స్వరూపానికి అన్నివిద్యలలోను తేడా లేనందున, ఆనందాది స్వరూపనిరూపక గుణాలు అన్నీ అనుసంధించదగినవే) (బ్రహ్మసూత్రం-3-3-11) అని పరవిద్యాసామాన్యానికి సగుణవిషయకత్వాన్ని శ్రీవేదవ్యాసులు నిశ్చయించి పలికారు కనుక, నిర్గుణవిద్య - అనేది లేనే లేదు. **"వేదాహ మేతం పురుషం మహాంతమ్... తమేవం విద్వానమృత ఇహ భవతి"** అని సగుణవిద్యను పరబ్రహ్మ ప్రాప్తికి అవ్యవహితోపాయంగా కదా శ్రుతి పల్కింది. ఇంతేకాక, సగుణనిర్గుణ విద్యలకు విరోధం కూడా ఉన్నందున, వీటిమధ్య జన్య- జనక భావాన్ని చెప్పడంకూడా అయుక్తం. అందువల్ల కర్మముక్తి నిరూపణం అసంగతం కనుక, ఈ పాదమే పరబ్రహ్మజ్ఞానపక్షంలో పూర్తిగా అసంగతం.

ఈ పాదంలో ఇరవై ఆఱు అధికరణాలున్నాయి. కొన్ని అధికరణాలు విద్యాభేదాభేద విచారపరాలు. కొన్ని అధికరణాలు పరవిద్యకు అనుబంధమైన అర్థాలను విచారిస్తున్నాయి. అంతేకాక, పలు అధికరణాలు దృష్ట్యుపాసనపరాలు. 19వ అధికరణమైన లింగభూయస్త్వాధికరణం సకలవిద్యోపాస్యం శ్రీమన్నారాయణుడనే దేవతావిశేషం - అని నిశ్చయించి పల్కుతున్నది. ఇది ఈ పాదంలోని సంగ్రహప్రమేయం. పరవిద్యాసామాన్యంలో పరవిద్యాస్వరూప

నిరూపక ధర్మాలు ఉపాస్యాలు - అని ఆనందాద్యధికరణంలో, ధర్మి అయిన పరబ్రహ్మ నారాయణతత్త్వం సకల పరవిద్యోపాస్యమని లింగభూయస్త్వాధి కరణంలో, సత్యత్వాది స్వరూప నిరూపకాలను తెల్పిన శ్రీవేదవ్యాసులు, శ్రియఃపతిత్వమైన ప్రధాననిరూపకాన్ని అనుగ్రహించక పోవడమేమి? అని అంటే, అది అతిరహస్యం అయినందున కావచ్చు; అతిప్రసిద్ధం అయినందున కావచ్చు. వస్తుతః పురుషసూక్త లక్ష్మీతంత్రాది వచనాల వల్లనే అవగతమైనందున ప్రమాణాంతరాపేక్ష లేదు కదా!

పరమాత్మ స్వరూపనిరూపకాలు ఏవి? అంటే, సత్యత్వ జ్ఞానత్వానంతత్వా నందత్వామలత్వ శ్రియఃపతిత్వాలు కదా! సత్యత్వమంటే - నిర్వికారత్వం, జ్ఞానత్వ మంటే - జ్ఞానస్వరూపత్వం, జ్ఞానగుణకత్వం, అనంతత్వమంటే - దేశకాలవస్తు పరిచ్ఛేదరాహిత్యం, ఘటపటాదులకు ఈ మూడు పరిచ్ఛేదాలున్నాయి. జీవాత్మ నిత్యమైనందున కాలపరిచ్ఛేదం లేదు. అయినా, దేశవస్తుపరిచ్ఛేదా లున్నాయి. కాలం విభువైనందున, నిత్యమైనందున దేశకాలపరిచ్ఛేదాలు దానికి లేవు. కాలపరిచ్ఛేదం లేదు. అయినా కాలానికి వస్తుపరిచ్ఛేదమున్నది. కాలం సర్వాంతర్యామి కాదుకదా! పరమాత్మత్వం విభువై నందున దేశపరిచ్ఛేదరహితం; నిత్యమైనందున కాలపరిచ్ఛేద రహితం; సర్వవస్తు సామానాధికరణ్యార్హమై, సర్వాంతర్యామి అయినందున వస్తుపరిచ్ఛేదరహితం. ఈ విధంగా, పరమాత్మత్వం అనంతమని తేలింది. **"యతో వా ఇమాని"** అనే వాక్యం కారణవాక్యమని, **"సత్యం జ్ఞానమ్"** ఇత్యాది వాక్యం శోధకవాక్యమని పెద్దల వ్యవహారం. **"కారణత్వ శంకితదోషపరిహారార్థం సత్యత్వాదులు"** అనేది శ్రీభాష్యసారం. లోకసిద్ధాలైన కారణవస్తువుల లోని దోషాలు జగత్కారణమైన, చేతనాచేతనవిలక్షణ మైన పరమాత్మకు లేవు. అచిత్తుకు ఉండే స్వరూపవికారం, సంసారిచేతనులకుండే స్వభావవికారం, ముక్తులకుండే కాదాచిత్క (కొంతకాలంపాటు ఉండే) జ్ఞానసంకోచం, నిత్యులకుండే అనీశ్వరత్వాదులు, పరవస్తువుకు లేవు - అని చెప్పినట్లయినది. **"జ్ఞానత్వం జ్ఞాతృభావాత్ స్వరబహులతయా స్వప్రకాశత్వతశ్చ"** అని జ్ఞానశబ్దం జ్ఞానస్వరూపత్వ - జ్ఞానగుణకత్వవిశిష్టపరమైనట్లే, ఆనందశబ్దం కూడా ఆనంద స్వరూపత్వ - ఆనందగుణకత్వ విశిష్టపరమని అర్థం.

హాన్యధికరణం నుండి ఉండే మూడు అధికరణాలు విద్యకు అంగమైన చింతన విశేషవిచారపరాలు. వీటిలో, మొదటిది అయిన హాన్యధికరణంలో హానచింతనం, ఉపాయనచింతనం చెప్పబడ్డాయి. హానమంటే- కర్మవిమోచనం. ఉపాయనమంటే- అన్యత్ర ప్రవేశం. (కర్మాదులు వేఱొకచోట సంబంధించి ఉండడం) హానోపాయనాది చింతనం అంగమైనా, జ్ఞానస్వరూపమైనందున విద్యాతుల్యంగా ఇక్కడ విచారింప బడుతున్నది. అందువల్లనే క్రియా స్వరూపాలైన అంగాలను విచారించే నాల్గవ పాదమైన అంగపాదంలో ఇది విచారింపబడలేదు. అమూర్తాలైన పుణ్యపాపా లకు హానం, ఉపాయనం తగునా? ఒకరి కర్మం ఇంకొకరి ఫలానికి హేతువు అవుతుందా? అంటే, అవుతుంది. బ్రహ్మవిద్యానిష్ఠుని పుణ్యపాపాలను నశింప జేయాలని భావించిన సర్వేశ్వరుడు, విద్యానిష్ఠుని పట్ల ఉండే ప్రీతిచేత విద్యానిష్ఠ నకు అనుకూలుడైన వానివద్ద ఉండే విద్యానిష్ఠవిషయక సౌహార్దానికి అనుగుణంగా విద్యానిష్ఠ ప్రతికూలునిపట్ల ఉండే విద్యానిష్ఠ విషయక అసౌహార్దానికి అనుగుణంగా, విద్వత్పుణ్యా పుణ్యఫల తుల్యఫలాన్ని ఇస్తాడు.

దేహం విడిచిన తరువాత కర్మక్షయమని సాంపరాయాధికరణంలో తెలుపబడుతున్నది. తదధిగమాధికరణంలో (4-1-13) దేహమున్న కాలంలో కర్మక్షయం చెప్పబడుతున్నది. ఈ రెండిటికి ఏవిధంగా పొసగుతుంది? అని అంటే, పొసగు తుంది. ఉపాసనారంభకాలంలో చెప్పబడే కర్మక్షయం - **"క్షమిష్యామి"** అనే భగవత్సంకల్పం - అని, దేహవియోగకాలంలో చెప్పబడే కర్మక్షయం - **"క్షాంతమ్"** అనే భగవత్సంకల్పం- అని కదా శ్రుతప్రకాశికా నిష్కర్షం. సాంపరాయాధికరణంలో దేహవియోగ కాలంలోనే నిశ్శేషకర్మక్షయం సిద్ధాంతితం. ఈ అధికరణంలో మొదటి రెండు సూత్రాలతో సిద్ధాంతం తెలుపబడింది. తరువాత ఒక సూత్రంతో పూర్వపక్షాను వాదాన్ని చేసి, తరువాత గల సూత్రంతో సిద్ధాంతాన్ని శ్రీవ్యాసులు తెలిపారు -అనేది శ్రీభాష్యసారం.

"గతోర్థవత్త్వమ్", **"ఉపపన్నః"** అనే రెండు సూత్రాలు సిద్ధాంతపరమని శంకరభాష్యసారం. కొన్ని విద్యలకు అర్చిరాది గతులున్నాయి. కొన్ని విద్యలకు అర్చిరాది గతులు లేవు - అని ఈ విధంగా రెండు విధాలుగా విభాగం

గ్రహించాలి. ఈ విధంగా గ్రహిస్తే, సగుణోపాసనకు అర్చిరాదిగతి, నిర్గుణబ్రహ్మ విద్యాఫలానికి దేశాంతరగమనం విరుద్ధం కనుక, నిర్గుణోపాసనానికి అర్చిరాది గతి లేదు - అని స్ఫుటపడుతుంది. ఇదే ఉపపన్నం. దీనికి దృష్టాంతాన్ని కూడా **"లోకవత్"** అని చూపించారు. అంటే - గ్రామాంతరప్రాప్తికి మార్గాపేక్ష ఉన్నా, ఆరోగ్యప్రాప్తికి మార్గాపేక్షలేదు కదా. ఆ రీతిలోనే, సగుణబ్రహ్మప్రాప్తికి అర్చిరాదిగతి ఆవశ్యకమైనా, నిర్గుణబ్రహ్మప్రాప్తికి అది ఆవశ్యకం కాదు - అని శంకరుల అభిప్రాయం.

ఇది అసంగతం. నిర్గుణబ్రహ్మవిద్య అప్రామాణికమనే విషయం ఇంతకు ముందే తెలుపబడింది. ఈ విధమైన నిర్వాహంలో సూత్రాక్షర స్వారస్యంకూడా లేదు. అందువల్ల శ్రీభాష్యంలో ప్రదర్శింపబడిన నిర్వాహమే యుక్తం. అంటే- పుణ్యపాపాలలో ఏకదేశం దేహం విడిచే కాలంలో హానిని పొందుతుంది. మిగిలిన భాగం తరువాత తీరుతుంది - అని ఈ రీతిలో విభాగాన్ని గ్రహించాలి; లేకపోతే, అర్చిరాదిగతిశ్రుతికి అర్థం లేదు; దేహవియోగకాలంలోనే సర్వకర్మ మోక్షమైతే, సూక్ష్మశరీరం తీరిపోతుంది. ఆ రీతిలో తీరిపోతే, శరీరరహితుడైన ఆత్మకు గమనం అనుపపన్నం - అనే పూర్వపక్షాన్ని **"గతోఽర్థవత్త్వమ్"** అనే సూత్రంతో శ్రీవ్యాసమహర్షి సిద్ధాంతాన్ని చేశారు. దీని అర్థమేమంటే- దేహంనుండి ఉత్క్రాంతిని పొందే సమయంలోనే సర్వకర్మక్షయమవుతుంది. ఇది ఉపపన్నమే. సర్వకర్మనాశం జరిగిన తరువాత, గమనానుగుణమైన సూక్ష్మశరీరసిద్ధి ఏవిధంగా సంభవం? అంటే, ఈ విధంగా జరుగుతుంది. ఈ విషయంలో దృష్టాంతమేమంటే - పైరు వృద్ధిని పొందడం కోసం చెఱువు ఏర్పరచినా, సాగుబడి పూర్తి అయిన తరువాత, స్నాన పానాలకు ఆ తటాకమే ఉపయోగపడుతుంది కదా! ఆ రీతిలోనే నిశ్శేషకర్మక్షం జరిగిన తరువాతకూడా సూక్ష్మశరీరసిద్ధి విద్యామాహాత్మ్యంవల్ల యుక్తమవుతుంది. ఈవిధంగా కదా శ్రీభాష్యకారులు నిష్కర్షించారు.

అక్షరాద్యధికరణంలో, అమలత్వం అనేది సర్వపరవిద్యోపాస్యగుణంగా నిరూపింపబడుతున్నది. అమలత్వం నిత్యసూరి వ్యావర్తకమని భావం.

లింగభూయస్త్వాధికరణంలో సకలపరవిద్యోపాస్యం నారాయణతత్త్వం- అని నిశ్చయింపబడుతున్నది. పరవిద్యాప్రకరణంలో, అక్షర, శివ, శంభు, పరబ్రహ్మ, పరజ్యోతిః, పరతత్త్వ, పరమాత్మ శబ్దాలతో నిర్దేశింపబడే తత్త్వం. నారాయణుడైన దేవతావిశేషమే - అని ఇందువల్ల తెలుస్తున్నది. ఈ సందర్భంలో **"ఆత్మైక్యం దేవతైక్యం త్రికసమధిగత తుల్యతైక్యం త్రయాణామ్, అన్యత్రైశ్వర మిత్యాద్యనిపుణ ఫణితీ రాదియంతే న సంతః, త్రయ్యంతై రేకకంఠైః తదనుగుణమనువ్యాస ముఖ్యోక్తి భిశ్చ శ్రీమన్నారాయణో నః పతి రఖిలతనుః ముక్తిదో ముక్తిభోగ్యః"** అనే శ్రీదేశికసూక్తి, **"త్రయో దేవా స్తుల్యా త్రితయమిద మద్వైత మధికం త్రికాదస్మాత్ తత్త్వం పరమితి వితర్కాన్ విఘటయన్, విభో ర్నాభీపద్మః విధిశివనిదానం భగవతః తదన్యద్భూభంగీ పరవదితి సిద్ధాంతయతి నః"** (బ్రహ్మ విష్ణు మహేశ్వరులనే ముగ్గురు దేవతలు సమానులు, ఈ ముగ్గురు దేవతలు ఒకటే, ఈ ముగ్గురి కంటే వేరైన పరతత్త్వం ఒకటి ఉన్నది - అని ఈ విధంగా పలురీతులలోని కుతర్కాలను ఎగురగొడుతూ శ్రీరంగనాథుని నాభీపద్మం బ్రహ్మ మహేశ్వరులకు తాను మూలకారణమై నందున శ్రీరంగనాథుడే పరతత్త్వమని, మిగిలిన జగత్తు అంతా ఆయన కనుబొమల కదలికలను అనుసరించి వర్తిస్తుందని సిద్ధాంతం చేస్తున్నది.) అనే పరాశరభట్టర్‌సూక్తి, **"ముదలామ్ తిరువురువుమ్ మూన్ఱెన్బర్, ఒన్ఱే ముదలాకుమ్ మూన్ఱుక్కు మెన్బర్, ముదల్వా! నికరిలకు కారురువా! నిన్నకత్తదన్ఱే పుకరిలకు తామరైయిన్ పూ"** (త్రిమూర్తులే జగత్కారణమని కొందరంటారు, ఈ ముగ్గురకు వేఱొక దేవత కారణమని మరికొందరంటారు. ఓ జగత్కారణమా! సాటిలేని మేఘం వంటి రూపం కలవాడా! గొప్పగా ప్రకాశించే నాభీపద్మం నీలోనే కదా ఉన్నది.) అనే ఆళ్వార్ల దివ్యసూక్తి అనుసంధేయాలు. శబ్దాదిభేదాధికరణంలో పద్విద్య, దహరవిద్యాదులకు భేదం సమర్థింపబడింది. ఈ అధికరణంలో కూడా నిర్విశేషజ్ఞానవాది నిరసనాన్ని శ్రీవ్యాసులవారు చేశారని శ్రుత ప్రకాశికలో తెలుపబడింది. వికల్పాధికరణంలో సకల పరవిద్యలకు మోక్షరూపమైన ఒకే ఫలం - అని చెప్పబడింది. అంటే - దండచక్రాది న్యాయంతో (దండం, చక్రం, జలం మొదలైనవి కలసియే ఘటోత్పత్తికి

కారణం - అనేటట్లుగా) సకలపరవిద్యలు ప్రత్యేక ప్రత్యేకంగా మోక్షహేతువా? అనే పూర్వపక్షాన్ని పల్కి, ప్రత్యేక ప్రత్యేకంగా పరవిద్యలు మోక్షహేతువులు - అని శ్రీ వేదవ్యాసులవారు సిద్ధాంతీకరించారు. ఉపాయాలు పలు విధాలని, వాటికి వికల్పం అని నిశ్చయించే వ్యాసులు, అద్వైత జ్ఞానంతో మోక్షం కల్గుతుందని వాదించేవారి జగన్మిథ్యాత్వాన్ని, ఏకసత్యత్వాన్ని నిరసించిన వారయ్యారు. ఇది గుణోపసంహారపాదసారం,

అంగపాదం : మూడవ అధ్యాయంలోని నాల్గవ పాదం అంగపాదం అనబడుతుంది. గుణోపసంహారపాదంలో విద్యావిచారాన్ని చేసిన శ్రీవ్యాసులు, ఈ పాదంలో విద్యాంగాలైన కర్మలను గూర్చి విచారించారు. అవి - వర్ణాశ్రమ ధర్మాలు, శమదమాదులు, పాండిత్యం, బాల్యం - మౌనం - అని పలువిధాలు. పూర్వమీ మాంసలో విచారింపబడిన స్వర్గాదులకు సాధనమైన కర్మం ఇక్కడ బ్రహ్మవిద్యాం గంగా నిరూపింపబడుతున్నది. ఈవిధంగా పల్కడం వినియోగ పృథక్త్వన్యాయంతో కుదురుతుంది. లేక, స్వర్గాదిసాధనాలు కాని ధ్యానార్చన ప్రణామాదులు, పురాణ ప్రసిద్ధాలు. ఇక్కడ అంగంగా చెప్పబడుతున్నాయి. అనికూడా అనవచ్చు. ఇక్కడ వేదవ్యాసులు చేసే ప్రతిజ్ఞావిశేషాలు నాల్గు అవి (1) జ్ఞానమాత్రం ఉపాయం కాదు. అది ఉపాసనాత్మకం. (2) అది భక్తిరూపం, (3) అది నారాయణవిషయం, (4) అది కూడా కర్మాంగం, పురుషార్థలాభం విద్యవల్ల కల్గుతుంది- అనేది శ్రీవేదవ్యాస సిద్ధాంతం. ఔపనిషద శబ్దాలు ఈ విషయంలో ప్రమాణాలు - అని శ్రీభాష్యంలో మూడు ఉపనిషద్వాక్యాలు ఉదాహరింపబడ్డాయి. అవి - (1) **"బ్రహ్మవిదాప్నోతి పరమ్"** అనే మొదటి వాక్యంలో బ్రహ్మవిద్యవల్ల పురుషార్థప్రాప్తి చెప్పబడింది. (2) **"వేదాహమ్... తమేవం విద్వాన్ అమృత ఇహ భవతి"** అనే రెండవ వాక్యంలో ప్రతిబంధనివృత్తి చెప్పబడింది. పరబ్రహ్మకు దివ్యమంగళవిగ్రహయోగం, ఉపాయాంతర నిషేధం ఆ వాక్యాలలోనే చెప్పబడింది. **"యథా నద్యః"** అనే మూడవ వాక్యంలో విద్యవల్ల ప్రాప్యలాభం, ప్రతిబంధకనివృత్తి- అనే రెండర్థాలు చెప్పబడ్డాయి. ఈ పాదంలో పదిహేను అధికరణాలున్నాయి. వాటిలో, మొదటి అధికరణంలో, మొదటి సూత్రంతో విద్యతో ప్రాప్యలాభం - అనే సిద్ధాంతాన్ని చూపి, తరువాత ఆఱు

అధికరణాలతో పూర్వపక్షాన్ని చూపి, తరువాత పలు సూత్రాలతో సిద్ధాంతాన్ని వ్యాసులు పలికారు. జైమిని మహర్షి పూర్వపక్షి అని, వ్యాసుడు సిద్ధాంతి - అని సూత్రంలో స్పష్టం. శ్రీవేదవ్యాసుల శిష్యులై, పరబ్రహ్మంగీకారాన్ని చేసినవారు, జైమిని. ఈ విషయం **"సాక్షాదప్యవిరోధం జైమినిః", "పరం జైమిని ర్ముఖ్యత్వాత్"** ఇత్యాది సూత్రాలలో స్పష్టం. వారు, వ్యాసమతానికి విపరీతంగా పూర్వపక్షాన్ని చేస్తారా? అని అంటే, వ్యాసమహర్షిని ఆశ్రయించడానికి ముందే ఉపనిషత్తులకు వారు చేసిన అర్థనిర్వాహాన్ని ఇక్కడ పూర్వపక్షంగా గ్రహించాలి. ఈ విధంగా అయితే, **"అధ్యయన మాత్రవతః" (వేద మధీత్య** - అని ఆరంభమౌతున్న వేదవాక్యంలో వేదాధ్యయనాన్ని కలవానికే కర్మ విధింపబడినందున) అనే సూత్రం, **"అధికోపదేశాత్తు"** (కర్త అయిన జీవుని కంటే భిన్నుడైన పరమాత్మనే ఉపాస్యునిగా ఉపదేశించినందున) అనే సూత్రం సుసంగతాలవుతాయి. సర్వాపేక్షాధి కరణంలో - విద్యకు కర్మ అంగమనే విషయంలో **"అశ్వవత్"** అనే దృష్టాంతం చూపబడింది. **"అసినా జిఘాంసతి"** అనే చోట కత్తి హనన సాధనం కాదు; హననేచ్ఛాసాధనం కాదు. అదే విధంగా **"యజ్ఞేన విదిషతి"** అనే శ్రుతిలో చెప్పబడిన యజ్ఞాదులు వేదనసాధనాలు కావు; వేదన సాధనేచ్ఛా సాధనాలు కావు - అని సిద్ధాంతీకరింపబడింది. అంతేకాక, జ్ఞానేచ్ఛకు కర్మం కారణం- అనేది కూడా పొసగదు. కర్మ ఇచ్ఛను పుట్టించదు కదా. విషయవైలక్షణ్య జ్ఞానాన్ని కల్గిస్తుంది - అని కూడా చెప్పలేము. జ్ఞానం కోసం కర్మ - అనేది ఇతరమతాలవారికి అపసిద్ధాంతం కదా! ఇచ్ఛాసాధనం కర్మ- అని పలికే తమ వచనానికి విరుద్ధమవుతుంది. గమనసాధన భూతమైన అశ్వం పరికరాలను అపేక్షించేటట్లే, మోక్షసాధనమైన బ్రహ్మవిద్యకూడా కర్మలను అపేక్షిస్తుంది. ఫలోత్పత్తిలో కర్మాపేక్షలేకపోయినా, పరబ్రహ్మవిద్యోత్పత్తిలో కర్మాపేక్ష ఉన్నది - అనే విషయాన్ని **"సర్వాపేక్ష"** అనే సూత్రం ద్వారా పలికారు. అందువల్ల సర్వాపేక్షను సర్వోపేక్షగా పలికే పరుల వ్యాఖ్యానం అసంగతం.

పూర్వమే యజ్ఞాదులను, శమాదులను విద్యాంగాలుగా నిరూపించిన వ్యాసులు, సహకార్యంతరవిద్యధికరణంలో పాండిత్యబాల్య మౌనాలు విద్యాంగాలుగా నిరూపిస్తున్నారు. పాండిత్యాది త్రయం విద్యాంగంగా విధేయమని పెద్దలంటారు.

బాల్యం మాత్రమే విధేయమని పూర్వపక్షి అభిప్రాయం. మూడు విధేయాలే - అనేది సిద్ధాంతం. శ్రవణ మననలబ్ధజ్ఞానం పాండిత్యం. వేదాంతులు తమ గొప్పతనాన్ని మఱుగుపరచుకొంటారు. ఇదే బాల్యం. ఈ విధంగా ఉండడం లోకులు చేసే సమ్మానాన్ని అసత్ప్రాయంగా చేయడంకోసమే. పరమజ్ఞానికి సమ్మానం త్యాజ్యం. **"అసమ్మానాత్ తపోవృద్ధిः, సమ్మానాత్తు తపోక్షయः, అర్చితः పూజితः విప్రో దుగ్ధా గౌరివ గచ్ఛతి"** (లోకులు నిందిస్తే తమస్సు వృద్ధి అవుతుంది. కీర్తిస్తే, తపస్సు తరుగుతుంది. కీర్తించి పూజింపబడ్డ బ్రాహ్మణుడు, పాలు పితికిన గోవువలె వెళ్ళిపోతాడు) అని కదా స్మృతివాక్యం. మౌనమంటే - శుభాశ్రయచింతనం. ఈ విధంగా విద్యాంగాలను విచారించిన వ్యాసులు. విద్యానిష్పత్తికి గల ఆటంకాలను అంతిమాధికరణంలో తెల్పుతున్నారు. ఎందుకంటే - ప్రతిబంధకాభావంకూడా సామగ్రిలో అంతర్భవిస్తుంది కనుక. భాగవతాపచారమనే ప్రతిబంధకం లేకపోతే విద్యానిష్పత్తి కల్గుతుంది. **"అస్తి మత్స్యः తిమిర్నామ శతయోజనమాయతः, తిమింగిలగిలోఽప్యస్తి తద్గిలోఽప్యస్తి సాగరే"** అనే రీతిలో బ్రహ్మవిత్తులకు కూడా భాగవతాపచారమనే ఆటంకం విద్యానిష్పత్తిని నిరోధిస్తుంది. నామరూపాలను కల్గినవారై, భాగవత విరోధాన్ని చేసేవారు దగ్ధపటంవంటివారు. మడచి పెట్టిన వస్త్రం దగ్ధమైనా, దానిలోని పడుగు, పేకలు ఒకదానితో ఇంకొకటి కలసి ఉంటాయి. గాలి వీస్తే ఎగిరిపోతాయి. **"ఈశ్వరన్ అవతరిత్తు పణ్ణిన ఆనైత్తుళ్ళికళెల్లామ్ భాగవతాప చరమ్ పొఱుమై"** **ఎస్టు జీయర్ అరుళిచ్చెయ్‌వర్"** (భగవంతుడు చేసిన అతిమానుష కృత్యాలన్ని భాగవతాపచారాన్ని సహించలేనందున - అని నంజీయర్ అనేవారు), **"అవమానక్రియా", భాగవతాపచారన్దాన్ అనేకవిధమ్** (భాగవతాపచారాలు అనేక విధాలు), **జ్ఞానానుష్ఠానజ్గళై యెళ్ళిన్దాలుమ్ పేఱ్ఱుక్కు అవర్‌కళ్ పక్కల్ సంబంధమే అమైకిఱ్ఱపోలే, అవై యుణ్డానాలుమ్ ఇళవుక్కు అవర్‌కళ్ పక్కల్ అపచారమే అమైయుమ్"** (జ్ఞానానుష్ఠానాలు లేకపోయినా ప్రాప్యానికి భాగవతులతో సంబంధమే సరిపోయేటట్లు, జ్ఞానానుష్ఠానాలు ఉన్నా భాగవతాపచారం చేస్తే అది ప్రాప్యాన్ని కోల్పోవడానికి కారణమౌతుంది) ఇత్యాది శ్రీవచనభూషణ సూత్రాలు ఇక్కడ అనుసంధేయాలు. వాక్యార్థజ్ఞానమాత్రం ఉపాయమని

మాయావాదులంటారు. కర్మజ్ఞానసముచ్చయం - అని యాదవ ప్రకాశమతం. కర్మప్రాధాన్యవాదులు నిరీశ్వరమీమాంసకులు. జీవుడు నిత్యముక్తుడైనందున, ముక్తి సాధ్యం కాదని సాంఖ్యులంటారు. ఈ నాల్గు పక్షాలను ఖండించి, కర్మాంగమైన ఉపాసనం మోక్షహేతు - అని ఇంతవరకు శ్రీవేదవ్యాసులు సిద్ధాంతీకరించారు. ఇంతటితో అంగపాదం ముగిసింది.

ఫలాధ్యాయం :- శారీరకమీమాంసాశాస్త్రంలోని నాల్గవ అధ్యాయం ఫలాధ్యాయమనబడుతుంది. బ్రహ్మవిద్యా ఫలం ఈ అధ్యాయంలో విస్తృతంగా నాల్గు పాదాలతో నిరూపింపబడుతున్నది. ఇదేకదా, మూలమంత్రంలో తృతీయ పదమైన **"నారాయణాయ"** అనే పదంయొక్క అర్థం.

ఈ అధ్యాయంలో కర్మనివృత్తి - అనే ఫలాన్ని మొదటి పాదంలోను, స్థూలదేహ నివృత్తి - అనే ఫలాన్ని రెండవ పాదంలోను, సూక్ష్మదేహనివృత్తి- అనే ఫలాన్ని మూడవ పాదంలోను, పరబ్రహ్మప్రాప్తి, స్వస్వరూపావిర్భావం, అపునరావృత్తి - ఇత్యాది ఫలాన్ని నాల్గవ పాదంలోను శ్రీవేదవ్యాసులు నిరూపించారు.

ఈ అధ్యాయంలోని నాల్గు పాదాలకు క్రమంగా ఆవృత్తిపాదం, ఉత్క్రాంతి పాదం, గతి పాదం, ప్రాప్తిపాదమని పేర్లు.

ఫలాధ్యాయంలోని మొదటి పాదంలో పదకొండు అధికరణాలున్నాయి. వ్యాసులు మొదటి ఆఱు అధికరణాలతో విద్యాస్వరూపవిచారాన్ని చేసి, తరువాత అయిదు అధికరణాలలో విద్యాఫలవిచారాన్ని చేశారు.

మునుముందుగా, విద్యాస్వరూపవిచారం సంగతమేనా? అని అంటే, (సాధన భూతవిద్యావిశేషాన్ని సాధనాధ్యాయంలో విచారించకుండా, ఫలాధ్యాయంలో విచారించడం యుక్తమేనా? అని అంటే) దీనికి పరిహారం పలు రీతులలో చెప్పబడింది. ఉపాసనం కూడా కర్మయోగానికి సాధనమైనందున, సాధ్యపరమైన ఈ అధ్యాయంలో ఉపాసనవిచారం చేయబడడం యుక్తమే. భగవద్భక్తియే ఫలమైనందున ఫలాధ్యాయంలో విచారించడం తగినదే. ఆళ్వార్లు కూడా **"పుల్‌కు పఱ్ఱఱ్ఱే"** అని భక్తిని అంగనాపరిష్వంగంవలె స్వయంప్రయోజనంగా కదా పలికారు.

"ఆవృత్తి రసకృదుపదేశాత్" (4-1-1) అని సూత్రకారునిచే మోక్షసాధనమైన జ్ఞానం అంటే - అసకృత్ ఆవృత్తం (మాటిమాటికి చింతించడం) - అని చెప్పబడినా, సూత్రకారుని అభిప్రాయాన్ని జాగ్రత్తగా గమనిస్తే, ఇంకా ఇంకా ఎన్ని విశేషాలు శ్రుతాలు అవుతాయో, అన్ని విశేషాలను సామాన్యవిశేష న్యాయంతో గ్రహించాలి - అని తెలుస్తున్నది. **"బ్రహ్మవిదాప్నోతి పరమ్"** అనే శ్రుతి **"వేదనం స్మృతిరూప"** మని, **"ఆత్మాన మేవలోక ముపాసీత"** అనే శ్రుతి **"అది స్మృతి సంతతిరూప"** మని, **"ధ్రువా స్మృతిః, నిదిధ్యాసితవ్యః"** అనే శ్రుతి "అది తైలధారవలె అవిచ్ఛిన్న సంతానరూపమని, **"నిచాయ్యతమ్"** అనే శ్రుతి అది **"సాక్షాత్కారరూప"**మని, **"నాయమాత్మా"**అనే శ్రుతి "అది ప్రీతిరూపాపన్న" మని తెల్పుతున్నవి. **"భక్త్యా త్వ నన్యయా శక్యః"** అనే స్మృతి, ఈ అర్థానికి సంవాద రూపమైన ప్రమాణం. శ్రీపరాశర భగవానులు **"ప్రాయశ్చిత్తాన్యశేషాణి తపఃకర్మాత్మకాని వై, యాని తేషా మశేషాణాం కృష్ణానుస్మరణం పరమ్"** (తపస్సు రూపంలో, కర్మరూపంలో ఉండే ప్రాయశ్చిత్తాలు అన్నిటిలోను శ్రీకృష్ణుని భావించడమనేది గొప్ప ప్రాయశ్చిత్తం) అని అన్నారు. ప్రాయశ్చిత్తాలు అన్నిటికి ప్రతినిధి భగవద్భక్తి - అని ఒక నిర్వాహం. సకల ప్రాయశ్చిత్తా లకు భగవద్భక్తి సహకారి కారణమవుతుంది- అని ఇంకొక నిర్వాహం. ఈ విధంగా శ్రీపరాశరులు పల్కగా, శ్రీపారాశర్యులైన వేదవ్యాసులు భగవద్భక్తియే ప్రాయశ్చిత్తమని అన్నారు. **"కృష్ణానుస్మరణమ్"** అనే చోట **"అనుస్మరణమ్"** అనే శబ్దానికి **"అను స్మరణమ్" అను - నిహీనే, శేషత్వానుసంధానమ్"** అని శ్రీవిష్ణుచిత్తులనే ఎఱ్ఱాప్రగ్గడ వ్యాఖ్యానించారు.

ఈ పాదంలో రెండవ అధికరణం ఆత్మోపాసనాధికరణం. ఈ అధికరణం లో బ్రహ్మను ఉపాసించవలసిన క్రమం తెలుపబడుతున్నది. **"బ్రహ్మం నేనే"** అని ఉపాసించాలి - అని ఇందులో చెప్పబడుతున్నది. ఇక్కడ ఒక సందేహం కల్గుతుంది. అది ఏమంటే - పూర్వం మూడు అధ్యాయాలతో జీవపరభేదమే సిద్ధాంతితమైనది. జిజ్ఞాస్యమై, జగత్కారణమై, ప్రబలప్రమాణ గమ్యమై, సకలపరవిద్యోపాస్యంగా కదా బ్రహ్మం నిరూపింపబడింది. తనకు శరీరభూతుడైన, ఉపాసకుడైన జీవాత్మకంటే చీకటికంటే వెలుగువలె, పాపంకంటే

పుణ్యంవలె, శరీరంకంటే ఆత్మవలె, తేజస్సుకంటే రత్నంవలె, ఘటపటాది జాతికంటే ఘటాదివ్యక్తివలె, ఉపాస్యుడై పరమాత్మ, అత్యంతం భిన్నం కదా! ఈ విధంగా ఆత్మత్వోపాసనమనేది పొసగుతుందా? - అని సందేహం. దీనికి పరిహారం ఏమంటే - ఇక్కడ అ బ్రహ్మాన్ని బ్రహ్మంగా ఉపాసించడం అర్థం కాదు. దృష్ట్యుపాసనానికి మోక్షం ఫలంకాదుకదా. జీవపరమాత్మలకు స్వరూపైక్యమే చెప్పబడుతున్నది - అని అనడం కూడా పొసగదు. జీవపరైక్యజ్ఞానం భ్రాంతి కనుక, అది మోక్షహేతువు కాదు. అందువల్ల ఇవి రెండు ఆత్మత్వోపాసనాలు కావు. ఉపాసకుడు తనకు ఆత్మగా (అంతరాత్మగా) ఉపాసించడమే ఆత్మత్వోపాసన మనబడుతుంది. ఇది పూర్వం చెప్పబడిన జీవపరస్వరూప భేదానికి అవిరుద్ధంకదా! ఇదే అహంగ్రహోపాసన మనబడుతుంది. దేహవాచి అయిన దేవతాశబ్దం, దేహాధిష్ఠాత అయిన ఆత్మను ముఖ్యంగా తెల్పుతుంది. ఆ రీతిలోనే జీవవాచి అయిన అహంశబ్దం, తదాత్మ అయిన పరమాత్మ విషయంలో ముఖ్యవృత్తిని కల్గినది - అనేది ఆకృత్యధికరణ న్యాయసిద్ధం. కదా! ఈవిధంగా అనుసంధించడంలోని ప్రయోజనం ఏమంటే - పరబ్రహ్మకు తాను అత్యంత పరతంత్రుడను - అనే జ్ఞానలాభమే.

"అహంగ్రహోపాసనం జీవపరఅద్వైతజ్ఞానమ్" అని మాయావాదు లంటారు. అది అయుక్తం. అద్వైత శబ్దానికి - ద్వైతవిరోధి, ద్వైతాన్యం, ద్వైతాభావం - అని ఏవిధంగా అర్థం చెప్పినా, ద్వైతమనేది సిద్ధించే తీరుతుంది. ద్వైతమనేది లేకపోతే అద్వైతమనేది సిద్ధించదని శాస్త్రకారులంటారు. వేదార్థనిర్ణయకాలైన బ్రహ్మసూత్రాలు జీవబ్రహ్మస్వరూపభేదాన్నే తెలుపు తున్నాయి. జీవపరైక్యప్రతిపాదక సూత్రం ఒక్కటికూడా లేదు. అద్వైతులు కూడా **"శాస్త్రదృష్ట్యా", "ఆత్మేతి తు", "అవిభాగేన"** అనే సూత్రత్రయాన్నే జీవపర - అభేద ప్రతిపాదకంగా పల్కుతున్నారు. ఆ సూత్రత్రయం జీవపర భేదాన్నే ప్రతిపాదిస్తున్నాయి - అనేది భేదవాదుల అభిప్రాయం. **"శాస్త్రదృష్ట్యా తు"** అనే సూత్రవ్యాఖ్యానమైన **"ప్రతిపాద్యం తు శాస్త్రార్థం ఆత్మైకత్వ మేవ దర్శయతి శాస్త్రదృష్ట్యా - ఇతి"** అనే శాంకరభాష్యాన్ని **"జీవబ్రహ్మణోః ఐక్యం న క్వాపి సూత్రకారః ముఖతః వదతి, కింతు, సర్వత్ర భేదమేవ. అతః నైక్యమిష్టమ్.**

తత్రాహ - ప్రతిపాద్యం త్వితి" అనే ఆనందగిరిటీకను, **"సూత్రేషు అభేదః నోక్తః, ఇతి భ్రాంతిం నివారయతి ప్రతిపాద్యంత్వితి"** అనే రత్నప్రభావాక్యాన్ని గమనించే వారికి ఇది స్ఫుటం కదా! ఆ సూత్రత్రయంలో కూడా శ్రీవేదవ్యాసులు శరీరాత్మ భావంతో వచ్చిన జీవపరతాదాత్మ్యాన్నే ఆకృతిన్యాయంతో అభిప్రాయ పడుతున్నారు - అని భావించేటపుడు, భేదశ్రుతికి, అభేదశ్రుతికి, భేదాభేదశ్రుతికి విరోధం లేకుండా సర్వసామంజస్యం కూడుతుంది. (పొసగుతుంది) **"ఇతి సర్వం సమంజసమ్"** అని కదా భాష్యకారసమాప్తి. ఈ రీతిలో విద్యాస్వరూప విశోధనం చేసి, శ్రీవేదవ్యాసులు, **"తదధిగమాధికరణం"** నుండి వరుసగా అయిదు అధికరణాలతో విద్యాఫలాన్ని నిరూపిస్తున్నారు- అనేది శ్రీభాష్యసారం.

"తదధిగమే" - సాక్షాత్కారదశాపన్న బ్రహ్మవిద్యాప్రాప్తి ఏర్పడేటపుడు, **"ఉత్తరపూర్వాఘయోః"** - చేయబోయే పాపాలకు, చేసిన పాపాలకు, **"అశ్లేష-వినాశౌ"**- సంశ్లేషం లేకపోవడం, నశించడం చెప్పబడింది - అనేవి సూత్రార్థం. **"నాభుక్తం క్షీయతే కర్మ"** అనే వచనం కర్మఫలజననశక్తి ఫలానుభవ పర్యంతం నిలచి ఉంటుంది - అనే అర్థాన్ని తెల్పుతున్నది. బ్రహ్మవిద్యవల్ల పూర్వోత్తర పాపాలకు అశ్లేషవినాశాలు శాస్త్రసిద్ధాలు. ఈ వచనానికి అర్థమేమంటే - కర్మల ఫలజననశక్తిని బ్రహ్మవిద్య నశింపజేస్తుంది. బ్రహ్మవిద్య కర్మలకు ఫలజననశక్తినే కల్గించకుండా అడ్డుపడుతుంది- అని భావం. "అగ్ని దహిస్తుంది." అనే వచనానికి "జలం దానిని శాంతపరుస్తుంది" అనే వచనానికి విరోధం లేనట్లుగా, ఇక్కడ కూడా అర్థాన్ని గ్రహించడం యుక్తం. ఆళ్వార్లు కూడా **"మాదవనెన్నెన్ను ఓదవల్లిరేల్ తీదొన్టుమ్ అడైయా ఏదమ్ శారావే"** (10-5-7) (మాధవుడని పలుక గల్గితే ఏ కీడు దరిచేరదు. ఏ లోటు ఉండదు.) అని అన్నారు.

బ్రహ్మవిద్యానిష్ఠుని కర్మలకు నాల్గు అవస్థావిశేషాలు శ్రుతిసిద్ధాలు. అవి ఏవి? అంటే, వినాశం, అశ్లేషం, ధూననం, ఉపాయనం - అనేవి. క్రియాసామాన్యం నశించడం మనం ప్రత్యక్షంగా చూస్తున్నాము. అందువల్ల వినాశ-అశ్లేష-ధూనన- సంక్రమణాలనే వానిని కర్మలైన క్రియలకు పలుకకుండా, క్రియాశక్తికి చెప్పడం పొసగుతుంది. ఆ శక్తికూడా భగవత్ప్రీతి - అప్రీతిరూపాలే. ఈవిధంగా విద్య అనేది పూర్వపాపనాశం లోను, ఉత్తరపాపాశ్లేషంలోను, విద్యానిష్ఠుని

అనుకూల - ప్రతికూలాధికారులపట్ల సజాతీయాదృష్ట జననంలోను సమర్థమైనది - అని స్ఫుటపడింది. ముముక్షువుకు, పాపంవలె పుణ్యంకూడా మోక్షవిరోధి అయినందున, పుణ్యాలకు కూడా అశ్లేషవినాశాలు - అనే దానిని వ్యాసులు ఇతరాధికరణంలో స్థాపించారు. **"కారాగారోప రుద్ధే నిగలయుగలతః సార్వభౌమస్య భృత్యే హైమం కార్ష్ణాయసం చ ప్రసదన సమయే భంజనీయం సహైవ"** (ఇనుప సంకెళ్ళతో, బంగారు సంకెళ్ళతో కారాగారంలో బంధింపబడిన చక్రవర్తి భృత్యునకు అతని విడుదల సమయంలో ఆ రెండు సంకెళ్ళు ఒకేసారి విడగొట్టబడాలి కదా!) అని అంటూ దేశికులు అధికరణ సారావళిలో - పుణ్యం అనేది బంగారు సంకెల, పాపం ఇనుపసంకెల. రెండు ఇష్ట విరోధులే - తొలగించు కొనవలసినవే - అని నిరూపించారు. **"ఉత్తరపూర్వాఘయోః"** (4-1-13) (బ్రహ్మవిద్యను పొందగానే ఉత్తరాఘాల అశ్లేషం, పూర్వాఘాల వినాశం విద్యా మహిమ వల్ల కల్గుతుంది.) అనే సూత్రం పాపపరం. **"ఇతరస్యాపి"** (4-1-14) (పాపం కంటే వేరైన పుణ్యకర్మకు కూడా ఈ విధమైన అశ్లేషం, వినాశం కల్గుతున్నాయి.) అనే సూత్రం పుణ్యపరం. **"అనారబ్ధకార్యే"** (4-1-15) (పూర్వ చేసిన పుణ్యపాపాలలో, ఫలం ఇవ్వడం ఆరంభించని పుణ్యపాపాలే నశిస్తాయి.) అనే సూత్రం పుణ్యపాపపరం - అని శ్రీభాష్యకారుల అభిప్రాయం. ఉపాసకుడు ప్రారబ్ధకర్మల ఫలాన్ని అనుభవించి తీరాలి. తర్వాతే ఇష్టప్రాప్తి కల్గుతుంది. ఆళ్వార్లు **"ఒడుఙ్గ అవన్ కణ్ ఒడుఙ్గలు మెల్లామ్ విడుమ్"** అని పలికారు. **"ఒడుఙ్గ అవన్‌కణ్"**- ప్రకారభూతులైన మీరు ప్రకారి అయిన భగవంతుని వద్దకు చేరితే, **"ఒడుఙ్గలుమ్ ఎల్లామ్ విడుమ్"**- ప్రాప్తమైన పనిని చేస్తే అప్రాప్తాలు అన్నీ విడచిపోతాయి. స్వరూపానురూప్యాన్ని చేయగా, స్వరూపవిరోధులన్ని పూర్తిగా విడచిపోతాయి. **"ఒడుఙ్గ"**- అని విద్యను, **"విడుమ్"**- అని విద్యాఫలాన్ని ఆళ్వార్లు చెప్పడం జరిగింది. ఇంతటితో ఆవృత్తిపాదం ముగిసింది.

ఉత్క్రాంతిపాదం :- గడచిన పాదంలో, బ్రహ్మవిద్యానిష్ఠునకు దేహం ఉన్నంత కాలంలో, విద్యామాహాత్మ్యం వల్ల కలిగే ఫలం చెప్పడింది. అవి ఏమంటే- విద్యారంభానికి ముందే అనాది కాలంగా ఇతనిచే చేయబడిన ప్రారబ్ధ భిన్నాలైన పుణ్యపాపాలకు అశ్లేష-వినాశాలే. నిప్పు సోకిన పత్తివలె (దూదివలె) అవి నశిస్తాయి.

విద్యారంభం తరువాత చేయబడే ప్రామాదికాలైన దుష్కర్మలకు ఫలాశ్లేషం చెప్పబడింది. తామరాకుపై ఉండే నీరువలె, అంటుకోకుండా ఉంటాయని భావం. అవిద్యాస్థానీయమైన తాటక నశించగా, అవిద్యాకార్యకర్మ స్థానీయులైన మారీచుడు, సుబాహువులలో ఒకడైన సుబాహువుకు నాశం, ఇంకొకడైన మారీచునకు అశ్లేషం కదా, వేదోపబృంహణమైన రామాయణంలో అపబృంహిత మైనది. విద్యానిష్ఠుని పుణ్యం- అతని అనుకూలునివద్దకు, పాపం - అతనికి విరోధి అయినవానివద్దకు సంక్రమిస్తాయి. ఆరీతిలో కదా విద్యామాహాత్మ్యం ఉంటుంది. పుణ్యపాపాలకు నాశమంటే - వీటి ఫలాన్ని ఇతనికి ఇవ్వడం లేదు- అనే భగవత్ సంకల్పం. పుణ్యాపుణ్య సంక్రమణమంటే - వీటి ఫలాన్ని వేటొకరి వద్ద విడువడానికి అనుగుణమైన భగవత్సంకల్పం.

ఇక, నాల్గవ అధ్యాయంలో రెండవది అయిన ఉత్క్రాంతిపాదంలోని అర్థాలను తెలిసికొందాం. ఈ పాదంలో స్థూలదేహనివృత్తి విద్యాఫలంగా నిరూపింబడింది.

రెండవ అధ్యాయంలో, జీవతత్త్వం - నిత్యం, జ్ఞానస్వరూపం, జ్ఞానగుణకం అణువు, భగవదంశగా నిరూపింపబడింది. జాగ్రదవస్థ మొదలైన అవస్థలలో సంసారిజీవుడు పడే పాట్లు మూడవ అధ్యాయంలో నిరూపింపబడింది. సంసారి జీవాత్మ విద్యానిష్ఠుడైతే, అతనికి ఏర్పడే విద్యాఫలం ఇంతకు ముందు నిరూపింప బడింది. ఇక, బ్రహ్మవేత్తకు **(విద్వాన్)** మరణం ఉన్నది - అని నిరూపింప బడుతున్నది. జీవుని జాగ్రదవస్థ మొదలగు అవస్థలను గూర్చి మూడవ అధ్యాయంల నిరూపించిన వేదవ్యాసులు, అతని మరణాన్నిగూర్చి అక్కడ నిరూపించకుండా, ఫలాధ్యాయంలో నిరూపించడం ఎందుకు? అని అంటే, బ్రహ్మవేత్తలకు మరణం సుఖరూపం కనుక, బ్రహ్మవేత్తలు మహానుభావు లైనందున, వారికి మరణ మనేది లేదు - అనే భ్రాంతిని పోగొట్టడం ప్రయోజనమై నందున, ఇక్కడ వేదవ్యాసులు మరణచింతను చేస్తున్నారు, ప్రారబ్ధావసానంలో బ్రహ్మవిద్యానిష్ఠుడైన ఉపాసకునకు మరణమని నిరూపిస్తున్నారు.

ఈ ఉత్క్రాంతిపాదం జీవన్ముక్తివాదులైన సాంఖ్యులకు, మాయా వాదులకు (అద్వైతులకు) అసంగతం. ఏవిధంగా? అంటే, జీవన్ముక్తుడనేవాడు.

జీవిస్తూనే ముక్తుడయేవాడుకదా! ఇది, "నా తల్లి వంధ్య" అనే రీతిలో వ్యాహతభాషణమే కాగలదు. జీవిస్తూనే, ముక్తుడని, సంసారనివృత్తిని ఒకే కాలంలో పల్కడం అసంగతం కదా! జీవన్ముక్తులుగా చెప్పబడేవారికి దేహాను బంధులైన ఆకలి, దాహం, కోపం - వీటివల్ల కలిగే దుఃఖం వీనిని చూస్తున్నాము. కదా! దుఃఖం లేకపోవడమే కదా మోక్షం. అందువల్ల జీవన్ముక్తివాదం అసంగతం. **"బుద్ధే క్షేమప్రాపణం, తచ్ఛాస్త్రై ర్విప్రతిషిద్ధం, బుద్ధే చేత్ క్షేమ ప్రాపణం ఇహైవ న దుఃఖ ముపలభేత"** అని ఆపస్తంబులు జీవన్ముక్తి వాదాన్ని ఖండించారు. ప్రత్యక్షవిరోధానికి మించి, శాస్త్రవిరోధం కూడా ఉన్నది. వేదాంతాలు ఉపాసనాన్ని వధించినందువల్ల, ప్రాణప్రయాణం వరకు ఉపాసనానువృత్తి చెప్పబడినందున, శరీరంనుండి జీవుని ఉత్క్రమణం శ్రుతిసిద్ధం కనుక, అర్చిరాది మార్గగమనం శ్రుతిసిద్ధం కనుక, దేశవిశేషమైన పరమపదాన్ని చేరినవారికే సర్వబంధవిమోక్షం శ్రుతిసిద్ధమైనందున జీవన్ముక్తి వాదం వేదాంత విరుద్ధమనేది స్ఫుటం. జీవన్ముక్తి వాదాన్ని సాక్షాత్తుగా నిరసించే సూత్రం **"నోపమర్దేనాతః" (4-2-10) (యత్ర సర్వే** - అనే ఆరంభం అవుతున్న వేదవాక్యం సంసారబంధం తీరిన తరువాత కల్గే మోక్షాన్ని తెలుపడం లేదు.) అనేది. ఇక్కడ **"జీవన్ముక్తిమతం న జీవతి యతః శాస్త్రేణ శాస్త్రాత్మనా లూనం లోక విరుద్ధసిద్ధి చ యత స్తేనేద మాదావపి, ఆపస్తంబనిరస్త మౌపనిషదప్రస్థాన మాతస్థుషామ్ ఆచారోఽపి నిరాచకార ఖలు తత్ ద్వైపాయనాఖ్యో మునిః"** (జీవన్ముక్తిమతం నిలువదు. ఎందుకంటే, అది **"తస్య తావదేవ చిరమ్"** ఇత్యాది శాస్త్రమనే ఖడ్గంచే ఖండింపబడింది. అంతేగాక లోక విరుద్ధం కూడా. అందువల్ల అది ఆపస్తంబ మహర్షిచే తిరస్కరింపబడింది. ఉపనిషత్తుల మార్గాన్ని అనుభవించే బోధాయన ద్రమిడాదులకు ఆచార్యులైన బాదరాయణుడు కూడా ఖండించాడు.) అనే శ్రీవాత్స్యవరదగురువులైన నడాదూర్ అమ్మాళ్ అనుగ్రహించిన తత్త్వసారశ్లోకం ఇక్కడ అనుసంధేయం. ఈరీతిలో, శరీరం నుండి ఉత్క్రమించిన వానికి మోక్షం - అని ఉత్క్రాంతిపాదంలో నిరూపింప బడినందున, ఈ పాదం సాంఖ్య - మాయా వాదులకు అసంగతమని తేలింది.

"అత్ర బ్రహ్మ సమశ్నుతే" అని శ్రుతిలో విద్యానిష్ఠనకు ఇక్కడే బ్రహ్మానుభవం అధ్యయనం చేయబడుతున్నందున, బ్రహ్మవేత్తలకు ఉత్క్రాంతి లేదు- అనే పూర్వపక్షాన్ని ఆవృత్త్యధికరణంలో, శ్రీవేదవ్యాసులు నిరసిస్తున్నారు. కఠోపనిషత్తులో మూర్ధన్యనాడి ద్వారా విద్వాంసులు (బ్రహ్మవేత్తలకు) గతి చెప్పబడినందున ఉత్క్రాంతి లేదు - అని అనలేము. నాడీ విశేషమైన మూర్ధన్యనాడీ ప్రవేశానికి ముందే, ఉత్క్రాంతిలో విశేషం చెప్పబడనందున, విద్వాంసుడు, అవిద్వాంసుడు- అనే భేదం లేకుండా అందఱికి ఉత్క్రాంతి సమానమే - అని తెలుస్తున్నది. **"అత్ర బ్రహ్మ స మశ్నుతే"** అనే శ్రుతికి అర్థాన్ని వ్యాసులు **"అమృతత్వం అనుపోష్య"** అని అనుగ్రహించారు. **"అనుపోష్య ఏవ అమృతత్వమ్"** అని అర్థం. అంటే - ఉపాసకశరీరం దహింపబడకుండా ఉన్నప్పటికీ, ఉపాసనకాలంలో ఉండే బ్రహ్మానుభవాన్ని తెలియ జేయడం తప్ప, విదేహదశాప్రాప్యాన్ని (దేహం విడచిన తరువాత లభించే బ్రహ్మాను భవాన్ని) గూర్చి చెప్పడం కాదు. నాడీవిశేషప్రాప్తిప్రయత్నం గల ఉత్క్రాంతి బ్రహ్మవేత్తకు, బ్రహ్మవేత్త కానివానికి అందఱికి సాధారణం - అని పూర్వం పల్కిన వ్యాసులు, తరువాత తదేకోధికరణంలో బ్రహ్మవిద్యా నిష్ఠనకు అసాధారణమైన నాడీ విశేషప్రాప్తి'' అనే విశేషాన్ని తెలిపారు. ఆ నాడీవిశేషం విద్వాంసునకు దుర్విజ్ఞేశ (ప్రవేశించడానికి కష్టమైనది) అయినా, హృదయ గుహలో ఉండే పురుషోత్తముడు ప్రసన్నుడై, దానిని ప్రకాశింపజేస్తాడు - అని తెలిపారు. **"హార్దానుగ్రహ లబ్ధమధ్య ధమనిద్వారా బహిర్నిర్గతః"** అని నడాదూర్ అమ్మాళ్ అనుగ్రహించారు.

శ్రీభీష్మాచార్యులు మరణంకోసం ఉత్తరాయణాన్ని ఎదురుచూచారు. అందువల్ల, దక్షిణాయనంలో మరణించినవానికి మోక్షప్రాప్తి లేదు- అనే పక్షాన్ని శ్రీవ్యాసుల వారు దక్షిణాయనాధికరణంలో నిరసిస్తున్నారు. ఇక్కడ సిద్ధాంతసారమేది? అంటే, ఒకనివద్ద అసాధారణంగా ఉండే ఒక ధర్మాన్నిచూచి, అందఱిలోను అదే ధర్మాన్ని కోరి, దానికోసం చూడడం అయుక్తమే కాగలదు. పాండవులు అయిదుగురికి ద్రౌపది ఒక్కతేయే ధర్మపత్ని - అనే న్యాయాన్ని మనం అందఱి విషయంలోను గ్రహించరాదు కదా! కర్ణుడు, వ్యాసుడు కన్యకాసుతులు - అనే న్యాయాన్ని ప్రతినియతంగానే (వారివరకే తగినదని)

గ్రహించడం తగినది. అదేరీతిలో, భీష్ముని శరీరాన్ని బ్రహ్మవేత్తలందఱికి అతిదేశం చేయరాదు. వారు, ఉత్తరాయణకాల ప్రతీక్షణం చేయడం - ఉత్తరాయణకాలగౌరవం లోకానికి తెలుపడంకోసం కావచ్చు. వస్తుతః, భీష్ముడు సాక్షాన్ముక్తి పొందలేదు. అందువల్ల వారి చరిత్ర ప్రకృతవిషయంలో అప్రకృతమే. కనుక, నరపిత్రాదివిషద్రాత్రిలో (నరుల కాలమానానికి, పితృదేవతల కాలమానానికి, దేవతల కాలమానానికి చెందిన రాత్రి సమయంలో) మరణించిన వారైనా, బ్రహ్మవేత్తలు పరబ్రహ్మప్రాప్తిని కలవారే - అని తెలుపబడినట్లయినది. నరరాత్రి - రాత్రి. పిత్రరాత్రి - కృష్ణపక్షం, దేవరాత్రి - దక్షిణాయనం- అని అర్థం. **"నైతే సృతీ పార్థ! జానన్ యోగీ ముహ్యతి కశ్చన, తస్మాత్ సర్వేషు కాలేషు యోగ యుక్తో భవార్జున!"** (గీత-8-27) (అర్జునా! శుక్ల గతి, కృష్ణ గతి అనేరెండు మార్గాలను తెలిసిన యోగి మోహాన్ని పొందడు. అందువల్ల అన్ని కాలాలలో యోగాన్ని కలవాడవు కావాలి) అని మార్గచింతన గీతం. దిగ్భ్రాంతిని పొంది తికమకపడకుండా ఉండడంకోసం మార్గచింతనం ఆవశ్యకం కదా! **"యోగ యుక్తః"** అనేచోట యోగమంటే భక్తియోగం కాదు, అది మార్గచింతనమే- అనే విషయాన్ని **"తస్మాత్ అహరహః అర్చిరాదిగతిచింతనాఖ్య యోగయుక్తో భవ"** అని గీతాభాష్యంలో భగవద్రామానుజులు అనుగ్రహించారు. నమ్మాళ్వార్లు కూడా **"పిన్నుమ్ ఆక్కై విళుమ్ పిళుదెణ్ణే"** (శరణాగతి చేసిన తర్వాత శరీర పతన సమయాన్ని గూర్చి చింతించి) అని అనుగ్రహించారు.

గతిపాదం :- పూర్వం, ముముక్షువైన బ్రహ్మవేత్తకు స్థూలదేహం ఉండే కాలంలో కలిగే ఫలాన్ని ఉత్తరపూర్వాఘ అశ్లేషవినాశాలుగా, ఏ కాలంలో మరణాన్ని పొందినా బ్రహ్మవిద్యానిష్ఠనకు ప్రారబ్ధకర్మ ముగిస్తే, సుషుమ్నా నాడిద్వారా ఉత్క్రాంతి జరుగుతుందని వ్యాసులు నిరూపించారు. ఈవిధంగా ఫలాధ్యాయంలో ప్రాథమిక పాదద్వయార్థం చెప్పబడింది. ఇది ఒక పేటిక. తర్వాత, రెండు పాదాలతో దేహంనుండి ఉత్క్రమించినవానికి కలిగే ఫలాన్ని అర్చిరాది మార్గంద్వారా బ్రహ్మలోకప్రాప్తి - అని, పునరావృత్తి లేకుండా ఉండే పరిపూర్ణ బ్రహ్మానుభవమని శ్రీవేదవ్యాసులవారు నిరూపిస్తున్నారు. ఇది వేఱొక పేటిక. అందులో గతిపాదమైన ఈ పాదంలో, ముముక్షువును బ్రహ్మలోకానికి

తీసికొనిపోయేవారు ఎవరు? అందులో క్రమం ఏది? తీసికొనిపోయేవారి స్వరూపం ఏమి? తీసికొని పోయే స్థానం ఏమి? అనే విషయాలు విచారింపబడు తున్నాయి.

అర్చిరహస్సిత షణ్మాన్ ఉదగయనాబ్దమరుదర్కేందూన్ ।
అపి వైద్యుతవరుణేంద్ర ప్రజాపతీన్ ఆతివాహికానాహుః ॥

(అగ్నిని, దివసాభిమాన దేవతను, ఉత్తరాయణాభిమాన దేవతను, సంవత్సరాభిమాన దేవతను, వాయువును, సూర్యుని, చంద్రుని, అమానవుడనే విద్యుత్ పురుషుని, వరుణుని, ఇంద్రుని, ప్రజాపతిని ఆతివాహికులుగా సూత్రకారులు పలికారు) అని వరదగురువుల శ్లోకం శ్రుతప్రకాశికలో చూపబడింది. ఈ సందర్భంలో-

1. **సత్సంగాద్భవనిఃస్పృహో గురుముఖాత్ శ్రీశం ప్రపద్యాత్మవాన్**
ప్రారబ్ధం పరిభుజ్య కర్మశకలం ప్రక్షీణ కర్మాంతరః ।
న్యాసాదేవ నిరంకుశేశ్వరదయా నిర్మూనమాయాన్వయః
హార్దానుగ్రహలబ్ధమధ్యధమనిద్వారా బహిర్నిర్గతః ॥

(మానవుడు సత్పురుషుల సహవాసంవల్ల సంసారంపట్ల ఆసక్తి లేనివాడై ముముక్షువు అవుతాడు. అపుడు సదాచార్యుని ద్వారా శ్రీయఃపతిని శరణాగతి చేసి సత్తను కల్గినవాడవుతాడు. ఆ పిమ్మట ప్రారబ్ధకర్మఫలాన్ని దేహావసాన పర్యంతం అనుభవించి, సంచిత - ఆగామికర్మల ఫలాన్ని భగవదనుగ్రహంవల్ల పోగొట్టు కొంటాడు. తాను చేసిన ప్రపత్తివల్ల సంతోషించిన, నిరంకుశ స్వతంత్రుడైన భగవానుని నిర్హేతుక కృపాఫలంగా మాయ అనబడే ప్రకృతితో సంబంధాన్ని పూర్తిగా లేకుండా చేసికొన్నవాడై, తన హృదయంలో నిరంతరం వేంచేసి ఉండే జనార్దనుని అనుగ్రహం వల్ల సుషుమ్న అనబడే మధ్యధమనిద్వారా దేహంనుండి బయటకు వస్తాడు.)

2. **ముక్తోర్చి ర్దినపూర్వపక్షషడుదజ్ మాసాబ్దవాతాంశుమత్-**
గ్లౌవిద్యుద్వరుణేంద్ర ధాతృమహితః సీమాంతసింధ్వాప్లుతః ।

శ్రీవైకుంఠ ముపేత్య నిత్య మజడం తస్మిన్ పరబ్రహ్మణః
సాయుజ్యం సమవాప్య నందతి సమం తేనైవ ధన్యః పుమాన్ ॥

(ఈవిధంగా ముక్తిని పొందిన పురుషుడు అర్చిస్సు - దినం - శుక్లపక్షం - ఉత్తరాయణం - సంవత్సరం - వాయువు - ఆదిత్యుడు - చంద్రుడు - విద్యుత్తు, వరుణుడు - ఇంద్రుడు - ప్రజాపతి అనే అతివాహిక పురుషులచే సత్కరింప బడినవాడై, ప్రకృతిమండలం చివరివరకు ప్రయాణం చేసి, అక్కడ ఉండే విరజానదిలో స్నానంచేసి, ప్రకృతిసంబంధవాసనను పూర్తిగా నశింపజేసికొని నిత్యమైనది, జడం కానిది అయిన వైకుంఠనగరంలో ప్రవేశం చేస్తాడు. అక్కడ అమానవుని కరస్పర్శతో సత్త్వమయమైన, ప్రకాశించే రూపాన్ని, స్వస్వరూపా విర్భావాన్ని పొంది. పరమాత్మతో సామ్యాన్ని పొందుతాడు. భగవానునితో కలసి ముక్తానందాన్ని పొందుతాడు. అపుడే పురుషుడు (జీవుడు) ధన్యుడవుతున్నాడు.)

అనే శ్రీవాత్స్యవరదగురుశ్లోక ద్వయం అనుసంధేయం.

రహస్యత్రయసారంలో శ్రీదేశికులు కూడా -

దహరకుహరే దేవ స్తిష్ఠన్ నిషద్వరదీర్ఘికా -
నిపతితనిజాపత్యాదిత్సావతీర్ణ పితృక్రమాత్ ।
ధమని మిహ నః తస్మిన్ కాలే స ఏవ శతాధికామ్
అకృతకపురప్రస్థానార్థం ప్రవేశయతి ప్రభుః" అని,
జ్వలనదివస జ్యోత్స్నాపక్షోత్తరాయణవత్సరాన్
పవన తపన ప్రాలేయాంశూన్ క్రమాత్ అచిరద్యుతిమ్ ।
జలధరపతిం దేవాధీశం ప్రజాపతి మాగతః
తరతి విరజాం దూరే వాచః తతః పరమద్భుతమ్ ॥

(భగవంతుడు, జీవుని దహరాకాశంలో నివసిస్తూ, బావిలో పడిన తన కుమారుని బయటకు తీయాలనే ప్రయత్నించిన తండ్రివలె, మనలను అంతిమ దశలో 101వ నాడియైన సుషుమ్నా నాడిలో పరమపదాన్ని చేరడం కోసం ప్రవేశింప చేస్తాడు. అగ్ని, దినం శుక్లపక్షం, ఉత్తరాయణం, సంవత్సరం - అనే వీని

అభిమాన దేవతలచే వాయువు, సూర్యుడు, చంద్రుడు, వరుణుడు, ఇంద్రుడు, ప్రజాపతి అనే వీరిచే సత్కరింపబడినవాడై, విరజన దాటి, వాక్కుకు అందని ఆపరమ పదాన్ని చేరుతాడు.) అని పలికారు.

అర్చిరాదిలో శ్రీపిళ్ళైలోకాచార్యులవారు కూడా విస్పష్టంగా ఈ అర్థాలను తెలిపారు కదా!

ప్రాప్తిపాదం :- ఈ పాదంలో అర్చిరాదిమార్గం ద్వారా పరమపదాన్ని పొందిన వాని పరిపూర్ణబ్రహ్మానుభవాన్ని, పునరావృత్తి లేకపోవడాన్ని శ్రీవ్యాసుల వారు నిరూపిస్తున్నారు.

ఈ గతివిశేషంద్వారా పయనించినవానికి పరిపూర్ణబ్రహ్మానుభవం కలిగే రీతి ఏమి? అని అంటే, **"అనైత్తులకు ముడైయ అరవిందలోచనై తినైత్త నైయుమ్ విడాళ్"** (లోకాలను అన్నిటిని తన సొత్తుగాగల పుండరీకాక్షుని పరాంకుశ నాయకి క్షణం కూడా విడువదు) ఇత్యాదులలో చెప్పబడినట్లే సర్వదేశసర్వకాల సర్వావస్థలలోను సర్వేశ్వరుని అనంతాలైన విగ్రహగుణవిభూతి లీలలో ఒక్కటికూడా కొఱత పడకుండా నిరతిశయభోగ్యంగా అనుభవిస్తాడు.

భగవత్ స్వరూపం భోగ్యంగా ఉండడం తగినది. సరే. మిగిలినవి కూడా భోగ్యంగా ఏ విధంగా ఉంటాయి? అని అంటే, రాజమహిషికి రాజు భోగ్యుడైతే, అతనికి అభిమతాలై, అతని భోగానికి ఉపయోపడే భోగోపకరణ భోగస్థానాలు మహిషికి అనుకూలంగా ఉండేటట్లే, వీటిలో, నిరతిశయానుకూల్య వల్ల పరమప్రాప్యమైనందున భగవత్ స్వరూపం పరమపదమనబడుతున్నది.

పరిపూర్ణ బ్రహ్మానుభవం భోగ్యతమంగా పొందడం ఒక సర్వోత్తరమైన స్థానవిశేషంలో (పరమపదంలో) కనుక, ఆ సర్వోత్తరస్థానం పరమపదమన బడుతున్నది.

ఈ అనుభవానికి ఆశ్రయమై, అనుభావ్యమైనందున భగవద్విభూతి రూపమై, జ్ఞానానందలక్షణమై వెలిగే స్వస్వరూపం పరమపదమనబడుతున్నది.

లీలావిభూతిలోని పదార్థాలు అనుభావ్యాలేనా? పిత్తరోగంతో బాధపడే వానికి ప్రతికూలమైన పాలు పిత్తం తగ్గితే అనుకూలం అయేటట్లే, సార్వభౌముడైన

తండ్రియొక్క చెఱసాల, చెఱలో ఉండే రాజకుమారునకు ఆ సమయంలో ప్రతికూలమై, రాజు అతనిని చెఱసాలనుండి బయటకు రప్పించి, యువరాజుగా చేసినపుడు ఆ చెఱసాలయే "ఇది తండ్రి సొత్తు" అనే భావనతో అనుకూల మయేటట్లుగా, లీలావిభూతిలోని వస్తువులు ముక్తునకు అనుభావ్యాలే. భగవత్ సంశ్లేషం లేకుండా తాను ఉన్నపుడు కర్మానుగుణంగా తనకు ప్రతికూలమైనది అల్పాను కూలంగా తోచి, ముక్తుడైన సకాలంలో అది నిరతిశయభోగ్యంగా తోస్తుంది. బంధకాలంలో ప్రతికూలంగాను, బంధనివృత్తికాలంలో అనుకూలం గాను ఉండేటట్లుగా కదా, భగవత్సంకల్పమున్నది. ఈవిధంగా కదా, ఒకే కాలంలో ఒకేవస్తువు భిన్నభిన్నాధి కారులకు అనుకూలంగాను, ప్రతికూలంగాను తోస్తుంది.

సర్వప్రకారవిశిష్టనారాయణుడు ప్రాప్యుడు- అనేది మూలమంత్రంలోను, ద్వయోత్తరవాక్యంలోను గల చతుర్థ్యంతపదాలతో చెప్పబడింది.

ముక్తునకు జగద్వ్యాపారం లేకపోయినా, కృషి చేసిన తండ్రి, నిర్వ్యాపారులైన అతని పుత్రాదులు కలసి కృషిఫలాన్ని భుజించేటట్లే, జగద్వ్యాపారంతో వచ్చే ఆనందం, సృష్టి చేసే ఈశ్వరునకు, చూచే ముక్తునకు సమానం. **"జగద్వ్యాపార వర్జమ్", "భోగమాత్రసామ్యలింగాచ్చ"** అని కదా సూత్రకారులు శ్రీవేదవ్యాసుల వారన్నారు.

శబ్దశక్తి లేకుండా ఉండగా, "భేదశ్రుతులు విరోధిస్తూ ఉండగా, సాయుజ్య శబ్దానికి ఐక్యమర్థమని తలచేవారికి "ముక్తుడు పరమసామ్యాన్ని పొందుతాడు" అని, **"తాదృగేవ"** అని పలికే శ్రుతులు విరోధిస్తాయి. **"మమ సాధర్మ్యమాగతాః"** అని గీతాచార్యుడు కూడా పలికాడు. ఈ రీతిలో సామ్యం కంఠోక్తం కనుక, ముక్తదశలో ఐక్యం తోచిన సందర్భాలలో అంతటా, **"రామసుగ్రీవయోరైక్యమ్"** ఇత్యాదులలో వలె, భేదశ్రుతికి అవిరోధంగా దానిని గ్రహించాలి. ముక్తుడు స్వతంత్రుడని అంటే- అతడు కర్మవశ్యుడు కాడని భావం. శ్రీవేదవ్యాసులు కూడా **"అత ఏవ చానన్యాధిపతిః" (4-4-9)** అని అన్నారు. ఇక్కడ **"అత్ర అనధిపతిరితి నోక్తమ్. కింతు, అనన్యాధిపతి రితి. అత్రాయమభిప్రాయః - స్వాభావిక శేషిణః**

పరమపురుషాదన్యో నాధిపతిః ముక్తస్య ఇతి" (ఇక్కడ - అనధిపతిః - అని చెప్పబడలేదు. అనన్యాధిపతిః - అని అనడంలో అభిప్రాయం ఏమంటే - సహజశేషి అయిన భగవంతుని కంటే వేఱొక శేషి ముక్తునకు లేడు - అని) అని కదా శ్రుతప్రకాశికావాక్యం. ఈశ్వరునకు ఛత్రచామరాదులవలె లక్షణంగా పల్కిన జగత్కారణత్వ - మోక్షప్రదత్వ - సర్వాధారకత్వ - సర్వనియంతృత్వ - సర్వసాక్షిత్వ- సర్వశరీరత్వ - సర్వశబ్ద వాచ్యత్వ - సర్వవేదవేద్యత్వ - లక్ష్మీసహాయత్వాదులు ప్రతినియతాలు. ముక్తునకు ఆధేయత్వ - విధేయత్వ- శేషత్వ - అణుత్వాలు వ్యవస్థితాలు. ఈ విధంగా భోగసామ్యమే ఐక్యం - అని గ్రహించాలి.

ప్రాప్తిపాదమైన ఈ పాదంలో ముక్తునకు స్వస్వరూపావిర్భావాన్ని ఫలంగా మొదటి అధికరణంలోను, పరమాత్మతో ఆనందంలో పరమసామ్యాపత్తిని అంతిమాధికరణంలోను శ్రీవ్యాసులు నిరూపిస్తున్నారు. ముక్తునకు అపునరావృత్తిని అంతిమసూత్రంతో నిరూపిస్తున్నారు. **"మీట్చి యిన్ది వైకున్ద మానకర్"** అని, **"నారణన్ తిణ్‌కழల్"** అని కదా ఆழ్వార్ల సూక్తి. **"అనావృత్తిః శబ్దాత్"** అనేది అంతిమసూత్రం. ముక్తునకు అపునారవృత్తిని తెలిపే ప్రమాణాలు మూడు శ్రీభాష్యకారులచే ఉదాహరింపబడ్డాయి. ఇక్కడ ప్రమాణమైన శబ్దం - శ్రుతి, స్మృతి అని రెండు విధాలు. ఇంతేకాక, సాక్షాత్తుగా అనావృత్తిని తెలిపేది - అని, అనావృత్తికి ఆక్షేపకమైన అర్థాన్ని తెలిపేది - అని రెండు విధాలు. **"స ఖలు"** అనే శ్రుతి, **"మాముపేత్య"** అనే స్మృతి అపునరావృత్తిని సాక్షాత్తుగా తెలిపే ప్రమాణాలు. **"ప్రియో హి"**-అనే స్మృతి అనావృత్తికి ఆక్షేపకమైన, భక్తుని భగవత్ప్రియత్వాన్ని తెలిపే ప్రమాణం. **"అత్యర్థ ప్రియం జ్ఞానినం లబ్ధ్వా"** అని శ్రీభాష్యకారులు **"చేతనలాభమ్ ఈశ్వరునుక్కు"** అనే సత్సంప్రదాయ తాత్పర్యార్థాన్ని వ్యక్తం చేశారు. **"గుహేన సహితో రామః, "గుహ మాసాద్య ధర్మాత్మా", "హనుమతా సంగతః" సుగ్రీవేణాభిసంగతః", "విభీషణేన ఆశు జగామ సంగమమ్", "అంకే భరత మారోప్య ముదితః"** అని కదా శ్రీరామాయణ నిష్కర్షమున్నది.

అధ్యాయం అంతా సూత్రఖండాభ్యాసం అధ్యాయసమాప్తిని తెల్పుతుంది. ఇక్కడ సూత్రాభ్యాసం శాస్త్రసమాప్తిని చూపుతుంది - అనేది శ్రీభాష్యసారం.

ఈ విధంగా మూలమంత్రంలోని తృతీయపదార్థమైన ఫలం నిరూపింప బడింది.

ఈ రీతిలో మొదటి రెండు అధ్యాయాలతో ప్రణవార్థాన్ని, మూడవ అధ్యాయంతో నమశ్శబ్దార్థాన్ని, నాల్గవ అధ్యాయంలో **"నారాయణాయ"** అనే శబ్దార్థాన్ని తెలియజేసినట్లయినది.

శ్రీవేదవ్యాసులు శారీరకమీమాంసాశాస్త్రంలో విశిష్టాద్వైతసిద్ధాంతాన్నే స్వసిద్ధాంతంగా నిశ్చయించిపలికారు.

సూక్ష్మచేతనాచేతనవిశిష్టబ్రహ్మం కారణమై, స్థూలచేతనాచేతన విశిష్ట బ్రహ్మం కార్యమై, కారణ - కార్యాలైనవిశిష్ట బ్రహ్మలకు ఐక్యం పల్కడమే విశిష్టాద్వైతసిద్ధాంతం. కారణ - కార్యాలకు నామభేదం, ఆకార భేదం, వ్యాపారభేదం ఉన్నా, వస్తుభేదం లేదు. కార్యకారణాలకు అనన్యత్వమే- అనే సత్కార్యవాదాన్ని స్థాపించి, అసత్కార్య వాదమైన వైశేషిక మతాన్ని, శ్రీవ్యాసుల వారు **"తదనన్యత్వమ్"** అనే ఆరంభణాధి కరణ సూత్రంలో ఖండించారు. పరమాత్మ, తాను నిర్వికారుడై, తనకు శరీరభూతమైన చేతనాచేతనమాత్రంలో సంకోచవికోచరూపవికారాలను జనింపజేస్తున్నాడు- అనేదానికి ఉపనిషత్తు **"యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ"** అని సాలెపురుగును దృష్టాంతంగా పల్కింది. తత్త్వత్రయంలో శ్రీపిళ్ళైలోకాచార్యుల వారుకూడా **"ఇవన్ తానే జగత్తాయ్ పరిణమిక్కైయాలే ఉపాదానమాయిరుక్కుమ్. ఆనాల్ నిర్వికారన్ - ఎన్నుమ్బడి ఎన్? ఎన్నిల్, స్వరూపత్తుక్కు వికారమ్ ఇల్లామైయాలే. ఆనాల్, పరిణామమ్ ఉణ్డాక్కుమ్బడి ఎన్? ఎన్నిల్, విశిష్టవిశేషణ సద్వారకమాక. ఒరు శిలన్దిక్కుణ్డాన స్వభావమ్ సర్వశక్తిక్కుక్కూడాదొழிయాదిదే"** అని పలికారు. తిరుమழிశై ఆழ్వార్లు కూడా **"కడల్ తన్నుళ్ళే తిరైన్దొழிన్ద అడఙ్గు కిట్ట"** అని సముద్రాన్ని దృష్టాంతంగా పలికారు. శ్రీపరాశరభట్టర్ - **"అనుశిఖిని శిఖీవ"** అని మగనెమలిని దృష్టాంతంగా పలికారు. మొదటి అధ్యాయంలో ప్రకృత్యధికరణంలో శ్రీవేద వ్యాసులు బ్రహ్మం యొక్క అభిన్ననిమిత్తోపాదనత్వాన్ని సిద్ధాంతీకరించారు. అంతేకాక, జీవవాచి శబ్దాలకు పరమాత్మ పర్యంతత్వాన్ని, ఔడులోమిమతాన్ని

పూర్వపక్షంగా చూపి, కాశకృత్స్నమతాన్ని కదా స్వసిద్ధాంతంగా ప్రదర్శించారు, వాక్యాన్వయధికరణంలో, శ్రీభాష్యకారులు. కాశకృత్స్నమతాన్ని, ఆశ్మరథ్య, ఔడులోమి మతాలకు ముందు పల్కనందున, కాశకృత్స్నమతానికి తరువాత ఏ మతాన్ని పలుకనందున, కాశకృత్స్న మతమే శ్రీవేదవ్యాససమ్మతమని శ్రీభాష్యశ్రుతప్రకాశకాదులలో చెప్పబడింది. శరీరాత్మభావంతో జీవవాచిశబ్దం పరమాత్మపరమనికదా, కాశకృత్స్నమతం. ఇదేకదా, విశిష్టాద్వైతమతం. ఇదేకదా, శ్రీవ్యాస సమ్మతం. మిగిలినవారి మతాల కంటే, స్వమతం విలక్షణమై ఉంటే, శ్రీవేదవ్యాసులు ఆ సందర్భంలోనే **"బాదరాయణః"** అని తమ నామాన్ని తప్పక నిర్దేశించి ఉంటారు. వేఱొక ఋషిమతం స్వసమ్మతమైతే, అక్కడ వ్యాసులు తమ నామాన్ని నిర్దేశించరు. అంతేకాక, ఏది సిద్ధాంతమో, దానిని చివరిగా చూపుతారు - అనేది కూడా శారీరకమీమాంసాప్రసిద్ధం. అందువల్ల కాశకృత్స్నమతమే వ్యాససమ్మతమని తెలిసింది.

ఇంతేకాక, విశిష్టాద్వైతసిద్ధాంత ప్రధానప్రమేయమైన బ్రహ్మసగుణత్వాన్ని జీవపరపారమార్థికభేదాన్ని, ధర్మధర్మిభేదాన్ని, జీవాత్మకే అజ్ఞాన సంబంధం- అనే విషయాన్ని, జీవాత్మకు జ్ఞానసంకోచవికాసాలే సంసారమోక్షాలు - అనే విషయాన్ని జీవకర్తృకపరమాత్మోపాసనమే మోక్షసాధనమనే విషయాన్ని, పరమాత్మానుగ్రహంతో జీవునకు మోక్షం - అనేదానిని, అదికూడా అర్చిరాదిమార్గం ద్వారా దేశవిశేష ప్రాప్తిపూర్వక - స్వస్వరూపావిర్భావ పూర్వక పరిపూర్ణబ్రహ్మానుభవం - అనే విషయాన్ని, పరునితో ఆనందసామ్యమే జీవునకు మోక్షమనే విషయాన్ని, అక్కడనుండి తిరిగి రావడమనేది లేదు - అనే విషయాన్ని శ్రీవేదవ్యాసులు శారీరకమీమాంసా శాస్త్రంలో పలుచోట్ల నిరూపించినందున, శ్రీవ్యాససమ్మతం విశిష్టాద్వైతమతమే - అనేది స్పష్టం.

బ్రహ్మం నిర్గుణం. అజ్ఞానం బ్రహ్మనిష్ఠం. సంసారమోక్షాలు అనేవి పరబ్రహ్మకు. ఐక్యజ్ఞానమే మోక్షహేతువు. ఇక్కడే ముక్తికి లభిస్తుంది - ఐక్యాపత్తి మోక్షం - అని కదా మాయావాదిమతం. ఇది శ్రీవేదవ్యాస సంమతం కాదు. ఈ రీతిలో, ఇది, శారీరక మీమాంసాశాస్త్రమైన బ్రహ్మసూత్రాధ్యాయ చతుష్టయంలో అంతర్గతం కాదు, ఉత్‌సూత్రమని తెలుస్తున్నది.

జగత్కారణమైన పరబ్రహ్మను ఉపాసించినవాడు భగవదనుగ్రహంతో అపునరావృత్తి లక్షణమోక్షాన్ని పొంది, పరిపూర్ణబ్రహ్మానుభవాన్ని పొంది, ఆనందమయునితో భోగమాత్రంతో పరమసామ్యాన్ని పొందుతున్నాడు. అని శ్రీవేదవ్యాసులు నాల్గు అధ్యాయాలను కల శారీరకమీమాంసాశాస్త్రంలో నిశ్చయించారు కనుక, "పరునితో జీవునకు స్వరూపపైక్యాపత్తియే మోక్షం" అనేవారి వాదం బ్రహ్మ సూత్రాలకు బాహ్యమని తెలిసింది.

"ఇతి సర్వం సమంజసమ్" అని శ్రీభాష్యంలోని చివరి వాక్యం. భేదశ్రుతి, అభేదశ్రుతి, ఘటకశ్రుతి, సగుణశ్రుతి, నిర్గుణశ్రుతి - అనే సర్వశ్రుతులు అవిరుద్ధార్థ ప్రతిపాదకాలు, ముఖ్యార్థయుక్తాలు - అని నిరూపింపబడినందున, సర్వశ్రుతి సామంజస్యం - అని దీని అర్థం. **"ఇతి"** అని అంటూ **"అఖిలభువన జన్మ"** అని ఆరంభించి చెప్పబడిన సర్వాన్ని పరామర్శిస్తున్నది. **"సర్వమ్"** అని, ఉదాహరింపబడని శ్రుతిస్మృతీతిహాసపురాణ వాక్యాలను పరామర్శిస్తున్నది. ఇన్నిటిని పూర్వం చూపిన దారిలో అన్వయించుకోవాలని దీని అభిప్రాయం.

తస్మై రామానుజార్యాయ నమః పరమయోగినే ।
యః శ్రుతిస్మృతిసూత్రాణా మంతర్జ్వర మశీశమత్॥

జయతి యతిరాజవాణీ ప్రతిభటసిద్ధాంతకృంతనకృపాణీ ।
శ్రుతియువతీనాం వాణీ దివ్యపదాంభోరుహభవ్యనిఃశ్రేణీ ॥

చండమారుతవేదాంతవిజయాదిస్వసూక్తిభిః ।
వేదాంత రక్షకాయాస్తు మహాచార్యాయ మంగళమ్ ॥

శ్రీవేంకటార్యశిష్యేణ వరదార్యేణ ధీమతా ।
శ్రీభాష్యసారో లిఖితః శ్రీవైష్ణవసతాం ముదే ॥

శ్రీభాష్యసారో వరదార్యవర్యైః రస్యార్థపూర్ణో రచితః ప్రబంధః ।
తం శింగరార్య ప్రమదాయ చక్రే విపశ్చితామాంధ్రగిరాదరేణ ॥

శ్రీభాష్యసారం ఆంధ్రానువాదం సంపూర్ణం

సంగతి నిరూపణం

మన సిద్ధాంతంలో అంగీకరింపబడిన సంగతులు 8. అవి ఏవి? అంటే (1) శాస్త్ర, (2) కాండ, (3) ద్విక, (4) అధ్యాయ, (5) పాద, (6) పేటికా, (7) అధికరణ, (8) సూత్రసంగతులు. సంగతి అంటే, అభిధాన - ప్రయోజన సంబంధం. ఉదాహరణం - సమన్వయాధ్యాయంలో విచారింపబడే వాక్యాలకు మధ్య ముందు వెనుకల అపేక్షితమైన సంబంధం సంగతి అనబడుతుంది. అనంతరాభిధాన ప్రయోజన సంబంధం - సంగతి అని తార్కికులు అంటారు. అది శాస్త్ర సంగతికి అన్వయించదు. శాస్త్రంలో సంగతియే తప్ప శాస్త్రాంతానికి తరువాత అనే అర్థం కూడదు కదా! కాండ సంగతి నుంచి ఆరంభించి అనంతరాభిధానం కుదురుతుంది. వాటిలోకూడా, కాండలో సంగతి, ద్వితంలో సంగతి, అధ్యాయంలో సంగతి - అని ఈవిధంగా సంగతి ఉన్నందున, అనంతరాభిధానమనేదే సంగతి కాదు. సూత్ర సంగతిని ప్రకృత్యధికరణం మొదలైన వానిలో శుతప్రకాశికాచార్యులవారు నిరూపించారు. అందువల్ల అధికరణ చింతామణిలో సూత్రసంగతితోపాటు ఎనిమిది విధాలైన సంగతులను కుమారగురు వరదాచార్యులవారు నిరూపించారు. సంగతుల పేర్లు వేరువిధంగా ఆరుగా చెప్పబడ్డాయి. అవి (1) ఆక్షేప సంగతి, (2) దృష్టాంత సంగతి, (3) ప్రత్యుదాహరణ సంగతి, (4) ఉపోద్ఘాతసంగతి, (5) అపవాద సంగతి, (6) ప్రసంగ సంగతి - అనేవి.

(1) పూర్వాధికరణంలో సిద్ధాంతం అనుపపన్నం - అని తరువాత అధికరణంలో పూర్వ పక్షం ప్రసక్తమైతే, అది ఆక్షేపసంగతి, (2) పూర్వాధికరణ సిద్ధాంత న్యాయాన్ని దృష్టాంతంగా చేసుకొని ఉత్తరాధికరణంలోని పూర్వ పక్షం ఏర్పడితే, అది దృష్టాంత సంగతి, (3) పూర్వాధికరణన్యాయం కానిది అని పూర్వపక్షం ఏర్పడితే, అది ప్రత్యుదాహరణ సంగతి, (4) ప్రకృతసిద్ధికోసం ముందు అధికరణ ఉపోద్ఘాత సంగతి, (5) పూర్వాధికరణ సిద్ధాంతన్యాయాన్ని అవలంభించి ఉత్తరాధికరణ పూర్వపక్షం ఏర్పడితే, అది అపవాద సంగతి, (6) పూర్వం పల్కిన దానికంటే వేరువిధంగా ఉపస్థితమైతే, అది ప్రసంగ సంగతి. ఇక అధికరణం అంటే - **"విషయోవిషయశ్చైవ పూర్వపక్షస్తథోత్తరమ్, సంగతిశ్చేతి పంచైతాన్ ప్రాంచోధికరణం విదుః"**

కొందరు (1) విషయం, (2) సంగతి, (3) సంశయం, (4) సంశయానికి కారణం - అని ఈ విధంగా పదివిధాలుగా అధికరణాలను నిష్కర్షించారు. వీటిని

అధికరణచింతామణి గ్రంథారంభంలో గమనించవచ్చు. ఈవిధంగా అయిదు, లేక, పది విధాలుగా అధికరణం నిరూపింపబడింది.

శ్రీభాష్యం - పేటికాసంగతి

శ్రీవేదవ్యాసులు అనుగ్రహించిన బ్రహ్మమీమాంసాశాస్త్రం శారీరక మనబడుతుంది. ఇందులోని అధికరణాలు 156. వీటిలోని పేటికా విభాగం పెద్దలచే ప్రదర్శింపబడింది. దానిని వివరంగా తెలిసికొందాం.

శారీరకం :- శారీరకం నాల్గు అధ్యాయాలను కల్గినది. ఈ నాల్గు పూర్వద్వికం, ఉత్తరద్వికం- అని రెండు పేటికలుగా విభాగింపబడ్డాయి.

పూర్వద్వికం (మొదటి రెండు అధ్యాయాలు) ఇది విషయద్వికమని, సిద్ధద్వికమని చెప్పబడుతున్నది. బ్రహ్మమనే భగవద్విషయాన్నిగూర్చి తెల్పుతున్నందున, బ్రహ్మమనే సిద్ధవస్తువును గూర్చి పల్కుతున్నందున ఈవిధంగా వ్యవహరింపబడుతున్నది.

ఉత్తరద్వికం (చివరి రెండు అధ్యాయాలు) విషయిద్వికమని, సాధ్యద్వికమని ఇది వ్యవహరింపబడుతున్నది. మూడవ అధ్యాయంలో బ్రహ్మవిద్య (ఉపాసనం) విచారింపబడుతున్నందున, నాల్గవ అధ్యాయంలో బ్రహ్మానుభవం తెలుపబడుతున్నందున ఈ విధమైన వ్యవహారం కల్గింది. బ్రహ్మమనే భగవద్విషయాన్ని గూర్చిన ఉపాసనం విషయి అవుతుంది. అది ప్రయత్నసాధ్యమే తప్ప, సిద్ధంకాదు. ఆ రీతిలోనే, బ్రహ్మానుభవంకూడా భగవద్విషయాన్ని గూర్చినది అయినందున అది విషయమే కాగలదు. విషయాన్ని గూర్చినది విషయి - జ్ఞానమని అర్థం. బ్రహ్మవిద్య, బ్రహ్మానుభవం- అనేవి జ్ఞానరూపాలే కదా. దేశవిశేషమైన పరమపదంలో అప్రాకృత విగ్రహాన్ని పొంది, పరిపూర్ణంగా పరబ్రహ్మను అనుభవించడం సాధ్యమే తప్ప, సిద్ధం కాదు. అందువల్ల ఉత్తరద్వికం విషయిద్వికమని, సాధ్యద్వికమని వ్యవహరింపబడుతున్నది. ఈ రీతిలో నాల్గు అధ్యాయాలలో పేటికా విభాగం చూపబడింది.

మొదటి అధ్యాయం సమన్వయాధ్యాయమని, రెండవ అధ్యాయం అవిరోధాధ్యాయమని, మూడవ అధ్యాయం సాధనాధ్యాయమని, నాల్గవ అధ్యాయం ఫలాధ్యాయమని వ్యవహారం.

పూర్వద్వికం : ప్రమేయత్వవ్యాపకకార్యతానిరూపితకారణత్వం - అనే అర్థమే పూర్వద్వికప్రతిపాద్యం. కారణత్వం పరబ్రహ్మ లక్షణమైనపుడు, అది అసంభవ-అతివ్యాప్తి రూపదోషాలు లేనిదై, ఫల్లణమై ఉండాలి. ముందు, శ్రుతివిప్రతిపత్తి ప్రయుక్త అసంభవశంక ఏర్పడుతుంది. (చిదచిద్విలక్షణమైన బ్రహ్మవస్తువు అనేది లేనే లేదు. అనే శంక ఏర్పడతుంది. (లక్ష్యాసంభవ ప్రయుక్తమైన లక్షణాసంభవశంక - లక్ష్యమనేదే లేనపుడు దానికి లక్షణమనేది ఉండనే ఉండదు కదా! - అనే శంక - అని అర్థం.) దానికి పరిహారాన్ని శ్రీవ్యాసులు మొదటి అధ్యాయంలో తెలియజేశారు. అదేవిధంగా శ్రుతివిప్రత్తి పత్తిప్రయుక్త అతివ్యాప్తిశంక ఏర్పడవచ్చు. (బ్రహ్మం జగత్కారణం కానీ, చేతనా చేతనాలు కూడా జగత్కారణం కానీ- అనే శంక ఏర్పడవచ్చు.) దానిని వ్యాసులు త్రిపాది - అంటే - మొదటి అధ్యాయంలోని రెండవ, మూడవ, నాల్గవ పాదాలలో తీర్చారు.

వాది విప్రతిపత్తి ప్రయుక్త అసంభవ అతివ్యాప్తిశంక ఏర్పడగా, దానిని వ్యాసులు రెండవ అధ్యాయంలోని పూర్వపాదద్వయంతో తీర్చారు.

కార్యత్వం ప్రమేయత్వవ్యాపకం. అంటే - ఏ ప్రమేయమైనా బ్రహ్మకార్యమే - అని రెండవ అధ్యాయంలోని ఉత్తరపాదద్వయంతో నిరూపించారు.

ఈవిధంగా మొదటి రెండు అధ్యాయాలతో (పూర్వద్వికం) చిదచిద్విలక్షణమైన బ్రహ్మం జగదేక కారణమని నిశ్చయించారు.

ప్రథమాధ్యాయం :

ప్రథమాధ్యాయానికి సమన్వయాధ్యాయమని పేరు. వేదాంతాలలో జగత్కారణ వస్తువును నిర్దేశించే వాక్యాలు కారణవాక్యాలనబడతాయి. వాటికి చిదచిత్ విలక్షణ బ్రహ్మంలో సమీచీనమైన అన్వయాన్ని తెలిపే అధ్యాయం కనుక, మొదటి అధ్యాయానికి సమన్వయాధ్యాయమని పేరు. అంటే- కారణవాక్య విచారాన్ని చేసి, ఈ వాక్యాలు చిదచిద్విలక్షణమైన పరబ్రహ్మనే జగత్కారణంగా పల్కుతున్నాయి; చేతనవస్తువును గాని, అచేతనవస్తువును గాని జత్కారణంగా ఈ వాక్యాలు తెలుపవు- అని వ్యాసులు నిశ్చయించి తెలిపారు.

ప్రథమాధ్యాయం మొదటిపాదం - అయోగవ్యవచ్ఛేదపరం, తరువాత గల మూడు పాదాలు (త్రిపాది) అన్యయోగవ్యవచ్ఛేదపరాలు- అని ఇచటి పేటికావిభాగం.

యోగమంటే సంబంధం. ఇక్కడ అది కారణత్వసంబంధం. అయోగం-కారణత్వాసంబంధం. దానిని మొదటి పాదం వ్యవచ్ఛేదం చేస్తున్నది. అంటే - బ్రహ్మానికి జగత్కారణత్వం లేదు- అనేది లేదని భావం. బ్రహ్మం జగత్కారణమే - అని మొదటి పాదంలో స్థాపింపబడుతున్నది.

జగత్కారణంగా పరబ్రహ్మమనే వస్తువు ఒకటి ఉన్నదని స్థాపింపబడు తున్నది - అని భావం.

బ్రహ్మం కంటే వేఱయినదానికి కారణత్వం లేదు- అనే అర్థం త్రిపాదిసారం. అన్యత్ర - వేఱొకచోట- యోగాన్ని వ్యవచ్ఛేస్తున్నది, త్రిపాది. బ్రహ్మమే జగత్కారణం- అని భావం. దీనివల్ల జగత్కారణత్వరూపమైన బ్రహ్మలక్షణానికి అతివ్యాప్తిరూప దోషం లేదని చెప్పబడినట్లయినది.

చిదచిద్విలక్షణమైన బ్రహ్మం -అనే తత్త్వమే లేదు- అనేది ప్రథమపాదంలోని పూర్వపక్షం. అందువల్ల నిఖిల వేదాంతవాక్యాక్షేపం మొదటి పాదంలో చేయబడింది. ఇదే అసంభవదోషశంక. లక్ష్యాసంభవప్రయుక్త లక్షణాసంభవ శంక - అని పెద్దలంటారు (లక్ష్యమే లేనపుడు దాని లక్షణమనేది ఉండదు కదా- అనేది ఈ శంక) దీనిని వ్యాసులు మొదటి పాదంలో నిరసిస్తున్నారు. చిదచిద్విలక్షణమైన బ్రహ్మమనే జగత్కారణవస్తువు ఉన్నది- అని ముందు స్థాపిస్తున్నారు. అందువల్ల ప్రథమపాదం అసంభవ శంకాపరిహారపరం. తరువాత గల త్రిపాది అతివ్యాప్తి శంకా పరిహారాన్ని చేస్తున్నది. అంటే- త్రిపాదిలో అన్యయోగ వ్యవచ్ఛేదం చేయబడుతున్నది. బ్రహ్మం వేదాంతవేద్యం అయినా, ఈ వేదాంతవాక్యవిశేషాలు బ్రహ్మభిన్నతకూడా జగత్కారణంగా పల్కు తున్నాయి - అని వాక్యవిశేషాన్ని పురస్కరించుకొని ఆక్షేపం చేయగా, దానిని త్రిపాదిలో పరిహరిస్తున్నారు. ఆ వాక్యవిశేషాలు చిదచిత్ విలక్షణబ్రహ్మపరాలే -అని త్రిపాదిలో నిర్ణయింపబడుతున్నదని అర్థం. త్రిపాదిలో (మొదటి అధ్యాయం- నాల్గవ పాదం- ప్రథమాధికరణంలో) **"ఆనుమానికమపి"** అని **"అపి"** శబ్ద ప్రయోగాన్ని చేసే వ్యాసుల అభిమతం ఇదే- అని తెలుస్తున్నది. ఆనుమానికం (ప్రకృతి) జగత్కారణం కావచ్చుకదా- అనే ఆక్షేపం రాగా, దానిని నిరసిస్తున్నారని భావం. ప్రథమపాదంలోని త్రిపాదివిభాగం. ఈరీతిలోనిది, ఇది ప్రాయికం.

జీవాదిలింగాలు అస్పష్టతరాలుగా ఉండే కారణవాక్యాలను మొదటి అధ్యాయం లోని మొదటిపాదంలో విచారించి, జీవాదిలింగాలు అస్పష్టాలుగా ఉండే కారణ

వాక్యాలను, మొదటి అధ్యాయం రెండవ పాదంలో విచారించి, అవి స్పష్టాలైన కారణవాక్యాలను ప్రథమాధ్యాయంలోని మూడవ పాదంలో విచారించి, అవి స్పష్టతరాలుగా ఉండే కారణవాక్యాలను మొదటి అధ్యాయం నాల్గవ అధ్యాయంలో విచారించి, అవి చిదచిత్ పరాలు కావు, అవి చిదచిద్విలక్షణ బ్రహ్మపరాలే- అని శ్రీవ్యాసులు సిద్ధాంతీకరిస్తున్నారు - అని కూడా చెప్పవచ్చు. ఈ విధంగా ప్రథమాధ్యాయంలోని 35 అధికరణాలలో మొదటి 4 అధికరణాలు ఉపోద్ఘాతమని, తరువాత 31 అధికరణాలలో చిదచిద్విలక్షణ పరబ్రహ్మమే జగత్కారణమని నిరూపిస్తున్నాయి- అనేది పేటికావిభాగం.

ప్రథమాధ్యాయం ద్వితీయపాదంలో - జగత్తు పరబ్రహ్మకు శరీరమనే వాక్యాలను, మొదటి అధ్యాయం మూడవ పాదంలో - జగత్తుకు పరబ్రహ్మ ఆత్మ- అని పలికే వాక్యాలను, మొదటి అధ్యాయం నాల్గవ పాదంలో సాంఖ్యాది పక్షభ్రాంతి జనక వాక్యాలను విచారించి, పరబ్రహ్మ పరత్వస్థాపనాన్ని చేస్తున్నారని కూడా చెప్పవచ్చు.

ప్రథమాధ్యాయం ప్రథమపాదంలో - చిదచిద్విలక్షణ పరికరణభూత పరమ పరమపురుష నిర్ణయం, రెండవ పాదంలో - జగచ్ఛరీరత్వం, మూడవ పాదంలో జగదాత్మత్వం చెప్పబడ్డాయి. నాల్గవ పాదంలో - అతత్కార్యమై, అతచ్ఛరీరమై అతదాత్మకమైనది ఏ వస్తువు లేదు అని తెలియజేస్తున్నారు. బ్రహ్మైక కారణత్వస్థిరీకరణం నాల్గవ పాదంలో చేయబడింది - అని ఈవిధంగా పల్కడం కూడా సాంప్రదాయికమే.

ఇది పాద - త్రిపాది పేటికావిభాగం.

ప్రథమాధ్యాయం - ప్రథమపాదం

ఈ పాదంలో 11 అధికరణాలున్నాయి. ఇవి 4+7=11 అని, 4+3+4=11 అనే గణనలో కూడి ఉన్నాయి.

మొదటి నాల్గు అధికరణాలు (జిజ్ఞాసాధికరణ, జన్మాద్యధికరణ, శాస్త్రయోనిత్వాధికరణ, సమన్వయాధికరణాలు) అనే నాల్గు ఉపోద్ఘాతం. తరువాత ఏడు అధికరణాలలో చిదచిద్విలక్షణమైన పరబ్రహ్మను జగత్కారణంగా నిరూపించారు- అనేది ఇక్కడి పేటికావిభాగం.

మొదటి నాల్గు అధికరణాలతో కూడిన ఉపోద్ఘాత ప్రకరణాన్ని 2+2=4 అనే రీతిలో రెండు విభాగాలుగా విభజించవచ్చు.

వేదాంతవాక్యాలు బ్రహ్మవిషయక ప్రతీతిని కల్గించవు- అనే శంకను మొదటి రెండు అధికరణాలు తీరుస్తున్నాయి. వేదాంతం వల్ల బ్రహ్మప్రతీతి కల్గినా, వేదాంతాలకు బ్రహ్మను ప్రతిపాదించడంలో తాత్పర్యం లేదు- అనే శంకను తరువాత రెండు అధికరణాలు తీరుస్తున్నాయి - అనేది ఇక్కడి పేటికావిభాగం.

మొదటి అధికరణంలో లక్ష్యవిచారాన్ని గూర్చిన ప్రతిజ్ఞను చేశారు. రెండవ అధికరణంలో లక్ష్యానికి లక్షణాన్ని విచారిస్తున్నారు. మూడవ అధికరణంలో లక్షణవిషయక శంకను పరిహరిస్తున్నారు. నాల్గవ అధికరణంలో లక్ష్యవిషయ శంకను తీరుస్తున్నారు - అని చతుఃసూత్రీప్రకరణం ఉపోద్ఘాతం. ఈ రీతిలో లక్ష్యవిచార ప్రతిజ్ఞను చేసిన వ్యాసుడు ఇక తరువాత లక్ష్యమైన పరబ్రహ్మను గూర్చి విచారిస్తున్నారు.

తరువాత గల 7 అధికరణాలను 2+5=7 అని, 3+4=7 అని రెండు రీతులలో విభాగించవచ్చు.

ఎ) మొదటి రెండు అధికరణాలలో (ఈక్షత్యధికరణ, ఆనందమయాధికరణాలలో) శాస్త్రయోనిత్వాధికరణ, సమన్వయాధికరణ సిద్ధమైన అనుమానాద్యగమ్య దుఃఖా సంస్పృష్టబ్రహ్మం అనేది ప్రకృతి పురుషవిలక్షణం - అని స్థాపింపబడుతున్నది. అనుమాన గమ్యదుఃఖసంస్పృష్టులైనవారు కదా, ప్రకృతిపురుషులు. తరువాత గల 5 అధికరణాలతో ప్రకృతి పురుషవిశేషవైలక్షణ్యం స్థాపింపబడుతున్నది - అనేది ఇక్కడి ఒక విధమైన పేటికావిభాగం.

బి) లేక, మొదటి మూడు అధికరణాలలో (ఈక్షత్యధికరణ- ఆనందమయాధికరణ - అంతరధికరణాలలో) సదాదిసామాన్యశబ్దఘటితాలైన కారణవాక్యాలు ప్రకృతిపురుష విలక్షణకారణ బ్రహ్మపరాలుగా నిశ్చయింపబడుతున్నాయి.

తరువాత, ఆకాశాధికరణంనుండి ఆరంభించి 4 అధికరణాలలో ఆకాశప్రాణాది విశేషశబ్దఘటితవాక్యాలు చిదచిత్ విలక్షణబ్రహ్మపరాలని స్థాపింపబడుతున్నాయి- అనికూడా చెప్పవచ్చు.

లేక, మొదటి మూడు అధికరణాలలో కారణవాక్యాలతో ఏర్పడే సందేహం పరిహరింపబడుతున్నది; అంటే - సంశయజనకవాక్యాలకు అర్థనిర్ణయం చేయబడు

తున్నది - అని అర్థం. తరువాత నాల్గు అధికరణాలలో కారణవాక్యాలతో ఏర్పడే విపరీతజ్ఞానం పరిహరింపబడుతున్నది; అంటే - విపర్యయ జ్ఞానజనకవాక్యాలకు సదర్థస్థాపనం చేయబడుతున్నది - అని అర్థం.

ఈక్షత్యధికరణంలో అచిద్విలక్షణమైన బ్రహ్మం జగత్కారణమని, ఆనంద మయాధికరణంలో చిద్విలక్షణమైన బ్రహ్మం జగత్కారణమని, అంతరధి కరణంలో అది దివ్యమంగళ విగ్రహ విశిష్టమైనది - అని నిర్ణయింపబడింది.

ఆనందమయాధికరణంలోని మొదటి సూత్రంతో పరబ్రహ్మ జీవసామాన్య విలక్షణమని, అయిదవ సూత్రంతో పరబ్రహ్మ ముక్తజీవ విలక్షణమని వ్యాసులు తెలిపారు. ఈక్షత్యధికరణంలో బ్రహ్మాన్ని **"తన్నిష్ఠస్య మోక్షోపదేశాత్"** అని మోక్షోపాయంగా, ఆనందమయాధికరణంలో బ్రహ్మం ముక్తప్రాప్యం, పరమానంద మయమని స్థాపించారు. ఈక్షత్యధికరణంలోని పూర్వపక్షంతో చేరినవారిని కారణత్వాధి కరణంలో **(1-4-4)**, ఆనందమయాధికరణ పూర్వపక్షితో చేరినవారిని జగద్వాచిత్వాధి కరణంలో **(1-4-5)** వ్యాసులు నిరసించారు.

ఈక్షత్యధికరణంలో బ్రహ్మం సర్వజ్ఞమని, ఆనందమయాధికణంలో బ్రహ్మం ప్రచురానంద విశిష్టమని, అంతరధికరణంలో బ్రహ్మం అమలమని స్థాపించిన వేదవ్యాసులు, బ్రహ్మం ఉభయలింగ విశిష్టమని స్థాపించారు. పరమాత్మకు అసాధారణం ఉభయలింగాలు. ఇవి, అఖిలహేయ ప్రత్యనీకత్వం, కల్యాణైక తానత్వాలు. ఇవి బ్రహ్మానికి అసాధారణాలు. చేతనాచేతనాలకు అసంభావితాలు. అందువల్లనే బ్రహ్మం నిఖిలచేతనాచేతన విలక్షణమని చెప్పబడుతున్నది.

తరువాత నాల్గు అధికరణాలను (ఆకాశాధికరణాది చతుష్టయాన్ని) **(2+2=4** అనే క్రమంలో) రెండు పేటికలుగా విభాగించవచ్చు.

ఆకాశప్రాణాధికరణాలు రెండిటిలో, ఆకాశప్రాణశబ్దాలకు రూఢ్యర్థాన్ని విడచి, యౌగికార్థాన్ని గ్రహించి, ఆయా శబ్దాలు విలక్షణ బ్రహ్మపరాలుగా నిర్ణయింప బడ్డాయి. జ్యోతిరధికరణ, ఇంద్రప్రాణాధికరణాలు రెండిటిలో, ఆయా శబ్దాలకు రూఢిభంగం లేకుండానే తత్తత్‌రూఢ్యర్థవిశిష్ట బ్రహ్మపరాలుగా అర్థనిర్ణయం చేయబడింది.

లేక, ఆకాశప్రాణాధికరణాలు రెండిటిలో కారణవాక్యగతాలైన ఆకాశ ప్రాణశబ్దా లకు విలక్షణబ్రహ్మపరత్వం స్థాపితం - అనికూడా చెప్పవచ్చు.

జ్యోతిరధికరణ, ఇంద్రప్రాణాధికరణాలలో అయితే ఈ విధంగా కాదు. సాక్షాత్ కారణవాక్యాలు అక్కడ విచారింపబడలేదు. కారణత్వవ్యాప్తలింగాలు, అంటే, నిరతిశయ దీప్తిమత్వం, ముముక్షూపాస్యత్వం - అనే ఇవి ఉండే చోటనే కారణత్వం ఉన్నది- అని అర్థం. తాదృశ (అటువంటి) లింగప్రతిపాదక వాక్యాలలో ఉండే జ్యోతిచ్ఛబ్ద - ఇక్కడ ఇంద్రశబ్దాలు విలక్షణ బ్రహ్మపరాలని ఇక్కడ స్థాపింపబడుతున్నాయి. ఇక్కడ ఇంద్రశబ్దమనేది - ఇంద్రుడు తనను నిర్దేశించి **"మాముపాస్వ"** పల్కిన **"మామ్"** అనే శబ్దం - అని అర్థం.

ఎ) లేక, ఆకాశాధికరణంలో వస్త్వంతర ప్రసిద్ధమైన ఆకాశశబ్దాన్ని గ్రహించి (శబ్ద విశేషాన్ని పురస్కరించుకొని - అని అర్థం) అచేతనమే జగత్కారణమని ఆక్షేపం రాగా, అర్థవిరోధాన్ని చూపి, ఆకాశశబ్దం అచిద్విలక్షణ పరబ్రహ్మపరమని అన్నారు.

బి) ప్రాణాధికరణంలో - అర్థవైరుధ్యం లేదని చూపి, అచేతనమే జగత్కారణం- అని పూర్వపక్షి వాదించగా, దానిని కూడా అర్థవిరోధ సద్భావాన్ని చూపి వ్యాసులు పరిహరించారు.

సి) జ్యోతిరధికరణంలో విరోధిలింగం లేకపోవడం, అల్పానుకూలమైన లింగ సద్భావం - అనే వీనిని గ్రహించి ఆక్షేపం రాగా, దానిని , "స్వవాక్యంలో విరోధం లేక పోయినా, ఉపక్రమవాక్యంలో విరోధమున్నది" అని పల్కి, ఆ ఆక్షేపాన్ని పరిహరించారు.

ఇంద్రప్రాణాధికరణంలో- ఉపక్రమంలోనే విరోధం లేదని పల్కి పూర్వపక్షి ఆక్షేపించగా, దానిని, అర్థవిరోధమున్నదని పల్కి, వ్యాసులు పరిహరించారు.

ఈవిధంగా చిదచిద్విలక్షణ స్వభావాన్ని స్థాపించిన వ్యాసులు, మొదటి పాదంలో లక్ష్యసంభవప్రయుక్తలక్షణాసంభవశంకను పరిహరించారు - అని తెలుస్తున్నది.

ప్రథమాధ్యాయం - ద్వితీయపాదం :

ఈ పాదంలోని అధికరణాలు-6. వీనిని **3+3=6** అని విభాగించవచ్చు.

మొదటి మూడు అధికరణాలలో ఉపాసకహృదయరూపపరిమితదేశ పరిచ్ఛిన్నమైన (ఉపాసకుని హృదయమనే పరిమితమైన దేశంలో ఉండే) పరమాత్మ యొక్క విచారాన్ని, తరువాత మూడు అధికరణాలలో విపుల దేశస్థితమైన పరమాత్మ యొక్క విచారాన్ని వ్యాసులు చేశారు - అనేది పేటికా విభాగం.

ఈ ఆఱు అధికరణాలకు సాధారణార్థం ఏమంటే- ఆత్మ, పురుష శబ్దాలు చిదచిద్విలక్షణ పరమాత్మ పరాలు- అని స్థాపించడమే.

ప్రథమాధ్యాయం - తృతీయపాదం :

ఈ పాదంలోని అధికరణాల సంఖ్య-10. వీనిని 7+3 = 10 అని విభాగం చేయవచ్చు.

మొదటి ఏడు అధికరణాలు సాక్షాత్ సంగతాలు. మధ్యలో మూడు అధికరణాలు (దేవతాధికరణ, మధ్వధికరణ, అపశూద్రాధికరణాలు) ప్రాసంగికాలు.

ఆఱవ అధికరణమైన ప్రమితాధికరణంలో చెప్పబడిన సర్వేశ్వరత్వాన్ని, పదవ అధికరణమైన అర్థాంతరత్వ వ్యపదేశాధికరణం, మోక్షప్రదత్వాన్ని తెలియజేయడం ద్వారా ఉపపాదిస్తున్నది. అందువల్ల, ఆఱవ అధికరణానికి, పదవ అధికరణానికి సాక్షాత్ సంగతి ఉన్నది. మధ్యలో ఉండే 7, 8, 9 అధికరణాలు మూడు ప్రాసంగికాలు. పదవ అధికరణంలోని మూడవ సూత్రంతో పరమాత్మ- జీవసామాన్య విలక్షణుడని, నాల్గవ సూత్రంతో పరమాత్మ - ముక్త జీవవిలక్షణుడని తెలుపబడడం నిశితంగా గమనించాలి.

ప్రాసంగికాలైన మూడు అధికరణాలలోను భగవద్గుణాలే తెలుపబడ్డాయి. శారీరకమే బ్రహ్మమీమాంసకదా! అందువల్ల, ఎక్కడ ఉన్నా అతడు గుణపూర్ణుడే. దేవతల అభ్యుపాస్యత్వం - దేవతాధికరణంలోను, వసుముఖ, దేవాదులకు స్వాత్మత్వేన ఉపాస్యత్వం- మధ్వధికరణంలోను, శూద్రాదుల అనుపాస్యత్వం- అపశూద్రాధి కరణంలోను తెలుపబడ్డాయి.

దేవతాధికరణంలో దేవాదులకు భగవంతుడు ఉపాస్యుడు - అని చెప్పబడ్డాడు. దేవాదిశబ్దంలోని ఆది పదంచేత అసుర, రాక్షస, గంధర్వ - పిశాచాలు గ్రాహ్యాలు - అని పెద్దల సూక్తి. శ్రీప్రహ్లాదాదులు అసురులు, శ్రీవిభీషణాదులు రాక్షసులు, చిత్రసేనాదులు గంధర్వులు, ఘంటాకర్ణాదులు పిశాచాలు. వీరికి కూడా పరమాత్మ ఉపాస్యుడు - అని అర్థం.

ప్రథమాధ్యాయం- నాల్గవ పాదం :

ఈ పాదంలోని అధికరణాలు-8. వీనిని 6+2=8 అనే విధంగా విభాగించవచ్చు. మొదటి ఆఱు అధికరణాలలో సాంఖ్యపక్ష ప్రతిక్షేపం, ఆపైన గల రెండు అధికరణాలలో యోగపక్షప్రతిక్షేపం - అనేది పేటికా విభాగం.

ఎనిమిదవ అధికరణమైన చివరి అధికరణం - పూర్వం చెప్పబడిన పాదచతుష్ట యార్థానికి నిగమనం (ముగింపు) అని కొందఱు పెద్దలు పలికారు.

ఈ పాదంలోని కారణత్వాధికరణంలో ఈక్షత్యధికరణార్థాన్ని శ్రీవ్యాసులు సింహావలోకనన్యాయంలో పరామర్శించి, స్థాపించారు - అని తెలియాలి. జగద్వాచిత్వాధి కరణంలో, అశుద్ధజీవవిలక్షణుడు పరమాత్మ- అని, వాక్యాన్వ యాధికరణంలో, ముక్త (శుద్ధ) జీవవిలక్షణుడని వ్యాసులు పలికారని గ్రహించాలి.

వ్యాసులు, మొదటి అధ్యాయంలోని - మొదటిపాదంలో ప్రమాణలక్షణాలతో పరమకారణంగా సర్వవేదాంతవేద్యపరమపురుష నిర్ణయంచేశారు. రెండవ, మూడవ పాదాలతో జగత్తుకు, పరబ్రహ్మకు మధ్య ఉండే సంబంధాన్ని తెలిపారు. నాల్గవ పాదంతో పరపక్షప్రతిక్షేపాన్ని చేశారు - అనికూడా చెప్పవచ్చు.

మొదటి మూడు పాదాలతో చెప్పబడిన పరబ్రహ్మయొక్క కారణత్వాన్ని నాల్గవ పాదంలో సూత్రకారులు రక్షించారు - అని భావం.

ఈ రీతిలో మొదటి అధ్యాయంలోని నాల్గు పాదాలు 1+3=4అని, 3+1=4 అనే రీతిలో రెండు విధాలుగా విభాగించవచ్చునని తెలుస్తున్నది.

ద్వితీయాధ్యాయం

ప్రథమాధ్యాయంలో శ్రుతివిప్రతిపత్తి పరిహారం చేయబడింది. రెండవ అధ్యాయంలో వాదివిప్రతిపత్తి పరిహారం చేయబడుతున్నదని గ్రహించాలి.

లేక, సేశ్వరతంత్రస్థాపనాన్ని మొదటి అధ్యాయంలోను, నిరీశ్వరతంత్ర నిరాకరణాన్ని ద్వితీయాధ్యాయంలోను చేయబడుతున్నదని కూడా చెప్పవచ్చు.

ప్రథమాధ్యాయంలో చెప్పబడిన పరబ్రహ్మంయొక్క జగత్కారణత్వం, రెండవ అధ్యాయంలో స్థూణానిఖనన న్యాయంతో స్థిరీకరింపబడుతున్నది. ఈ అధ్యాయానికి అవిరోధాధ్యాయమని పెద్దలు పేరు పెట్టారు.

ఈ అధ్యాయంలోని పాదాలు నాల్గింటిని 2+2=4 అని రెండు పేటికలుగా గ్రహించవచ్చు. స్మృతులతో, తర్కాలతో బ్రహ్మంయొక్క జగత్కారణత్వాన్ని ప్రతివాదులు నిరోధించగా, ఆ నిరోధాన్ని పరిహరించి, బ్రహ్మంయొక్క కారణత్వాన్ని

మొదటి రెండు పాదాలు (స్మృతి, తర్కపాదాలు) స్థిరీకరిస్తున్నవి. ఇది బాహ్యవిరోధ పరిహారమని గ్రహించాలి.

బ్రహ్మకు కార్యం కానిది కూడా ఉన్నది - అనే వాదాన్ని పరిహరించి, సర్వం బ్రహ్మకార్యం అని తెల్పి, బ్రహ్మం యొక్క సర్వకారణత్వాన్ని తరువాత రెండు పాదాలు (వియత్ పాద, ప్రమాణపాదాలు) స్థిరీకరిస్తున్నాయి. ఇది ఆంతరవిరోధ పరిహారమని గ్రహించాలి.

లేక, బ్రహ్మానికి అసలు కారణత్వమే లేదు - అనే వాదాన్ని మొదటి రెండు పాదాలతో నిరసించి, ఆ కారణత్వం ప్రాదేశికమే తప్ప సార్వత్రికం కాదు - అనే వాదాన్ని తర్వాత రెండు పాదాలతో నిరసిస్తున్నారని కూడా చెప్పవచ్చు.

అంటే, కారణవిషయంలో ఇతరులు పల్కిన దోషాలను మొదటి రెండు పాదాలతో పరిహరించి, కార్యవిషయంలో ఇతరులు పల్కిన దోషాలను తర్వాత రెండు పాదాలతో పరిహరిస్తున్నారని భావం.

ద్వితీయాధ్యాయం- మొదటి రెండు పాదాలు :

స్వపక్షంలో ఇతరులచే ఆరోపింపబడిన దోషాలను మొదటి పాదంలో వ్యాసులు పరిహరిస్తున్నారు. ఇతరుల పక్షాలలోని దోషాలను రెండవ పాదంలో ఎత్తి చూపు తున్నారు.

స్వపక్షస్థాపనం మొదటి పాదంలో, పరపక్షనిరాకరణం ద్వితీయ పాదంలో వ్యాసులచే చేయబడుతున్నది.

మొదటి పాదంలో - స్మృత్యుక్తవిరోధపరిహారం, రెండవ పాదంలో శాస్త్రాంతర విరోధపరిహారం చేయబడుతున్నాయి.

మొదటి పాదంలో - స్మృతిన్యాయాలతో వేదాంతాలకు కలిగే విరోధం తీర్చబడు తున్నది. రెండవ పాదంలో - శారీరకన్యాయంతో పరపక్షాలకు విరోధం తెలుపబడు తున్నది.

ద్వితీయాధ్యాయం - ప్రథమపాదం (స్మృతిపాదం)

ఈ పాదంలోని అధికరణాల సంఖ్య 10. వీనిని 2+8=10 అనే రీతిలో విభాగించవచ్చు.

వ్యాసులు, మొదటి రెండు అధికరణాలలో స్మృతివిచారాన్ని చేసి, తర్వాత అధికరణాలలో యుక్తివిచారాన్ని చేస్తున్నారు. స్మృత్యుపక్రమాన్నిబట్టి దీనికి స్మృతిపాదమనే పేరు వచ్చింది. ఈ పాదం స్మృతి విచారప్రధానమైనది. దీనిలోని మొదటి రెండు అధికరణాలలో స్మృతి విరోధి పరిహారాన్ని, తరువాతగల ఎనిమిది అధికరణాలలో యుక్తివిరోధపరిహారాన్ని చేసినందున ఫలించినది ఏమంటే- బ్రహ్మం యొక్క జగదుపాదానకారణత్వం, జగన్నిమిత్తకారణత్వం అనేవి ఫలించాయి - అని పెద్దలంటారు. ఉపసంహారదర్శన ప్రయోజనవత్వాధికరణాలలో (8వ, 10వ అధికరణాలలో) నిమిత్త కారణత్వస్థాపనం, శిష్టాపరిగ్రహాధికరణంలోను (4వ అధికరణంలో), భోక్త్రాపత్త్యాధికరణంలోను (5వ అధికరణంలో) ఉభయస్థాపనం, మిగిలిన 1, 2, 3, 6, 7, 9 అధికరణాలలో ఉపాదానత్వ స్థాపనం చేయబడిందని తెలియాలి.

మొదటి ఆఱు అధికరణాలలో బ్రహ్మం యొక్క జగదుపాదాన కారణత్వంలో విరోధపరిహారం, తర్వాత నాల్గు అధికరణాలలో బ్రహ్మంయొక్క జగన్నిమిత్త కారణత్వ విరోధపరిహారం చేయబడిందనే పేటికావిభాగాన్ని గ్రహించాలి.

ద్వితీయాధ్యాయం - ద్వితీయపాదం (తర్కపాదం)

ఈ పాదంలోని అధికరణాల సంఖ్య 8. దీనిని 1+6+1=8 అని విభాగించవచ్చు.

మొదటి అధికరణంలో - ప్రధాన (ప్రకృతి) కారణవాదియైన సాంఖ్యుని నిరసించి, తర్వాత ఆఱు అధికరణాలలో పరమాణుకారణవాదులైన వైశేషిక, బౌద్ధజైన శైవులను నిరసించి, ఎనిమిదవ అధికరణంలో చిదచిద్విలక్షణమైన బ్రహ్మంయొక్క జగదేక కారణత్వాన్ని ప్రతిపాదించే శ్రీపాంచరాత్రం పరమ ప్రమాణం - అని పంచమవేద సారమైన మహాభారతాన్ని అనుగ్రహించిన శ్రీవేదవ్యాసులు స్థాపిస్తున్నారు.

ఈ పాదసూత్రాలు నజ్ఘటితాలుగా ఉన్నాయి. దీనినిబట్టి ఈ పాదం పరపక్షప్రతిక్షేపకమని చెప్పవచ్చు.

7+1=8 అనే రీతిలో కూడా ఈ పాదంలోని అధికరణాలను విభాగించవచ్చు. ఏడు అధికరణాలలో పరమతఖండనాన్ని చేసిన వ్యాసులు, ఎనిమిదవ అధికరణంలో శ్రీపాంచరాత్రప్రామాణ్యాన్ని స్థాపించి, దానిని భూషించారు.

మొదటి అధికరణంలో సాంఖ్యమతం, రెండవ అధికరణంలో వైశేషిక మతం ఖండింపబడ్డాయి.

ద్రవ్యం, అవస్థ - రెండు నిత్యాలు - అని సాంఖ్యులు అంటారు. రెండూ అనిత్యాలు - అని వైశేషికులన్నారు. (ఈశ్వరుడు అధిష్ఠించని) ప్రధానమే కారణమని సాంఖ్యవాదం.

వైశేషికుడు నిమిత్తమాత్ర ఈశ్వరాధిష్ఠిత పరమాణుకారణవాది.

బౌద్ధాదులు కూడా పరమాణుకారణవాదులే అయినా, వారికి ముందు వైశేషికులను నిర్దేశించడం- ఇతడు వేదకుదృష్టి, వారు వేదబాహ్యులు- అనే కారణంగా. పాశుపతాదులలో పరమాణుకారణవాదులు, ప్రధానకారణవాదులు- అనే విభాగం ఉన్నా, వారంతా వేదబాహ్యులే.

పాశుపతాధికరణంలోని మొదటి సూత్రంతో ఆ మతానికి శ్రుతిమూలత్వం లేదని, తర్వాత మూడు సూత్రాలతో దానికి అనుమానమూలత్వం లేదని తెలిపారు.

బౌద్ధనిరాకరణ ప్రకరణంలో **"నాభావః ఉపలబ్ధేః" (2-2-27)** అని జగత్తు లేదనేది లేదు- అని పల్కడంద్వారా వ్యాసులు ప్రచ్ఛన్న బౌద్ధులను (అద్వైతులను) కూడా నిరసించినవారయ్యారు.

ఇదేవిధంగా, **"వైధర్మ్యాచ్చ న స్వప్నాదివత్" (2-2-28)** అని స్వాప్నార్థ వైషమ్యప్రదర్శనం ద్వారా జగత్ సత్యత్వాన్ని వ్యాసులు తెలిపారు. ఇది కూడా మృషావాది మత విపరీతమే కదా.

ఈ పాదంలో సాంఖ్యాదిమతాలకు వేద ప్రత్యర్థిత్వం లేదు - అని వ్యాసులన్నారు. సాంఖ్యాది మతాలు వేదవిరుద్ధార్థ ప్రతిపాదకాలు కనుక, అవి వేదానికి ఎదురు నిలువలేవు- అనిఁ, శ్రీపాంచరాత్రం వేదానుగుణవచనమైనందున దానికి వేద విరోధిత్వమే లేదు - అని వ్యాసుల అభిప్రాయం. పంచమవేదమైన మహాభారతంలో శ్రీపాంచరాత్రాన్ని చాలా శ్లాఘించిన వ్యాసులు, శారీరకంలో దానిని ఖండించే ప్రసక్తి లేనేలేదు కదా!

ఈ విధంగా బ్రహ్మం జగదేకకారణమనే విషయం సుస్థాపింపబడింది.

ద్వితీయాధ్యాయం - తృతీయపాదం (వియత్పాదం)

మొదటినుండి ఇప్పటివరకు ఆఱు పాదాలతో బ్రహ్మంయొక్క కారణత్వం చెప్పబడింది. ఇక, పై రెండు పాదాలతో జగత్తు యొక్క కార్యత్వం చెప్పబడుతున్నది.

ఈ పాదంలోను తర్వాత పాదంలోను జగత్తుయొక్క బ్రహ్మకార్యత్వం స్థిరీకరింపబడుతున్నది - అని తెలియాలి.

సర్వం నిత్యమని సాంఖ్యవాదం. సర్వం అనిత్యమని బౌద్ధుల వాదం. సర్వం నిత్యానిత్యమని జైనవాదం. నిత్యానిత్యాలను మార్పుగా పల్కుతారు వైశేషికులు. ఈ నల్గురి పక్షాలను నిరసించి వ్యాసులు, బ్రహ్మం కారణమే అని, జగత్తు తత్ కార్యమే- అని స్థాపించారు. ఇదే కదా వైదికమతం. అచిత్తుకు బ్రహ్మకార్యత్వం స్వరూపాన్యథా భావమని, చిత్తుకు బ్రహ్మకార్యత్వం స్వభావాన్యథాభావమని గ్రహించాలి.

ఈ పాదంలోని అధికరణాలు ఏడు. వీనిని **3+4=7** అనే రీతిలో విభాగించవచ్చు.

మొదటి మూడు అధికరణాలలో - ఆకాశాదులకు, జీవులకు బ్రహ్మకార్యత్వాన్ని వ్యాసులు పలికారు. ఇది పాదప్రధానార్థం. తర్వాత నాల్గు అధికరణాలలో జీవస్వరూప శోధనం చేయబడింది. ఈ పాదంలో ఈ నాల్గు ప్రాసంగికాలు. ఇక్కడ జీవుడు జ్ఞాత - అని పలికే వ్యాసులు అతని జ్ఞాతృత్వాన్ని ఒప్పుకోని మాయావాదులను, నిత్యజ్ఞాతృత్వాన్ని అంగీకరించని నైయాయికులను నిరసించారని గమనించాలి.

ద్వితీయాధ్యాయం - చతుర్థపాదం (ప్రాణపాదం)

ఈ పాదంలో ఇంద్రియాలు బ్రహ్మకార్యాలు- అని నిశ్చయింపబడుతున్నది.

ఈ పాదంలోని అధికరణాలు **8**. వీని **1+6+1=8** అనే రీతిలో విభాగించవచ్చు.

మొదటి అధికరణం, చమసాధికరణం - అనే రెండు ఈ పాదంలో సాక్షాత్ సంగతిని కల్గినవి. మధ్యలోని ఆఱు అధికరణాలు ప్రాసంగికాలు.

వియదధికరణ న్యాయానుసారంగా ప్రాణోత్పత్త్యధికరణంలోను, తేజోధికరణ న్యాయంలో సంజ్ఞామూర్తి క్లుప్త్యధికరణంలోను వ్యాసుల అర్థనిర్ణయం చేశారు.

వియదధికరణం నుండి వరుసగా **14** అధికరణాలలో సమష్టి సృష్టిని తెల్పి, సంజ్ఞామూర్తి అధికరణంలో వ్యష్టిసృష్టి నిరూపింపబడుతున్నదనే భేదాన్ని గమనించాలి.

అందువల్ల సమష్టి సృష్టికి, వ్యష్టిసృష్టికి శ్రీమన్నారాయణుడే కారణభూతుడని చెప్ప బడింది.

ఈవిధంగా ప్రథమాధ్యాయంలో తెలుపబడిన బ్రహ్మం యొక్క సర్వ కారణత్వాన్ని శ్రీవేదవ్యాసులు ద్వితీయాధ్యాయంలో స్థిరీకరించారు - అనేది వ్యక్తమైన అర్థం.

ప్రథమాధ్యాయం సమన్వయాధ్యాయం, ద్వితీయాధ్యాయం అవిరోధాధ్యాయం కదా!

ఇంతటితో పూర్వద్వికార్థం నిరూపింపబడింది.

ఉత్తరద్వికం

బ్రహ్మోపాసనను, తన్మూలంగా కలిగే మోక్షానందాన్ని ఈ ఉత్తరద్వికంతో వ్యాసులు తెల్పుతున్నారు.

తృతీయాధ్యాయం

ఈ అధ్యాయం నాల్గు పాదాలతో కూడినది. మూడవ పాదంలో ఉపాసనాన్ని విచారింపబోయే వ్యాసులు, దానికి అనుగుణంగా ఇతర విషయవైరాగ్యం కల్గడంకోసం జీవదోషాలను మొదటి పాదంలోను, భగవత్తృష్ణ కల్గడంకోసం ఆ స్వామి గుణాలను రెండవ పాదంతోను, బ్రహ్మవిద్యకు అంగమైన కర్మలను గూర్చి నాల్గవ పాదంలోను విచారిస్తున్నారు.

ఇది పాదవిభాగ క్రమం.

తృతీయాధ్యాయం - ప్రథమపాదం (వైరాగ్యపాదం)

ఈ పాదంలో జీవుని జాగ్రదాది దశలలో ఉండే దోషాలనుగూర్చి వ్యాసులు పూర్ణంగా తెల్పుతున్నారు. దోషదర్శనం కల్గితే వైరాగ్యం కల్గుతుంది కదా!

ఈ పాదంలో జీవుని సంసారబంధాన్ని, సంసారం యొక్క అపారమార్ద్యతను గూర్చి పలికే సూత్రకారులు, వీటిని అంగీకరించని సాంఖ్యమాయావాదులను నిరాకరించినట్లయినది.

ఈ పాదంలోని అధికరణాలు 6. వీనిని 1+5=6 అనే రీతిలో విభాగించవచ్చు. మొదటి అధికరణంలో, ఆరోహణ క్రమంలో దోషాలను, మిగిలిన అయిదు అధికరణాలలో అవరోహణ క్రమంలో దోషాలను వ్యాసులు తెల్పుతున్నారు.

ఈపాదం సంసారి జీవదోషపాదం.

తృతీయాధ్యాయం - ద్వితీయపాదం (ఉభయలింగపాదం)

శారీరకమీమాంసలో మొదటి రెండు అధ్యాయాలలో జగదేకకారణంగా చెప్పబడిన బ్రహ్మం, ఈ మూడవ అధ్యాయంలో మోక్షసాధనంగా చెప్పబడుతున్నది. సిద్ధోపాయమే కదా బ్రహ్మం. ఈ విధంగా ఇంతకుముందు, బ్రహ్మం సర్వజగత్కారణం గాను, ఇక్కడ మోక్షసాధనంగాను చెప్పబడినందున పౌనరుక్త్యదోషం ఏమాత్రం లేదు. సాధ్యోపాయమే కదా బ్రహ్మోపాసనం. దీనికి ఉపయుక్తంగా ఉండేవి- జీవదోషదర్శనం వల్ల కలిగే వైరాగ్యం, భగవద్గుణ దర్శనంవల్ల కలిగే తృష్ణ- అనే రెండు. ఇంతకుముందు ఇతర విషయవైరాగ్య సిద్ధికోసం ఇతరదోషాలను గూర్చి పల్కిన వ్యాసులు, ఈ పాదంలో పరమాత్మ విషయంలో అనురాగం కల్గడం కోసం పరమాత్మ కల్యాణగుణాలను పూర్ణంగా తెల్పుతున్నారు.

పరబ్రహ్మకు ఉభయలింగత్వమంటే- నిర్దోషత్వం, కల్యాణైక తానత్వం - అనేవి. వీనిని గూర్చి తెలిపే పాదం కనుక, ఇది ఉభయలింగపాదం. బ్రహ్మం నిర్దోషం, కల్యాణగుణాకరం- అని తెలిపే వ్యాసులు, బ్రహ్మం నిర్దోషం, నిర్గుణం, నిర్విశేషం- అని వాదించేవారి (మాయావాద) సిద్ధాంతాన్ని ఖండించినవారయ్యారు.

ఈ పాదంలోని అధికరణాలు 8. వీనిని 4+4=8 అనే క్రమంలో విభాగించవచ్చు. మొదటి నాల్గు అధికరణాలలో జీవుని స్వప్నసుషుప్త్యాది దశలలోని దోషాలను, తర్వాత గల అధికరణాలు నాల్గింటిలో పరమాత్మయొక్క కల్యాణగుణాలను, వ్యాసులు తెలిపారు. పరమాత్మగుణపరమైన ఈ రెండవ పాదంలో జీవదోషాలను గూర్చి పల్కడం ప్రధానం కాదు. ఆ నాల్గు అధికరణాలలోను పరమాత్మగుణాలే చెప్ప బడినవిగా గ్రహించాలి- అని పెద్దల అభిప్రాయం.

భగవంతుని స్వప్నపదార్థ స్రష్టృత్వానుగుణమైన గుణాలు ఇక్కడ చెప్పబడినవి- అని గ్రహించడం యుక్తం.

ద్వితీయపాదంలో మొదటి అధికరణ చతుష్టయం ప్రథమపాదశేషం - అని శ్రీసేనేశ్వరాచార్యులవారి అభిప్రాయం.

ఈ పాదంలో చివరి నాల్గు అధికరణాలను రెండు పేటికలుగా విభాగించవచ్చు.

మొదటి రెండిటిలో - అంటే - 5, 6 అధికరణాలలో- పరమాత్మకు తత్తత్స్థాన సంబంధంచేత దోషం సంక్రమించదు, అది సమస్తకల్యాణగుణ పరిపూర్ణమే - అని, జగత్ బ్రహ్మైక్యవచనసంగత దోషం కూడా లేదు - అని, బ్రహ్మం కల్యాణ గుణపరిపూర్ణమే - అని చెప్పబడింది.

తర్వాత రెండు అధికరణాలలో - అంటే, 7, 8 అధికరణాలలో - భగవానుని సర్వస్మాత్ పరత్వాన్ని, పరమౌదార్యాన్ని గూర్చిపల్కి, ఉపాస్యత్వాన్ని స్థిరీకరించారు. పరత్వ పూర్తి, ఔదార్యపూర్తి లేకపోతే ఉపాస్యత్వపూర్తి ఉండదు కదా!

ఉభయలింగాధికరణంలో- మొదటి సూత్రంతో బ్రహ్మం ఉభయలింగ విశిష్టమని, పదహాఅవ సూత్రంతో బ్రహ్మం ఉభయవిభూతి విశిష్టమని వ్యాసులు పలికారు.

ఉభయలింగవిశిష్టం, ఉభయవిభూతివిశిష్టం - బ్రహ్మం - అనేదే వేదాంత పక్షం- అని అన్నారు, పరమవైదికులైన వ్యాసులు.

పరాధికరణంలో పరత్వం, ఫలాధికరణంలో ఔదార్యత్వం చెప్పబడ్డాయి. సకలాధికారులకు ప్రయోజనాన్ని ఉద్దేశించేకదా ప్రవృత్తి కల్గుతుంది. ప్రయోజనాన్ని ఫలప్రదుడు లేకుండా పొందే అవకాశం లేదుకదా! ఫలప్రదునకు ఫల ప్రదత్వం అనేది పరత్వ- ఔదార్యాలు లేకపోతే కలుగదు. ఈ పరత్వ - ఔదార్యాలు రెండు ఉభయలింగ విశిష్టమైన నారాయణునకు తప్ప వేఱొకరికి లేదుకదా!

కర్మకాండలో చెప్పబడిన సర్వకర్మలచే సమారాధ్యుడై, దేవతాకాండోక్త సర్వదేవతాంతరాత్మయై, బ్రహ్మశబ్దవాచ్యుడైన నారాయణుడు చిదచిద్విలక్షణ జగదేక కారణభూతుడు. ఉపాయోపేయ భూతుడు, పరుడు - అని ఇంతవరకు పల్కి, ఫలాధికరణంలో అతడే సకలఫలప్రదుడు - అని శ్రీవ్యాసులవారు పల్కుతున్నారు.

తృతీయాధ్యాయం - తృతీయపాదం (గుణోపసంహారపాదం)

పూర్వం, పది పాదాలతో తత్త్వనిరూపణం చేయబడింది. ఇకపై, ఆఱు పాదాలతో అనుష్ఠాననిరూపణం చేయబడుతున్నది - అనేది పేటికావిభాగం.

పది పాదాలలో తత్త్వవివేక జ్ఞానాన్ని కలుగజేసిన వ్యాసులు. ఇక, ఆఱు పాదాలలో తత్త్వజ్ఞానానుగుణ హితాచరణాన్ని తెల్పుతున్నారని గ్రహించాలి.

ఈవిధంగా 10+6=16 అనే విధంగా శారీరకంలోని పాదాల పేటికా విభాగం చేయవచ్చు.

హితాన్ని మొదటి రెండు పాదాలతో, తత్త్వాన్ని తర్వాత నాల్గు పాదాలతోను వ్యాసులు తెల్పుతున్నారు.

ఈ మూడవ పాదం ఉపాయాన్ని తెల్పుతున్నది. నాల్గవ పాదం తదంగమైన కర్మను తెల్పుతున్నది - అనే విభాగాన్ని ఇక్కడ గ్రహించాలి.

గుణోపసంహారపాదమని ఈ మూడవ పాదానికి వ్యవహారం. బ్రహ్మం నిర్గుణం - అని పలికే గుణతస్కరులకు ఈ పాదం పూర్తిగా దుర్ఘటం. శ్రీపరాశర శ్రీపారాశర్య శ్రీపరాంకుశ శ్రీరామానుజాదులు గుణ పక్షపాతులు కదా!

పలు ఉపనిషత్తులలో చెప్పబడిన విద్యలను విచారించి, విద్యలకు ఐక్యం వ్యక్తమయితే, ఒక చోట చెప్పబడని, ఇంకొక చోట చెప్పబడిన గుణాలను ఉపసంహరించాలి- అని శ్రీవ్యాసులు ఈ పాదంలో స్థాపించారు. గుణోపసంహారపాదమే తప్ప, గుణసంహార పాదం కాదు, ఇది.

ఈ పాదంలోని అధికరణాల సంఖ్య-26. 19వ అధికరణంలో సర్వపర విద్యోపాస్యుడు నారాయణుడే - అని శ్రీవైష్ణవాగ్రేసరులైన వ్యాసులు స్థాపిస్తున్నారు.

తృతీయాధ్యాయం - చతుర్థపాదం (అంగపాదం)

ఈ అధ్యాయంలోని - మొదటి పాదంలో - ఫలకామనతో కర్మం త్యాజ్యమని చెప్ప బడింది. ఇక్కడ స్వరూపేణ కర్మ ఉద్దేశ్యం - అని ఈ పాదంలో తెలుపబడుతున్నది.

ఈ అంగపాదంలో ఉపాయమైన ఉపాసనకు అంగమైన కర్మం విచారింప బడుతున్నది.

కర్మకాండలో కర్మం విచారింపబడినా, అది ఫలసంగయుక్తమైతే, అది కేవలకర్మ అవుతుంది. అది భగవత్ కైంకర్యత్వవిధురమవుతుంది. అటువంటిది అనిత్యఫలకం. అది త్యాజ్యం. ఇక్కడ చెప్పబడే కర్మ ఉద్దేశ్యమైనది. ఉపాసనాంగమైనది. కర్మకాండలో

స్వర్గాది సాధనంగా చెప్పబడిన కర్మలే ఇక్కడ ఉపాసనాంగాలు చెప్పబడుతున్నాయి. ఇదే వినియోగపృథక్త్వన్యాయం.

ఈ పాదంలోని అధికరణాలు 15.

మొదటి అధికరణంలో, కర్మల అంగత్వసిద్ధికోసం విద్యయొక్క అంగిత్వాన్ని వ్యాసులు స్థిరీకరిస్తున్నారు.

రెండవ, మూడవ, పదకొండవ అధికరణాలు ప్రాసంగికాలు. తర్వాత అంగవిచారం చేయబడుతున్నది.

కర్మలు, శమదమాదులు, పాండిత్యబాల్యమౌనాలు అంగాలని ఈపాదంలో నిరూపిస్తున్నారు.

ఈ విధంగా అంగచింతన చేసిన వ్యాసులు, పద్నాలుగవ, పదిహేనవ అధికరణాలలో అంగినిష్పత్తి సమయచింతను చేస్తున్నారు - అనే పేటికా విభాగాన్ని ఇక్కడ గమనించాలి.

బ్రహ్మవిద్యకు కర్మం అంగమని ఈ పాదంలో పలికే వ్యాసులు, వాక్యార్థ జ్ఞానమాత్రం సాధనమని పలికే శాంకరమతాన్ని, జ్ఞానకర్మ సమసముచ్చయవాది అయిన యాదవప్రకాశమతాన్ని, జ్ఞానమే కర్మకు అంగమని పలికే నిరీశ్వర మీమాంసక మతాన్ని, జీవులు నిత్యముక్తులు, మోక్షం సాధ్యం కాదని పలికే సాంఖ్యమతాన్ని నిరసించారు.,

బ్రహ్మవిద్య మోక్షసాధనం - అంగి, కర్మలు - తదంగాలు అనే సిద్ధాంతాన్ని ఇందులో వ్యాసులు స్థాపించారు.

చతుర్థాధ్యాయం (ఫలాధ్యాయం)

ఈ అధ్యాయంలోని పాదాలను నాల్గింటిని 2+2=4 అనే రెండు పేటికలుగా విభాగించవచ్చు. ఉత్తరపూర్వాఘ అశ్లేషవినాశాలు, ఉత్క్రాంతి - అనే రెండిటిని బ్రహ్మవిద్యా ఫలాలుగా పూర్వపాదద్వయంలో వ్యాసులు పల్కుతున్నారు. ఇవి రెండు స్థూలదేహయుక్తకాలంలో ఏర్పడే ఫలాలు.

తర్వాత గల రెండు పాదాలలో అర్చిరాది మార్గగమనాన్ని, భగవత్ప్రాప్తి రూపమైన ఫలాలను తెల్పుతున్నారు. ఇవి స్థూలదేహాన్ని విడచినవానికి కలిగే ఫలాలు. ఈవిధంగా ఇచటి విభాగం చేయవచ్చు.

శారీరకంలో మొత్తం 156 అధికరణాలున్నాయి. మొదటి నాల్గు ఉపోద్ఘాత రూపాలు. తరువాత 125 అధికరణాలలో బ్రహ్మం, బ్రహ్మవిద్య నిరూపింపబడింది. తరువాత 27 అధికరణాలలో బ్రహ్మవిద్యాఫలాన్ని నిరూపిస్తున్నారు. ఈవిధంగా శారీరకంలో 156 అధికరణాలలో - ఉపోద్ఘాతం, బ్రహ్మం, బ్రహ్మవిద్యఫల(ప్రతిపాదక భాగాలు- అనేది పేటికా విభాగం.

చతుర్థాధ్యాయం - ప్రథమపాదం (ఆవృత్తిపాదం)

ఈ పాదంలో 11 అధికరణాలున్నాయి. వీనిని 6+5=11 అనే రీతిలో విభజించవచ్చు.

మొదటి ఆఱు అధికరణాలలో విద్యాస్వరూపశోధనం చేయబడింది. తర్వాత అయిదు అధికరణాలలో విద్యాఫలాన్నిగూర్చి తెలుపబడింది.

బ్రహ్మవిద్య మోక్షసాధనమే అయినా, దానిని ఈ ఫలాధ్యాయంలో వ్యాసులు విచారించినందువల్ల- దానికి సాధనత్వమనేది ఆగంతుకమని, ఫలత్వమే స్వాభావికాకారమని తెలియవచ్చు.

చతుర్థాధ్యాయం- ద్వితీయపాదం (ఉత్క్రాంతిపాదం)

స్థూలదేహస్థితికాలంలో కలిగే ఫలమైన ఉత్తరపూర్వాఘాల అశ్లేష వినాశాలను గూర్చి మొదటి పాదంలో పల్కిన వ్యాసులు, మరణకాలంలో ఏర్పడే ఫలాన్ని ఈ పాదంలో తెల్పుతున్నారు.

ఈ పాదమే సాంఖ్య-మాయావాదులకు అసంగతం. మోక్షాన్ని అసాధ్యం (సిద్ధం)గా పలికే సాంఖ్యులు, ఇక్కడే మోక్షమనే అద్వైతులు ఈ ఉత్క్రాంతి పాదంలో నిరసింపబడ్డారు.

చతుర్థాధ్యాయం - తృతీయపాదం (గతిపాదం)

మౌకుందముక్తి ఘంటాపథనిర్ణయం ఈ పాదంలో చేయబడుతున్నది.

అనాదికాలంగా సంసారంలో సంచరించే సంసారిజీవుడు అజ్ఞాత సుకృత మూలంగా మోక్షమార్గంలో ప్రవృత్తిని కలవాడు కావడం, కర్మజ్ఞానభక్తి నిష్ఠ, విద్యాభేదాలు, తత్తదధికారాలు, పరమాత్మోపాసనంవల్ల విరోధి నివృత్తి అర్చిరాది మార్గగమనం-

అని మొదలైన సకలార్థాలను నిర్విశేష బ్రహ్మవాదులు అంగీకరించారు. ఇవి అన్నీ వ్యావహారికాలు. నిర్విశేషబ్రహ్మతాదాత్మ్యప్రాప్తియే పరమమోక్షం- అని పలికే వాదం కేవలం కంఠశోష తప్ప, అది శారీరకంలో ఎక్కడా చెప్పబడలేదు. అది పంచమాధ్యాయమ్యగ్యం. ఉత్సూత్రమని భావం.

వ్యాసుల తాత్పర్యం ఇదే. ఇదే శ్రీరామానుజమతం.

చతుర్థాధ్యాయం - చతుర్థపాదం (ముక్తిపాదం) అఘహానాన్ని మొదటి పాదంలో, స్థూలదేహహానాన్ని రెండవ పాదంలో, సూక్ష్మదేహ హానాన్ని మూడవ పాదంలో పల్కిన వ్యాసులు, నాల్గవ పాదంలో ముక్తి నిర్ణయాన్ని చేస్తున్నారు.

ఈ పాదంలోని అధికరణాలు 6. వాటిని 3 + 3 గా విభజించవచ్చు. స్వరూపావిర్భావమే మోక్షమనే విషయాన్ని మొదటి మూడు అధికరణాలలోను, తదనుగుణ వృత్తివిశేషాన్ని తర్వాత మూడు పాదాలలోను తెలిపారు. కర్మాంగకమైన భక్తియోగంతో పరమాత్మను ఆశ్రయించిన జీవులు, ఆ స్వామి కరుణతో నిర్ధూతపాపుడై, సూక్ష్మనాడీ విశేషంతో శరీరంనుండి నిర్గమించి, అర్చిరాదిమార్గంద్వారా పరమపదాన్ని చేరి, ఆవిర్భూత స్వస్వరూపుడై, పరమాత్మను పరిపూర్ణంగా అనుభవించి, అవునరా వృత్తిని కలవాడై, ఉజ్జీవిస్తాడని శారీరకంలో వ్యాసులు నిర్ణయించారు.

మీమాంసాకాండత్రయంలోకూడా మాయావాదగ్రంథ ప్రసంగమనేది లేనేలేదని అంటారు - పరమ వైదిక సార్వభౌములు.

ఇత్థం శ్రీభాష్యసారాంశా యథామతి విచారితాః।
వేళుక్కుడిశ్రీవరద సూరిణామృతవర్షిణా ॥